అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

మంగళవారం 13-2-2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 46 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00



సంపన్న సీఎంలు

31మంది ముఖ్యమంత్రుల్లో.. 25మంది కోటీశ్వరులు

- 11మంది సీఎంలపై క్రిమినల్ కేసులు
- రూ.177 కోట్లతో చంద్రబాబు మొదటి స్థానం
- కేసీఆర్ ఆస్తులు రూ.15 కోట్ల 15 లక్షలు
- 22 క్రిమినల్ కేసులతో దేవేంద్ర ఫడ్నవీస్(బీజేపీ) రికార్డు: ఏడీఆర్,నేషనల్ ఎలక్షన్ వాచ్ రిపోర్టు

న్యూఢిల్లీ: దేశంలోని ముఖ్యమంత్రుల్లో 25మంది కోటీశ్వరులు కాగా, 11మందిపై క్రిమినల్ కేసులున్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్), నేషనల్ ఎలెక్షన్‌వాచ్ తమ తాజా నివేదికలో వెల్లడించాయి. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల 31మంది ముఖ్యమంత్రుల్లో 11మంది(35 శాతం)పై క్రిమినల్ కేసులున్నట్టు వారు స్వయంగా ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్లలో తెలిపారని నివేదిక స్పష్టం చేసింది. రూ.100 కోట్లకు పైగా ఆస్తులు చూపినవారిలో ఇద్దరు, 10 నుంచి 50 కోట్ల మధ్య ఆరుగురు, 1 నుంచి 10 కోట్ల మధ్య 17మంది, కోటికన్నా తక్కువ చూపినవారిలో ఆరుగురు ముఖ్యమంత్రులున్నారు.



సంపదలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.177 కోట్లతో మొదటి స్థానంలో ఉండగా, అరుణాచల్‌ప్రదేశ్ సీఎం పెమాఖండూ(బీజేపీ) రూ.129 కోట్లతో రెండో స్థానంలో, పంజాబ్ సీఎం కెప్టెన్ అమరీందర్‌సింగ్ (కాంగ్రెస్) రూ.48 కోట్లతో మూడో స్థానంలో ఉన్నారు. ముఖ్యమంత్రులందరిలోకి అతి తక్కువ ఆస్తుల(రూ.26 లక్షలు)తో త్రిపుర సీఎం మాణిక్‌సర్కార్(సీపీఐ(ఎం)) రికార్డు సృష్టించారు. తక్కువ ఆస్తుల్లో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ (టీఎంసీ) రూ.30 లక్షలతో, జమ్మూకాశ్మీర్ సీఎం మెహబూబా ముఫ్తీ(పీడీపీ) రూ.50 లక్షలతో రెండు, మూడో స్థానాల్లో ఉన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ తన ఆస్తుల్ని రూ.15కోట్ల 15 లక్షల 82 వేలుగా ఎన్నికల కమిషన్‌కు చూపారు. క్రిమినల్ కేసుల్లో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్(బీజేపీ) 22 కేసులతో మొదటిస్థానంలో ఉన్నారు. వాటిలో మూడు సీరియస్ కేసులు. 31మంది ముఖ్యమంత్రుల్లో ముగ్గురు మాత్రమే మహిళలు. వయసురీత్యా అందరికన్నా పిన్న వయసు సీఎంగా 35 ఏండ్ల పెమా ఖండూ(అరుణాచల్‌ప్రదేశ్), పెద్ద వయస్కుడిగా 74 ఏండ్ల అమరీందర్‌సింగ్(పంజాబ్ సీఎం) రికార్డయ్యారు.

డాక్టర్ల కొరత

దేశంలో సగటున 1597మందికి ఓ డాక్టర్: కేంద్రం

- 1000మందికి ఒకరుండాలి: డబ్ల్యూహెచ్‌వో
- ప్రభుత్వ వైద్యశాలల్లో పేరుకుపోతున్న ఖాళీలు
- గ్రామీణ ప్రాంతాల పట్ల శ్రద్ధ చూపని ప్రభుత్వాలు



న్యూఢిల్లీ: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల పట్ల అటు కేంద్రంగానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలుగానీ శ్రద్ధ చూపడంలేదన్న విమర్శలున్నాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనూ ఇదే అంశం మరోసారి చర్చకు వచ్చింది. దేశంలో అర్హులైన డాక్టర్లు ఎంతమంది ఉన్నారని అడిగిన ప్రశ్నకు ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సహాయమంత్రి అశ్వినీకుమార్ చౌబే సమాధానమిచ్చారు. 2017, సెప్టెంబర్ 30 నాటికి పలు రాష్ట్రాల వైద్య మండళ్లలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారి సంఖ్య 10, 41,395 అని మంత్రి తెలిపారు. అయితే, వాస్తవంగా ప్రాక్టీస్ చేస్తున్నది 9లో

రైతులకు రూ. 50వేల రుణమాఫీ

- రాజస్థాన్‌లో ఎన్నికల బడ్జెట్!



జైపూర్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజస్థాన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో రైతులకు రుణమాఫీ ప్రకటించింది. ఒకే విడతలో 50వేల రూపాయల వరకు మాఫీ చేయబోతున్నట్టు తెలిపింది. దీంతో ఖజానాకు ఎనిమిది వేల కోట్ల రూపాయల భారం పడనుందని తెలిపింది. అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడుతూ.. ముఖ్యమంత్రి వసుంధర రాజే రైతుల రుణాన్ని మాఫీ చేయడంలో భాగంగా ఒక కమిషన్ ఏర్పాటు చేస్తామని, రైతులు ఆ కమిషన్ ఆశ్రయించి ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ లబ్ది పొందవచ్చని తెలిపారు. రైతులను బుజ్జగించే ప్రయత్నంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఏడు లక్షల కొత్త విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఈ నెలలో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఓటమిపాలైన అల్వార్ జిల్లాలో వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అలాగే 80ఏండ్ల వృద్ధులకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించనున్నట్టు ప్రకటించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలను పెంచుతామని తెలిపారు. ఇటీవలే రైతుల ఆందోళనలు వెల్లువెత్తిన అనంతరం బీజేపీ పాలిత రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు రైతులకు రుణమాఫీ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా రాజస్థాన్ ప్రభుత్వమూ రుణమాఫీని ప్రకటించింది.

45 రోజుల్లో ఖర్చుచేస్తాం

రూ.14,375 కోట్లలో రూ.6,689 కోట్లు ఖర్చుచేశాం



- నిధులు మురిగిపోకుండా ప్రణాళిక రూపొందించాం
- అదనపు బడ్జెట్‌తోనైనా దళితుల అభివృద్ధికి తోడ్పడతాం
- ఎస్సీల ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టం అమలుపై మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దళితుల అభివృద్ధికి ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.14,375.3 కోట్లు కేటాయించామని విద్యుత్, ఎస్సీ అభివృద్ధి శాఖ జి జగదీశ్‌రెడ్డి చెప్పారు. ఇప్పటి వరకు రూ.6,689 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం పూర్యయ్యేలోగా మిగిలిన రూ.7,686 కోట్లను 45 నుంచి 50 రోజుల్లో ఖర్చు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం సచివాలయంలో ఎస్సీల ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టం అమలుతీరుపై సమీక్షా సమావేశం 9లో



ఆర్మీకి 6 నెలలు పట్టొచ్చు.. మాకు 3 రోజులు చాలు

- సరిహద్దుకు సైన్యాన్ని పంపడానికి : ఆర్ఎస్ఎస్ చీఫ్ భగవత్

ముజఫర్‌పూర్ : యుద్ధ పరిస్థితి వస్తే.. సరిహద్దుకు సైన్యాన్ని పంపడానికి ఆర్మీకి ఆరు నెలలు పట్టొచ్చేమోకానీ, తమ సైన్యాన్ని పంపాలంటే కేవలం మూడు రోజులు చాలనీ ఆర్ఎస్ఎస్ నేత మోహన్ భగవత్ అన్నారు. బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో ఆరురోజులుగా జరుగుతున్న కార్యకర్తల సమావేశంలో మోహన్ భగవత్ మాట్లాడుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'సంఘ్ మూడు రోజుల్లో సైన్యాన్ని 9లో

దేశాన్ని మార్చేలా ఆర్ఎస్ఎస్ కుట్ర

- ముస్సోలిని ఇటలీలా, హిట్లర్ జర్మనీలా పేర్కొంటూ మత రాజకీయం
- ఆర్మీపై ఆర్ఎస్ఎస్ క్షమాపణ చెప్పాలి : పినరయి విజయన్



తిరువనంతపురం : భారత ఆర్మీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ క్షమాపణ చెప్పాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ డిమాండ్ చేశారు. భగవత్ ప్రకటనపై వివరణ ఇవ్వాలని ప్రధాని నరేంద్రమోడీని కోరారు. 'భారత సైన్యంపై భగవత్ చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ వ్యతిరేకం. భారత రాజ్యాంగంపై సంఘ్‌కు గౌరవం లేదని ఆయన మాటలు మరోసారి స్పష్టమైంది. మస్సోలినీ ఇటలీలా, హిట్లర్ జర్మనీలంటూ మత రాజకీయంతో దేశాన్ని ఆర్ఎస్ఎస్ మార్చాలను కుంటున్నది' అని విజయన్ విమర్శించారు. 'హిందూ టెర్రరిజం గురించి మేం హెచ్చరించినట్టే.. ఆయన సమాంతర సైన్యం గురించి ఆయన మాట్లాడారు. సైన్యాన్ని నడపడం రాజద్రోహమే' అని విజయన్ ట్వీట్ చేశారు. మోహన్ భగవత్ భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేరళ ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు.

సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా మధు

- 60 మందితో రాష్ట్ర కమిటీ ఎన్నిక
- 15 మందితో కార్యదర్శివర్గం.. ఆహ్వానితులుగా 10 మంది
- ప్రత్యేక ఆహ్వానితులుగా ఐదుగురు
- జాతీయ మహాసభల ప్రతినిధులుగా 23 మంది
- రాష్ట్ర బాధ్యతల్లోకి శ్రీనివాసరావు ఐదుగురితో కంట్రోల్ కమిషన్



మధుతో ఏచూరి

పర్స సత్యనారాయణనగర్ (భీమవరం) నవతెలంగాణ ప్రతినిధి

సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు మళ్లీ ఎన్నికయ్యారు. 15 మందితో కార్యదర్శివర్గం ఎన్నికైంది. 60 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఏపీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎం.ఏ.గఫూర్, వి.శ్రీనివాస రావు, వై.వెంకటేశ్వరరావు, వి.కృష్ణయ్య, సిహెచ్.నరసింగరావు, మిడియం బాబూరావు, ఎం.వి.ఎస్.శర్మ, 9లో

ఆరోగ్యవంతులా..కాదా ?

క్షణాల్లో చెప్పేస్తుంది

- దేశంలో..ఆల్గారిథంతో పనిచేసే తొలి పరికరం 'విన్ సెన్స్'
- తయారుచేసిన ఐఐటీ-మద్రాస్ శాస్త్రవేత్తలు



వివరాలు 6లో

జీఎస్టీ ఫ్రెండ్లీ పన్ను కాదు

- పన్ను విధానాన్ని సరళీకరించండి: బాంబే హైకోర్టు



ముంబయి: ప్రభుత్వ వస్తు సేవల పన్ను (జీఎస్టీ) స్నేహపూర్వకమైన పన్ను విధానం కాదని బాంబే హైకోర్టు అభిప్రాయపడింది. జీఎస్టీపై కేంద్రప్రభుత్వం చేసుకుంటున్న ఆర్భాటపు ప్రచారం అర్థరహితమని వ్యాఖ్యానించింది. న్యాయమూర్తులు ఎస్సీ ధర్మాధికారి,భారతీ డాంగ్రెతో కూడిన ధర్మాసనం జీఎస్టీ పన్నువిధానంపై ఈ వ్యాఖ్యలు చేసింది. ఎబికార్ అండ్ బెంజల్ టెక్నోవెల్డ్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ తయారుచేసే రోబోటిక్ ఆటోమెటిక్ పరికరాల తయారీపై జీఎస్టీ 9లో

జూబ్లీహిల్స్‌లో భారీ పేలుడు

- కుప్పకూలిన ఇల్లు
- ఓ మహిళకు గాయాలు
- భయాందోళనతో పరుగులు తీసిన స్థానికులు
- బాంబుస్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 48లో సోమవారం భారీ పేలుడు సంభవించింది. ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో ఆ ప్రాంతమంతా ఉలిక్కి పడింది. ఏం జరిగిందోనని స్థానికులు భయంతో పరుగులు తీశారు. డిటోనేటర్లు పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. పేలుడు ధాటికి ఓ ఇల్లు కుప్పకూలగా మరికొన్ని ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో ఓ మహిళకూ స్వల్పగాయాల య్యాయి. జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 48లోని ప్లాట్ నెంబర్ 969లో ఖాళీ స్థలం ఉంది. ఇది సిద్ధార్థ కన్‌స్ట్రక్షన్స్ పేరు మీద ఉంది. ఇక్కడ రాజస్థాన్‌కు చెందిన ఆశారం, భగవతి కాపాలదారులుగా ఉంటున్నారు. ఈ స్థలంలో నిర్మాణ పనులు చేపట్టేందుకు 9లో

ఎన్నికల తర్వాత కరెంట్ చార్జీల బాదుడు!

రూ.9970.98 కోట్లకు పెరిగిన డిస్కంల ఆదాయ లోటు

- ఉదయ్‌లో చేరినా...పెరిగిన లోటు
- ఎన్నికల తర్వాత చార్జీలు పెంచేందుకు అనుమతించొద్దు
- పరిశ్రమలపై క్రాస్‌సబ్సిడీ, అదనపు సర్‌చార్జీలు ఎత్తేయాలి
- సేద్యానికి 24గంటల సరఫరా ఎవర్ని అడిగి ఇస్తున్నారు?: టీఎస్ఈఆర్సీ బహిరంగ విచారణలో పలువురి ఆందోళన
- సబ్సిడీపై సర్కార్ ఎస్కేప్

వివరాలు 9లో



విచారణకు హాజరైన అధికారులు, ప్రతినిధులు



ఇస్మాయిల్ అలీఖాన్, హెచ్ శ్రీనివాసులు



ఎమ్ వేణుగోపాలరావు

సహోద్యోగిపై లైంగిక వేధింపులు..

ప్రముఖ శాస్త్రవేత్తపై వేటు

న్యూఢిల్లీ: సహోద్యోగిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ప్రముఖ శాస్త్రవేత్త కనౌరి వి.ఎస్.రావును విధుల నుంచి తొలగించిన విషయం అలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఫరీదాబాద్‌లోని ట్రాన్స్‌లేషన్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్ (టీహెచ్‌ఎస్‌టీఐ)లోని ఇమ్యూనాలజీ విభాగంలో శాస్త్రవేత్తగా పనిచేసేవారు. ఆయనను గతనెల 17న విధుల నుంచి తొలగించిన విషయాన్ని టీహెచ్‌ఎస్‌టీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గంగన్‌దీప్ కాంగ్ ధృవీకరించారు. సహోద్యోగినిని లైంగికంగా వేధించినట్టు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. ఈ విషయాన్ని దర్యాప్తు చేయడానికి ఏడుగురు సభ్యులతో కూడిన అంతర్గత ఫిర్యాదు కమిటీని ఆ సంస్థ ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా అతన్ని విధుల నుంచి తొలగించామని గంగన్‌దీప్ తెలిపారు.

లైంగిక దాడిని ప్రతిఘటించిన బాలిక సజీవ దహనం

రాజగఢ్: తనపై లైంగిక దాడి యత్నాన్ని ఎదిరించిన ఓ బాలికపై కిరోసిన్ పోసి నిప్పుపెట్టాడో దుర్మార్గుడు. మధ్యప్రదేశ్‌లోని ఓ గ్రామంలో జరిగిన ఈ ఘటనపై సమాచారం తెలుసుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన బాధితురాలిని వైద్యచికిత్సకుతరలించి, ఆ యువకుడిన అరెస్ట్ చేశారని అధికారులు చెప్పారు. ఈ దాడిలో బాధితురాలికి తీవ్ర గాయాలయ్యాయని, ఆమె రాజ్‌గఢ్‌లోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నదని, ఆమె పరిస్థితి విషమంగా వున్నట్టు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు పొలంపనులకు వెళ్లటంతో ఆ బాలిక ఇంట్లో ఒంటరిగా వుండటాన్ని గమనించిన ఆ యువకుడు ఇంట్లో ప్రవేశించి ఆమెపై దాడికి యత్నించాడని పోలీసు అధికారి ఇంద్రరాజ్‌సింగ్ చెప్పారు. ఆమె ఎదురు తిరగటంతో అక్కడే వంట కోసం నిల్వ చేసుకున్న కిరోసిన్‌ను ఆమెపై పోసి నిప్పుపెట్టాడని తెలిపారు..

మరుగుదొడ్డి కోసం మహిళ భిక్షాటన

పాట్నా: బలహీన వర్గాలకు చెందిన ఒక మహిళ తన ఇంట్లో మరుగుదొడ్డి నిర్మాణం కోసం భిక్షాటన ద్వారా నిధులు సేకరించిందని ఒక అధికారి వివరించారు. కోశీనది వరద ప్రభావిత ప్రాంతమైన సుపౌల్ జిల్లా పిప్రా బ్లాక్‌లోని పాత్రా ఉత్తర్ గ్రామానికి చెందిన అమీనా ఖాటూన్ అనే మహిళ తన ఇంటిలో మరుగుదొడ్డి నిర్మాణం కోసం పరిసర గ్రామాలలో భిక్షాటన ద్వారా నిధులు సేకరించిందన్నారు. ఆమె చిత్తశుద్ధిని గుర్తించిన తాపీమేస్త్రీ, కూలీలు ఆమెను నుంచి డబ్బులు తీసుకోకుండానే నిర్మాణం జరిపారు. ఇంటిలో మరుగుదొడ్డి నిర్మాణం కోసం విశేషంగా శ్రమించిన ఆమెను జిల్లా అధికార యంత్రాంగం ఘనంగా సత్కరించింది. నలభయ్యో పడిలో వున్న ఈమె తన జీవనాధారం కోసం రోజుకూలీగా పనిచేస్తోంది. తన ఇంటిలో మరుగుదొడ్డి నిర్మాణానికి నిధులు అందించాలంటూ ఆమె బ్లాక్ అధికారుల చుట్టూ తిరిగినప్పటికీ వారు ఆమె వినతిని పెడచెవినపెట్టారు. ఒకవైపు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ భారత్ పథకాన్ని అమలు చేస్తుంటే, మరోవైపు అధికారులు ఈ మహిళ వినతిని నిరాకరించటం గమనార్హం.

భారత్ ఒక ఆకర్షణీయమైన వాణిజ్య దేశం

- **మస్కట్ పారిశ్రామిక ప్రముఖులతో మోడీ**

మస్కట్ : విదేశీ వాణిజ్యానికి భారత్ ఒక ఆకర్షణీయమైన ప్రదేశమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. మస్కట్‌లో జరిగిన భారత్-ఒమన్ వాణిజ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గల్ఫ్-పశ్చిమాసియా ప్రాంత పారిశ్రామిక ప్రముఖులను సోమవారం ఆయన కలుసుకున్నారు. ప్రధాని మోడీ ఆదివారం దుబాయ్ నుంచి మస్కట్ చేరుకున్నారు తన మూడు దేశాల పర్యటనలో భాగంగా చివరి మజిలీగా మస్కట్ చేరుకున్నారు. సోమవారం ఒమెన్ ఉప ప్రధాన మంత్రి సయ్యాద్ అస్సాద్ బిన్ తరీఖ్ అల్ సయిద్‌తో సమావేశమయ్యారు. పరస్పర ప్రయోజనకర రంగాలలో ద్వైపాక్షిక సహకారంపై నేతలిరువురూ చర్చించారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రవీష్ కుమార్ ట్వీట్ చేశారు.

'చీరకట్టు'.. డిజైనర్ వ్యాఖ్యలపై విమర్శల వెల్లువ

ముంబయి: చీరకట్టుపై డిజైనర్ సభ్యసాచీ చేసిన వ్యాఖ్యలపై ట్విట్టర్ వేదికగా విమర్శలు వెల్లువెత్తాయి. చీరకట్టు మన సంస్కృతి అని, భారతీయ మహిళలు తప్పకుండా చీరకట్టడం నేర్చుకొని ఉండాలని ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. ట్విట్టర్ వేదికగా శనివారం ఆయనపై నెటిజన్లు విమర్శలు గుప్పించారు. 'ఇలాంటి సంకుచిత వ్యాఖ్యలు చేస్తారని అనుకోలేదు, నాకూ చీరకట్టడం రాద'ని ఓ యువతి ట్విట్టర్‌లో వాఖ్యానించింది. 'సభ్యసాచీ..మీరు ఈ వ్యాఖ్యలు చేసినందుకు సిగ్గుపడుతున్నాను. ప్రతి పురుషుడు సంస్కృతిపేరిట మహిళను అణచివేయడానికే ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళకు చీరకట్టడం వస్తే అన్ని సమకూరినట్టేనా..?'అని మరో యువతి ప్రియాంక స్పందించారు. 'మనమందరం మన సంస్కృతి తెలుసుకోవాలి. నిజమే. కానీ తెలియని వారిని కించపరచడం సరైంది కాదని' మరో యూజర్ ఖలెద్ హూసేని వ్యాఖ్యానించారు. 'మీరు ఒక్కో చీరను 80వేల రూపాయల చొప్పున అమ్మడం వల్ల కొంతమంది యువతులు చీరలు కట్టుకోలేకపోతున్నార'ని కమెడియన్ తన్మయ్ భట్ వ్యాఖ్యానించారు.

కాశ్మీర్‌లో మరో 'ఉగ్ర'దాడి

- **ఎదురుకాల్పుల్లో జవాను మృతి**

శ్రీనగర్ : ఉగ్రవాదులకు, సిఆర్‌పిఎఫ్ జవాన్లకు మధ్య సోమవారం ఉదయం జరిగిన కాల్పుల్లో ఒక జవాను మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. శ్రీనగర్‌లోని కారానగర్ ప్రాంతంలోని అత్యంత కీలకమైన పారా మిలటరీ ఫోర్స్‌కు చెందిన 23 బెటాలియన్ క్యాంప్ లక్ష్యంగా ఇద్దరు ఉగ్రవాదులు ఎకె-47 రైఫిల్స్‌తో దాడికి పాల్పడ్డారు.. భద్రతాదళాలు ఎదురుకాల్పులు జరపడంతో వారిద్దరు క్యాంప్‌కు ఎదురుగా నిర్మాణంలో ఉన్న భవనంలో ఆశ్రయం పొందినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో ఇరుపక్షాల మధ్య కాల్పులు జరిగాయని, అయితే ఉగ్రవాదులు తప్పించుకున్నట్లు సైనికాధికారులు పేర్కొన్నారు. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, శ్రీనగర్‌లోని కారానగర్ ప్రాంతాన్ని తమ అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఉగ్రవాదులు గత వారం నుండి ఆర్మీ క్యాంప్‌లను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారు.

రైల్వేల్లో సూపర్ పాస్ట్ అవినీతి

- **మూడేండ్లలో 18,600 కేసులు**

చెన్నై: భారత ప్రభుత్వ అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ అయిన రైల్వేల్లో అవినీతి పరుగులు తీస్తోంది. గడిచిన మూడేండ్లలో రైల్వే డిపార్ట్‌మెంట్‌లో 18,600 కేసులు నమోదయ్యాయంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వం పార్లమెంట్‌లో గతవారం విడుదల చేసిన నివేదికలో ఈ వివరాలు తెలిపింది. దీని ప్రకారం అత్యధికంగా ఉత్తర రైల్వే నుంచి 6,121 కేసులు నమోదవ్వగా, 1,955 కేసులు ధక్షిణ రైల్వేలో నమోదయ్యాయి. రైల్వే సర్వెంట్స్ డిసిప్లిన్ అండ్ అప్పీల్ చట్టం 1968 ప్రకారం ఈ కేసులు నమోదైనట్టు అధికారులు తెలుపుతున్నారు.

నాగాలాండ్ ఎన్నికల్లో సెక్యులర్ అభ్యర్థులకు మద్దతు : కాంగ్రెస్

కోహిమా : నాగాలాండ్‌కు జరిగే అసెంబ్లీ ఎన్నికలలో తాము పోటీ చేయని స్థానాలలో సెక్యులర్ పార్టీ అభ్యర్థులకు మద్దతిస్తామని కాంగ్రెస్ తెలిపింది. బీజేపీతో పాటు దాని భాగస్వామ్య పార్టీలు అధికారంలోకి రాకుండా నిలువరించేందుకు లౌకిక పార్టీ అభ్యర్థులకు మద్దతివ్వనున్నట్టు నాగాలాండ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి (ఎన్‌పీసీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. నాగాలాండ్ అసెంబ్లీకి ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 60 అసెంబ్లీ స్థానాలకు గాను కాంగ్రెస్ 19 స్థానాల్లో పోటీ చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ తరుపున 20 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. వీరిలో ఒకరు తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నారు. కాగా నేషనలిస్టు డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ)తో కలిసి బీజేపీ కూటమిగా ఏర్పడింది. మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన సిట్టింగ్ ఎంపి నీఫి రియో నేతృత్వంలో ఈ కూటమి ఏర్పడింది.

కాషాయవలను ఛేదిస్తూ..

జనం ముందుకు జనధీర



దేశంలోనే చాలా చిన్న రాష్ట్రం. ఎన్నికల వేళ... త్రిపుర ఎర్రకోటకు మందిమార్బలంతో బీజేపీ అధినాయకత్వం పోలోమంటూ పరుగులు తీస్తున్నది. స్థానిక వేర్పాటువాద నీడలో కాషాయజెండా ఎగురవేయటానికి మోడీ మంత్రగణం త్రిపురలో పాగా వేసింది. వేడెక్కిన ఎన్నికల ప్రచారంలో కాషాయ వలసపక్షులు కోట్లు కుమ్మరిస్తున్నాయి. త్రిపుర ముఖచిత్రంలో నాణేనికి ఇది ఒకవైపైతే.. మరోవైపు ఆ రాష్ట్రముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ బీజేపీ నాయకత్వ ఆరోపణలను తనదైన శైలిలో తిప్పికొడుతూ విస్తృత ప్రచారంతో దూసుకెళ్తున్నారు. కోట్ల కోసం పాకులాడే సీఎంలా కాకుండా.. ప్రజా మనిషిగా మరోసారి ఎన్నికల రణరంగంలో మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతున్నారు...

నవతెలంగాణ - జనరల్ డెస్క్


మాణిక్ సర్కార్... పేరు వినగానే గుర్తొచ్చేది నిరాడంబరమైన జీవనశైలీ... త్యాగనిరతి.. దేశానికే ఆదర్శప్రాయమైన ముఖ్యమంత్రి. నాలుగుసార్లు ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వహించి, ఐదోసారి ఎన్నికలను ఎదుర్కొంటున్న ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న తన ఆస్తులు దేశాన్నే ఆశ్చర్యపరుస్తున్నాయి. ఆయన వ్యక్తిగత ఆస్తి విలువ నాలుగు వేల రూపాయలకు డెబ్బై రూపాయలు తక్కువే. దేశ చరిత్రలోనే అత్యంత పేద సీఎం ఎవరైనా ఉన్నారంటే అది త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ మాత్రమే అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాషాయ కూటమికి ముచ్చెమటలు పట్టిస్తున్నారు. లెఫ్ట్ ఫ్రంట్ తరపున పోటీచేస్తున్న అభ్యర్థులకు తోడూ.. నీడై అవిశ్రాంతంగా ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రచారంలో మునిగితేలుతున్నారు. ఒకపక్క బీజేపీ ఓటర్లను ఆకట్టుకునేందుకు రాష్ట్రానికి కేంద్ర మంత్రులు మొదలు.. బడా నేతలందరినీ రంగంలోకి దింపింది. మరోవైపు మాణిక్ సర్కార్ ఒక ప్రాంతం తర్వాత మరొక ప్రాంతం వరుస ర్యాలీలను నిర్వహిస్తూ ముందుకు దూసుకుపోతున్నారు. రాష్ట్రాన్ని కలియ తిరుగుతున్నారు. అభివృద్ధిలో వెనుకబడిందంటూ కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన ఆరోపణలను మాణిక్‌సర్కార్ తిప్పికొట్టారు. త్రిపుర ప్రభుత్వ పని తీరును మూడు నెలల క్రితం కేంద్ర ప్రభుత్వమే ప్రశంసించి విషయాన్ని గుర్తుచేశారు. 'కానీ, ఎన్నికలు దగ్గరపడుతుంటే... తమ రాజకీయ స్వప్రయోజనాల కోసం ఓటర్లను తప్పుదారి పట్టించేందుకు కేంద్రమంత్రులు అడ్డదిడ్డమైన అబద్ధాలను ప్రచార అస్త్రాలుగా సంధించటానికి ఏ మాత్రం వెనకడుగువేయటం లేదు. మహిళలపై నేరాలు అధికమయ్యాయనీ, శిక్షా రేటు చాలా తక్కువగా ఉందని రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. కానీ, కేంద్ర జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ)ఇచ్చిన నివేదికలో మహిళలపై నేరాల్లో త్రిపుర అగ్రస్థానంలో లేదు. అంటే.. మహిళలపై ఇక్కడ నేరాలు అసలు జరగడంలేదని కాదు.. మిగిలిన చాలా రాష్ట్రాలతో పోలిస్తే... ఇక్కడ తక్కువ' అని త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ స్పష్టం చేశారు.

'ఎదుటి వారిపై ఆరోపణలు చేయడం చాలా సులభం. కానీ, సొంత పనితీరును సమీక్షించుకోవడం చాలా కష్టం. ఎదుటివారిపై బురదచల్లటంలో... ప్రధాన మంత్రి, హోం మంత్రి, ఇతర కేంద్ర మంత్రులందరూ ఒక్కటే. గత రెండేండ్ల నుంచి నిధులు ఎందుకు ఆపేశారో ఆ మంత్రగణం త్రిపుర ప్రజలకు ముందు సమాధానం చెప్పాలి' అన్నారు. 'బీజేపీ నేతలు త్రిపురకు సైబేరియన్ పక్షుల్లాంటివారు. 40 ఏండ్ల క్రితం త్రిపుర ఏమిటో వారికి తెలియదు. ఖాళీ ఖజానాతో త్రిపుర తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. ప్రస్తుత అభివృద్ధిని చూస్తే.. అది చాలా ముఖ్యమైనది.. చెప్పుకోతగ్గది. కేంద్రం అన్ని రాష్ట్రాలనూ సమానంగా చూసి ఉంటే.. త్రిపుర మరింత అభివృద్ధిపథంలో నడిచి ఉండేది' అన్నారు.

జాతీయ స్థాయిలో మతతత్వ ఎజెండాను బీజేపీ అవలంభిస్తుంటే.., రాష్ట్ర స్థాయిలో దాని భాగస్వామ్యపక్షం ఐపీఎఫ్‌టీ రాష్ట్రంలో అదే చేస్తోందని విమర్శించారు. బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమి చాలా ప్రమాదరకమైనదని అన్నారు. మతతత్వ - వేర్పాటువాద కూటమికి గుణపాఠం నేర్పాలని ఓటర్లకు మాణిక్ సర్కార్ విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రముఖ కమ్యూనిస్టు నేత

మహ్మద్ అమిన్ కన్నుమూత



సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో ఘన నివాళి

న్యూఢిల్లీ : ప్రముఖ కమ్యూనిస్టు, ట్రేడ్ యూనియన్ నాయకులు కామ్రేడ్ మహ్మద్ అమిన్ సోమవారం మధ్యాహ్నం కోల్‌కతాలో మృతి చెందారు. ఆయన వయస్సు తొంభై సంవత్సరాలు. కామ్రేడ్ అమిన్ మృతిపట్ల సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఆయన మృతి పార్టీకి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీవ్ర లోటని ఘనంగా నివాళులు అర్పించింది. అయన ముగ్గురు సంతానానికి ప్రగాఢ సానుభూతి తెలిపింది.

1928 ఏప్రిల్ 15న కోల్‌కతాలో జన్మించిన అమిన్ పేదరికంగా కారణంగా ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి తల్లిదండ్రులతో వలస వెళ్లారు. పేదరికంతో విద్యాభ్యాసం కొనసాగించలేక 14 ఏండ్ల వయస్సులోనే జూట్ మిల్లులో పనిచేయడం ప్రారంభించారు. అక్కడ కొద్దికాలంలోనే ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో చేరి తరువాత బెంగాల్ జూట్ మిల్ మజ్దూర్ యూనియన్‌లో సభ్యులుగా మారారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో కమ్యూనిజం వైపు ఆకర్షితులై 1946లో కమ్యూనిస్టు పార్టీలో చేరారు.

దేశ విభజన సమయంలో పార్టీ సూచనలతో తూర్పు పాకిస్తాన్ వెళ్లారు. అక్కడ ఉద్యమాలకు నేతృత్వం వహించడంతో అమిన్‌కు జైలు శిక్ష విధించారు. విడుదలైన తరువాత ఆయన పశ్చిమ బెంగాల్‌కు తిరిగి వచ్చారు. అక్కడ బార్రాక్‌పూర్ పారిశ్రామిక ప్రాంతంలో జూట్, బీడీ, ఇతర కార్మికుల పక్షాన పోరాటాలు నడిపారు. ఆయన తన జీవితాన్నంతా కార్మిక వర్గ పోరాటాలకే అంకితం చేశారు.

1955లో సీపీఐ(ఎం) 24 పరగణాల జిల్లా కమిటీకి ఎన్నికయ్యారు. 1971లో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1985లో జరిగిన పార్టీ 12వ మహాసభలో కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. 2008లో పార్టీ పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు. 12వ భారత ట్రేడ్ యూనియన్ల సదస్సులో సీఐటీయూ ప్రధాన కార్యదర్శిగా అమిన్ ఎన్నికయ్యారు. తరువాత ఉపాధ్యక్షులుగానూ సేవలు అందించారు.

1969లో తితాగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుపొందిన అమిన్, 1970లో అజయ్ ముఖర్జీ ప్రభుత్వంలో రవాణా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1988 నుంచి 1994 రాజ్యసభ సభ్యులుగా వ్యవహరించారు. సీపీఐ(ఎం) పశ్చిమ బెంగాల్ ఉర్దూ పత్రిక కిసాన్ మజ్దూర్‌కు అమిన్ సంపాదకులుగానూ పనిచేశారు.

తెలంగాణ రాష్ట్ర కమిటీ సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ (ఎం) సీనియర్ నాయకులు, పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు మహ్మద్ అమిన్ మరణంపట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. అమిన్ పశ్చిమ బెంగాల్‌లో పని చేసిన మొదటితరం నాయకుల్లో ఒకరని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగాల్‌లో వివిధ కార్మిక ప్రజా పోరాటాల్లో పాల్గొన్న ఆయన ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారని పేర్కొన్నారు. పద్నాలుగేండ్ల వయసులోనే జూట్‌మిల్లు కార్మికునిగా జీవితాన్ని ప్రారంభించిన అమిన్.. బెంగాల్ రాష్ట్ర మంత్రిగా, రాజ్యసభ సభ్యునిగా విశేషమైన సేవలందించారని తెలిపారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలు, కార్మికోద్యమానికి తీవ్ర లోటని తమ్మినేని ఈ సందర్భంగా నివాళులర్పించారు.

సీఐటీయూ నివాళి

అమిన్ మరణం పట్ల సీఐటీయూ రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. సీఐటీయూ ప్రధాన కార్యదర్శిగా ఆయన విశేష సేవలందించారని తెలిపింది. ఆయన మరణానికి సంతాప సూచకంగా యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో సీఐటీయూ అఖిల భారత ఉపాధ్యక్షులు ఆర్.సుధాభాస్కర్ అరుణ పతాకాన్ని అవతనం చేశారు. కార్యక్రమంలో సీనియర్ నేత రాజారావు, నాయకులు మధు, సోమన్న, శ్రీకాంత్, సునీత పాల్గొన్నారు.

న్యాయ విద్యార్థి హత్యకు నిరసనగా

విద్యార్థుల ఆందోళన

అలహాబాద్ : ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో న్యాయ విద్యార్థి దిలీప్ సరోజ్ హత్యను నిరసిస్తూ అలహాబాద్ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఆందోళనబాట పట్టారు. విద్యార్థుల నిరసన నినాదాలతో వీధులన్నీ హోరెత్తాయి. తమ ఆందోళనలో భాగంగా ఒక బస్సుకు నిప్పు పెట్టారు. అలహాబాద్‌లోని ఒక రెస్టారెంట్ వద్ద శుక్రవారం 26 ఏళ్ళ న్యాయ విద్యార్థిని కొంతమంది దుండగులు హత్య చేసిన సంగతి తెలిసిందే. పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న విద్యార్థులను పోలీసులు అదుపు చేశారు. అలహాబాద్‌లో ఒక రెస్టారెంట్‌లోకి ప్రవేశిస్తున్న ప్రధాన నిందితుడు విజయ్ శంకర్ సింగ్‌ను లోపలి నుండి వస్తున్న దిలీప్ సరోజ్ యాధృచ్చికంగా ఢీ కొన్నాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ ప్రారంభమైంది. శంకర్ సింగ్ హాకీ స్టిక్, ఐరన్ రాడ్లతో దిలీప్ సరోజ్‌పై దాడి చేశాడు. ఈ దాడిని అటుగా వెళుతున్న ఒక వ్యక్తి తన మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించాడు. ఈ ఘటనకు సంబంధించి రెస్టారెంట్ వెయిటర్ మున్నా చౌహాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. చౌహాన్ ఐరన్ రాడ్‌తో దిలీప్ తలపై కొట్టాడు. ఇదే అతని మృతికి కారణమైంది. పోలీసులు రెస్టారెంట్ నుంచి సేకరించిన సిసిటివి ఫుటేజ్‌లను విడుదల చేశారు. కాగా ఈ సంఘటన జరగుతున్న సమయంలో రెస్టారెంట్‌కు కేవలం 100 మీటర్ల దూరంలో పెట్రోలింగ్ చేస్తూ కూడా స్పందించని ఇద్దరు పోలీసులను అధికారులు సస్పెండ్ చేశారు.

మహారాష్ట్రలో విద్య కాషాయీకరణ

పాఠశాల విద్యార్థులకు బోధించేందుకు మోడీ జీవితకథ పుస్తకాలు

- **రూ.60 లక్షలు ఖర్చుపెట్టిన రాష్ట్ర విద్యాశాఖ**



న్యూఢిల్లీ : స్వార్థ రాజకీయాల కోసం మహారాష్ట్రలోని బీజేపీ ప్రభుత్వం విద్యలో కాషాయీకరణ జొప్పిస్తున్నది. విద్యార్థుల్ని ప్రభావితం చేయడానికి ఇక్కడి ప్రభుత్వం ఎంచుకున్న మార్గం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. రాష్ట్ర విద్యా బోర్డు రూ.60 లక్షలు ఖర్చుపెట్టి ప్రధాని నరేంద్రమోడీ జీవిత విశేషాలున్న పుస్తకాల్ని ముద్రించింది. మోడీ గురించి ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు బోధించనున్నది. మరోవైపు జాతిపిత మహాత్మాగాంధీపై కేవలం రూ.3.25లక్షలు ఖర్చుచేసి, స్వల్ప సంఖ్యలో కొన్ని పుస్తకాల్ని ముద్రించారు. స్వాతంత్ర్య సంగ్రామానికి నేతృత్వం వహించిన మహాత్మాగాంధీ, అంబేద్కర్‌ల గురించి నేటి పౌరులకు తెలియజేయాల్సిన అవసరం లేదని ఫడ్నవీస్ ప్రభుత్వం భావించింది. దీనికి సంబంధించి ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ద ఏసియన్ ఏజ్' వార్తా కథనం ఇలా ఉంది...

క్లాస్ 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు సప్లమెంటరీ రీడింగ్ మెటీరియల్ కింద ఇకపై మోడీ పుస్తకాల్ని బోధించనున్నారు. అలాగే పాఠశాల గ్రంథాలయం కోసం పెద్దసంఖ్యలో మోడీపై పుస్తకాల్ని సిద్ధం చేస్తున్నది. మహాత్మాగాంధీ, అంబేద్కర్, మహాత్మాపూలే సరసన ప్రధాని మోడీని చేరుస్తూ మరాఠా భాషలో పలు పుస్తకాల్ని విద్యాబోర్డు ముద్రిస్తోంది. ఈఏడాది రూ.60 లక్షలుపెట్టి ప్రధాని మోడీపై 72,933 కాపీలను, చాచా చౌదరీ-నరేంద్రమోడీ 33 కాపీలను (ప్రతీ ఒక్కటి రూ.35), 'ప్రధానమంత్రి నరేంద్రమోడీ' పేరుతో 7,148 కాపీలను ఆంగ్లంలో, 424 కాపీలను హిందీ భాషలో ప్రింట్ చేశారు. మోడీ పుస్తకాల్ని ఇంతపెద్ద సంఖ్యలో ప్రచురించి విద్యార్థులకు బోధించటమేంటన్న విమర్శలు మహారాష్ట్రలో వెల్లువెత్తుతున్నాయి. మహాత్మాగాంధీ, ఏక్ మహాత్మా (మరాఠా) పేర్లతో దాదాపు 8వేల పుస్తకాల్ని ముద్రించారు. గాంధీ, పూలే, అంబేద్కర్‌లపై స్వల్ప సంఖ్యలో పుస్తకాల్ని ముద్రించి...ఇతర ముఖ్యనేతలపై కూడా పుస్తకాల్ని తీసుకొస్తున్నామని మహారాష్ట్ర విద్యా బోర్డు సమర్థించుకుంటోంది.

మీ పంటను రక్షించుకోవాలంటే.. హనుమాన్ చాలీసా పఠించండి

రైతులకు మధ్యప్రదేశ్ బీజేపీ నేత సలహా



భోపాల్ : ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టాలను ఎదుర్కొంటున్న రైతులకు బీజేపీ మధ్యప్రదేశ్ నేత చిట్కా ఒకటి చెప్పారు. రానున్న నాలుగైదు రోజులూ రోజుకో గంట హనుమాన్ చాలీసా చదవాలని ఉచిత సలహా ఇచ్చారు. అలా చదివితే ఎప్పుడూ విపత్తు అనేది ఎదురుకాదని అన్నారు. 'రానున్న నాలుగైదు రోజులు భారీ వర్షాలతోపాటు, వడగంట్ల వాన కురిసే అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ నాలుగైదు రోజులూ హనుమాన్ చాలీసా చదవండి.. మీ పంటను కాపాడుకోండని నేను రైతులకు విజ్ఞప్తి చేస్తున్నాను' అని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే రమేశ్ సక్సేనా అన్నారు. ప్రతీ గ్రామంలో ఒక అందరూ ఒక గంటపాటు హనుమాన్ చాలీసా చదవితే.. ఇలాంటి వైపరీత్యాలను ఎదుర్కోవచ్చు. ఇందుకు నేను హామీ ఇస్తున్నాను. రోజు గంట హనుమాన్ చాలీసా చదవాలని యువ సహచరులకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను' అన్నారు. జమ్మూకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ సహా హిమాలయ రాష్ట్రాలు సోమవారం తీవ్రంగా మంచుకురవగా, డెహ్రాడూన్, ఇతర ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. పంజాబ్, ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ సహా ఉత్తర భారతంలోని అనేక ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు, వడగండ్లు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

కాశ్మీర్ కాల్పుల ఘటనలో

మేజర్‌పై చర్యలకు సుప్రీం 'నో'



న్యూఢిల్లీ : జమ్మూ-కాశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో రాళ్లు రువ్విన ఆందోళనకారులపై కాల్పులు జరిపిన ఘటనలో మేజర్ ఆదిత్య కుమార్‌పై ఎటువంటి చర్యలు తీసుకోరాదని సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. షోపియాన్ జిల్లాలో ఇటీవల ఆందోళనకారులపై కాల్పులు జరిపిన ఘటనలో ముగ్గురు పౌరులు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ మరణాలకు మేజరే బాధ్యత వహించాలని పేర్కొంటూ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనికా వ్యతిరేకంగా ఆదిత్యకుమార్ తండ్రి మేజర్ లెఫ్టికల్నల్ కరమ్‌వీర్ సింగ్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా, జస్టిస్ ఎఎం. కన్విల్కర్, జస్టిస్ డివై. చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం.. ఎఫ్ఐఆర్‌ను అనుసరించి ఆర్మీ మేజర్‌పై ఎటువంటి నిర్బంధ చర్య తీసుకోకూడదని ,ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా, ఈ ఘటనలో ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించుకోవాలని మాజీ ఆర్మీ చీఫ్ మాలిక్ కూడా డిమాండు చేశారు. అలాగే షోపియాన్ ఘటనపై సిట్‌తో విచారణ చేయించాలని మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని కోరారు. ఒక ఆర్మీ మేజర్‌పై కేసు నమోదు చేయడం, తదుపరి చర్యలు సాయుధ దళాల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆదిత్యకుమార్ తరపు న్యాయవాది కోర్టులో వాదించారు. మేజర్ ఆత్మరక్షణ కోసం, ఆస్తులను కాపాడటం కోసం కాల్పులకు ఆదేశించారని తెలిపారు. సైనికుల హక్కులను, ఆస్తుల పరిరక్షణకు మార్గదర్శకాలను రూపొందించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోర్టును కోరారు.

మళ్లీ చలి వణికిస్తోంది

- **జమ్మూకాశ్మీర్, హిమాచల్‌లో స్తంభించిన రవాణా వ్యవస్థ**
- **మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో 9మంది మృతి**

లడఖ్ : ఉత్తరాది రాష్ట్రాల్ని మంచు వణికిస్తోంది. ముఖ్యంగా జమ్మూకాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలో ఎడతెరపిలేకుండా మంచు కురుస్తోంది. దీంతో శ్రీనగర్ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసేశారు. జమ్మూ-కాశ్మీర్ జాతీయరహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మరోవైపు మధ్యప్రదేశ్, మహారాష్ట్రలలో మంచు తీవ్రత కారణంగా విద్యుత్ సరఫరా దెబ్బతిన్నది. ప్రతికూల వాతావరణం నేపథ్యంలో పలు చోట్ల జరిగిన ప్రమాద ఘటనల్లో 9మంది దాకా ప్రాణాలు కోల్పోయారు. వందల సంఖ్యలో పశువులు మృత్యువాత పడ్డాయి. గతరెండుమూడు రోజులుగా చలి తీవ్రత మరింత పెరగటం ప్రజల్ని తీవ్రంగా ఇబ్బందికి గురిచేస్తున్నది. మరో రెండు మూడు రోజులు ఇదే రకమైన వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ సోమవారం ఒక ప్రకటన జారీ చేసింది. సోమవారం జమ్మూకాశ్మీర్‌లో అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మంచు కురిసింది. రైలు, బస్సు రవాణా పూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతం రోడ్లమీద మంచును తొలగించే బాధ్యతల్లో ఉన్నామని అక్కడి అధికారులు మీడియాకు తెలియజేశారు. శ్రీనగర్ విమానాశ్రయంలో విమాన రాకపోకలు ఆగిపోయాయి. పెద్ద ఎత్తున కురుస్తున్న మంచు కారణంగా ఉదయం 10:30 గంటల వరకూ రన్‌వే కనిపించటం లేదని విమానాశ్రయ అధికారులు తెలిపారు. మొత్తం కాశ్మీర్ లోయలో ఉష్ణోగ్రతలు జీరో డిగ్రీ సెల్సీయస్ దిగువన నమోదయ్యాయి. కార్గిల్, లేహ్‌లలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

బాధితులకు అండగా ఉంటాం

'నయీమ్' సదస్సులో అఖిలపక్ష నేతలు

- ఈనెల 27న వరంగల్‌లో బాధితులతో ముఖాముఖి
- వచ్చేనెల్లో పాలమూరు, భువనగిరి జిల్లాల్లో పర్యటనలు



మాట్లాడుతున్న నారాయణ, చిత్రంలో డి.జి, చలపతిరావు, చాడ, వరవరరావు తదితరులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్యాంగ్‌స్టర్ నయీమ్ బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని, వారికి అండగా నిలబతామని అఖిలపక్ష నేతలు హామీనిచ్చారు. బాధితుల ఆస్తుల ఆక్రమణపై వారితోనే నేరుగా మాట్లాడతామని తెలిపారు. ఈనెల 27న వరంగల్‌లోని బాధితుతో ముఖాముఖి నిర్వహిస్తామని చెప్పారు. వచ్చేనెల 7న మహబూబ్‌నగర్, 18న భువనగిరి జిల్లాలకు చెందిన బాధితులతో ముఖాముఖి నిర్వహిస్తామని వివరించారు. ఆక్రమణకు గురైన స్థలాలను కూడా పరిశీలించి అధ్యయనం చేస్తామని చెప్పారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

'గ్యాంగ్‌స్టర్ నయీమ్ బాధితులకు న్యాయం చేయాలని' డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో సోమవారం సదస్సు నిర్వహించారు. జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో... సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ గ్యాంగ్‌స్టర్ నయీమ్, జస్టిస్ లోయా బతికి ఉంటే.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా జైల్లో ఉండేవారని ఎద్దేవా చేశారు. సోహ్రబుద్దీన్ ఎన్‌కౌంటర్‌లో నయీమ్ ప్రధాన సూత్రధారి అని చెప్పారు. అతడు సర్కారీ గూండా కావడం వల్లే అరాచకాలు కొనసాగించాడని తెలిపారు. వామపక్ష ఉద్యమాన్ని అణిచివేయటంతోపాటు నక్సలైట్లను ఎన్‌కౌంటర్ చేయడానికే.. నయీమ్‌ను ఉపయోగించారని తెలిపారు. చివరకు పోలీసులు కూడా గ్యాంగ్‌స్టర్ల అవతా రమెత్తారని చెప్పారు. కరీంనగర్‌కు చెందిన మోహన్‌రెడ్డే ఇందుకు సాక్ష్యమన్నారు. అతడి నుంచి తమకు రావాల్సిన సొమ్ము ఇప్పించాలంటూ ఆ జిల్లాకు చెందిన వారు కోరితే అప్పటి డీజీపీ దినేష్‌రెడ్డితో మాట్లాడి తాను సమస్యను పరిష్కరించానని చెప్పారు. కేంద్రం అండ చూసుకుంటున్న సీఎం కేసీఆర్.. నయీమ్ కేసును కావాలనే పక్కన పెట్టారని విమర్శించారు. ఈ కేసులో కేసీఆర్‌తోపాటు టీఆర్ఎస్ నేతల పాత్ర ఉందని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ పాలన కారణంగా సుప్రీంకోర్టు న్యాయవాదులు సైతం న్యాయం కోసం బయటకు వచ్చారని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ నయీమ్ కేసులపై సిట్‌తో విచారణ జరిపించటం వల్ల ఏ ఒక్క బాధితుడికి న్యాయం జరగలేదని అన్నారు. ఆ సంస్థ విచారణ కొండను తవ్వి ఎలుకను కూడా పట్టుకోలేక పోయిందని ఎద్దేవా చేశారు. నేరెళ్ళ బాధితులతోపాటు నయీమ్ బాధితులకు కూడా టీఆర్ఎస్ సర్కారు న్యాయం చేయలేదని విమర్శించారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి : డిజి

సీపీఐ (ఎం) రాష్ట్ర కారదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింహారావు మాట్లాడుతూ నయీమ్ అకృత్యాలు, ఆక్రమణలపై సర్కారు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అతడి డైరీని కూడా బయటపెట్టాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలతోనే పోలీసు ఉన్నతాధికారులు నయీమ్‌తో నేర సామ్రాజ్యాన్ని నిర్మించారని తెలిపారు. టీఆర్ఎస్ సర్కారు ఎన్‌కౌంటర్ చేసింది కాబట్టి.. నయీమ్ చేసిన పాపాలతో తమకు ఎలాంటి సంబంధం లేదనే విధంగా సీఎం కేసీఆర్ మాట్లాడటం శోచనీయమని అన్నారు. మండలి వైస్ చైర్మెన్ నేతి విద్యాసాగరరావుపై ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. బాధితులకు న్యాయం చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. వారికి న్యాయం చేయని పక్షంలో కేసీఆర్ కూడా నేరస్తుడే అవుతారని హెచ్చరించారు. సదస్సులో గోవర్ధన్ (న్యూడెమోక్రసి) భూతం వీరన్న, (సీపీఐ-ఎంఎల్), జానకిరాములు (ఆర్ఎస్పీ), తాండ్రకుమార్ (ఎంసీపీఐ-యూ), చలపతిరావు (న్యూడెమోక్రసి), సజయా (సామాజికవేత్త) తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి : బాధితులు

నయీమ్ కారణంగా ఆస్తులను, తమ వారిని కూడా పోగొట్టుకున్నామని నయీమ్ బాధితుల సంఘం తెలిపింది. తమకు న్యాయం చేయాలని కోరింది. బాధితుడు జగదీశ్ మాట్లాడుతూ.. 'నన్ను బెదిరించి గోకుల్ బ్యాంకు నుంచి రూ.3.50 కోట్లు వసూలు చేశారు. ఆ క్రమంలో బ్యాంక్‌కు సంబంధించిన ముగ్గురిని దారుణంగా హత్య చేశారు..' అని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలు వజ్రేశ్వరి మాట్లాడుతూ.. 'తన భూమిని ఆక్రమించుకోవడంతో పాటు భర్తను దారుణంగా హత్య చేశారు...' అని రోదించారు.

నాపై కూడా రెక్కీ నిర్వహించాడు : వరవరరావు

పాలకులతోపాటు వారికి సంబంధించిన వారిని కూడా బెదిరించే స్థాయికి నయీమ్ చేరుకున్నందునే.. అతణ్ని ఎన్‌కౌంటర్ చేశారని విరసం సభ్యుడు వరవరరావు చెప్పారు. కేసీఆర్‌కు సన్నిహితులైన చినజీయర్, రామేశ్వరరావుకు నయీమ్ నుంచి బెదిరింపులు వచ్చాయని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, పోలీసుల మద్దతును కూడా కూడగట్టుకున్న నయీమ్.. సమాంతర రాజ్యం నడిపించాడని తెలిపారు. తద్వారా సీఎంకే సవాల్ విసిరే స్థాయికి ఎదిగాడని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు రూపొందించిన నివేదిక ప్రకారమే.. 'యాంటీ నక్సలైట్ పాలసీ'ని రూపొందించి, అమలు చేశారని చెప్పారు. ఆ పేరుతో పౌరహక్కుల గురించి మాట్లాడే ప్రతి ఒక్కరిని దారుణంగా చంపించారని విమర్శించారు. తనపై కూడా నయీమ్ మూడుమార్లు రెక్కీ నిర్వహించారని వివరించారు. దీనివల్ల 2001 నుంచి మూడేండ్లపాటు తాను పక్క రాష్ట్రంలో తలదాచుకున్నానని వివరించారు.

ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన పురుషోత్తం

నవతెలంగాణ- హైదరాబాద్

తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం డైరెక్టర్ పురుషోత్తమ్‌రెడ్డి తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన రిట్‌ను హైకోర్టు బుధవారం విచారణ జరపనుంది. తాను పోలీసుల విచారణకు సహకరిస్తారనని, బెయిల్‌మంజూరు చేయాలని రిట్‌లో హైకోర్టును కోరారు. ఇదిలా ఉండగా పురుషోత్తమ్‌రెడ్డి అల్లుడు, బావమరిది వేరువేరుగా తమను ఏసీబీ అధికారులు బెదిరింపులు, వేధింపులకు గురిచేస్తున్నారని దాఖలు చేసిన వ్యాజ్యాలపై సోమవారం విచారణ జరిగింది. పిటిషనర్ ఆరోపణలపై కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీని న్యాయమూర్తి ఆదేశించారు. విచారణ 19కి వాయిదా పడింది.

నేరస్తుల సర్వే ఉత్తర్వులు అమలు చేయడంలేదు

- హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

నవతెలంగాణ- హైదరాబాద్

సకల నేరస్తుల సమగ్ర సర్వే ఉత్తర్వులు అమలు చేయడం లేదని తెలంగాణ సర్కార్ హైకోర్టుకు స్పష్టం చేసింది. ఈ మేర కు తెలంగాణ డీజీపీ జారీ చేసిన ఆదేశాలు అన్ని జిల్లాల పోలీసు లకు వెళ్లాయని తెలిపింది. గత ఏడాది జనవరి 3న సకల నేరస్తుల సమగ్ర సర్వే కోసం డీజీపీ ఇచ్చిన సర్క్యులర్ అమలు నిలిచిపోయిందని, ఈ మేరకు మెమో కూడా జారీ చేశా రని తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాష్‌రెడ్డి సోమవారం హైకో ర్టుకు విన్నవించారు. సకల నేరస్తుల సమగ్ర సర్వే పేరుతో తనను హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీ, మారేడ్‌పల్లి పోలీస్ స్టేష న్ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారంటూ టీడీపీ గ్రేటర్ హైదరాబాద్ బీసీ సెల్ చైర్మన్, మాజీ కార్పొరేటర్ సీహెచ్. బద్రీనాథ్ యాదవ్, పూర్వపు పాలమూరు జిల్లా కల్వ కుర్తి పోలీస్ స్టేషన్ అధికారులు వేధిస్తున్నారని అబ్దుల్ హఫీజ్ వేరువేరుగా దాఖలు చేసిన రిట్ పిటిషన్లు రెండింటి విచారణ ముగిసి నట్లుగా న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి ప్రకటించారు.

భూ దందాకు తెరలేపిన కేసీఆర్ కుటుంబం: రేవంత్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం రూ.వేల కోట్ల భూ దందాకు తెరలేపిందని కాంగ్రెస్‌పార్టీ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం అసెంబ్లీ మీడియా హాలులో ఆయన విలేకరు 2లతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అసైన్డ్ భూములపై ఆర్డినెన్స్ తీసుకొచ్చేందుకే హడావిడిగా అసెంబ్లీని ప్రొరోగ్ చేశారని అన్నారు. లబ్ధిదారులకు మేలు చేస్తున్నామన్న ముసుగులో ఆర్డినెన్స్ తేవాలని చూస్తున్నారని చెప్పారు. హెచ్ఎండీఏ ప్రాంతంలో అసైన్ ల్యాండ్ రెగ్యులరైజ్ వ్యతిరేకించినందుకే బీఆర్ మీనాను బదిలీ చేశారని తెలిపారు. రామేశ్వరరావుకు మేలు చేసేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ భూములను కట్టబెట్టారని ఆరోపించారు. ధైర్యముంటే తనపై కేసులు పెట్టుకోవచ్చునని సవాల్ విసిరారు.

సామాజిక స్వేచ్ఛ లభించనంతవరకు చట్టబద్ధంగా లభించే స్వాతంత్య్రం వల్ల ప్రయోజనం ఉండదు.- డా॥బి.ఆర్.అంబేద్కర్

సంపాదకీయం

రాఫెల్ డీల్.. గోల్‌మాల్..

ఆశయాలను ఎంత గొప్పగా వల్లించినా ఏం ప్రయోజనం.. ఆచరణ అణువంతయినా లేనప్పుడు..!? ప్రధాని మోడీ ఆశయాలు, అభివృద్ధీ అన్నీ ఆయన ప్రసంగాల్లోనే తప్ప పాలనలో ఏమాత్రం కనిపించడం లేదు. ఆదివారంనాటి ప్రవాస భారతీయుల సదస్సులో ఆయన మరో భావోద్వేగ ప్రసంగం చేసారు. గడిచిన 70ఏండ్ల కాలమంతా దేశం అవినీతిమయమై, అభివృద్ధి లేమితో అల్లాడుతూ వచ్చిందని ఆవేదన చెందారు. గత ప్రభుత్వాల కుంభకోణాలతో దేశ ప్రతిష్ట దిగజారిందన్నారు. తాము మాత్రం కుంభకోణాలు లేని నవ భారత నిర్మాణమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామనీ వక్కాణించారు. సరిగ్గా దేశం వెలుపల ఆయన గొప్పలు పోతున్న ఈ సమయంలోనే దేశంలోపల రాఫెల్ ఒప్పందం వెనుక భారీ కుంభకోణం ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతుండటం ప్రధాని ప్రసంగాల విశ్వసనీయతనే ప్రశ్నార్థకం చేస్తోంది. ఆయన చెబుతున్న అవినీతి రహిత పాలనలోని డొల్లతనాన్ని బట్టబయలు చేస్తోంది... నాటి బోఫోర్స్ నుండి నేటి రాఫెల్ దాకా కాంగ్రెసు, బీజేపీ ఎవరైతేనేమి అంతా ఒకే తాను గుడ్డలేనని రుజువు చేస్తున్నది.

ఎక్కడైతే పారదర్శకత లోపిస్తుందో అక్కడ అవినీతికే ఆస్కారముంటుంది. అందుకు ఈ రాఫెల్ ఒప్పందమూ మినహాయింపు కాదని ఏలికల తీరే చెపుతోంది. అయినా కుంభకోణాలు లేని నవభారత నిర్మాణం అని ప్రధాని విదేశాల్లో ఊదరగొడుతున్నారు. వీరు చెప్పేదొకటి.. చేసేదొకటనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి..?


రాఫెల్ డీల్‌లోని గోల్‌మాల్ ఏమిటీ..? ఫ్రాన్స్‌కు చెందిన దస్సాల్ట్ కంపెనీ నుండి రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు కోసం యూపీఏ ప్రభుత్వ కాలం నుంచీ సంప్రదింపులు జరుగుతున్నాయి. ఇప్పుడు మోడీ సర్కార్ ఈ ఒప్పందంపై సంతకాలు చేయడంతో ఇది ఖరారైంది. అయితే ఈ డీల్ పట్ల అవసరానికి మించిన గోప్యత ప్రదర్శించడంతో పాటు ఒప్పందంలోని పలు అంశాలు ప్రజల్లో అనుమానాలకు తావిస్తున్నాయి. యూపీఏ ప్రభుత్వ ప్రతిపాదిత ఒప్పందంలో ఇండియన్ పార్ట్‌నర్‌గా భారత ప్రభుత్వానికి చెందిన "హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) భాగస్వామిగా ఉంది. కానీ నేటి ఒప్పందంలో, మోడీ ప్రభుత్వం హెచ్‌ఏఎల్‌ను పక్కనబెట్టి ఆ స్థానంలో అనిల్ అంబానీకి చెందిన "రిలయన్స్ డిఫెన్స్ లిమిటెడ్"కు భాగస్వామ్యం కల్పించింది. ఇది కేవలం ఒక వ్యక్తి ప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను ఫణంగా పెట్టడమేనని స్పష్టంగా తెలుస్తోంది. ఫ్రాన్స్‌లో ఈ ఒప్పందంపై మోడీ సంతకం చేయడానికి రెండు రోజుల ముందు కూడా హెచ్‌ఏఎల్‌ను తొలగించే ఆలోచనే లేదని విదేశాంగ శాఖ కార్యదర్శి జయశంకర్ ప్రకటించారు. తీరా రెండు రోజుల్లో అంతా తారుమారై హెచ్‌ఏఎల్ స్థానంలో రిలయన్స్ డిఫెన్స్ లిమిటెడ్ వచ్చి చేరింది. ఇక్కడే ఈ ప్రభుత్వ చిత్తశుద్ధి, దేశభక్తి ఏ పాటిదో అర్థమవుతోంది. రక్షణరంగంలో అద్భుత పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసిన ప్రభుత్వ రంగసంస్థను కాదని.., రక్షణ పరికరాల తయారీలో ఏ అనుభవమూ లేని ఓ ప్రయివేటు సంస్థకు ఈ ఒప్పందంలో భాగస్వామ్యం కల్పించడంలోని ఉద్దేశ్యమేమిటి..? ఇది ఈ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆశ్రిత పెట్టుబడిదారీ విధానానికి ఓ స్పష్టమైన ఉదాహరణ. లేదంటే భారత డిఫెన్స్ పాటవానికి ప్రతీకగా నిలిచిన హెచ్‌ఏఎల్‌ను కాదని.. ఉన్న కంపెనీలను నడపలేక, బ్యాంక్ రుణాలను ఎప్పుడు ఎగ్గొడతాడో తెలియని అనిల్ అంబానీపై ఈ సర్కారుకు ఎందుకింత ప్రేమ..!? దేశ ప్రయోజనాలకు పాతరేసి ఓ ప్రయివేటు వ్యక్తి కంపెనీకి సుమారు 29వేల కోట్ల వ్యాపార లబ్ది చేకూర్చటమేనా వీరి దేశభక్తి..!?



ఇక్కడ మరో అంశం ఈ ఎయిర్‌క్రాఫ్ట్ ధర. ఇప్పటి వరకు మీడియా సంస్థల్లో వచ్చిన అంచనాల మేరకు, 2012 యూపీఏ ప్రభుత్వ ప్రతిపాదిత ఒప్పందంలో ఒక ఎయిర్‌క్రాఫ్ట్ ధర 81 మిలియన్ డాలర్లు. కానీ ఇప్పటి ఈ ప్రభుత్వ ఒప్పందంలో 243 మిలియన్ డాలర్లకు పెరిగింది. అంటే 300శాతం. అసలు విలువకన్నా మూడు రెట్లు మించి చూపారనేది అర్థమవుతోంది. ఇందులోని మతలబేమిటో చెప్పమంటే అది రహస్యం.. చెప్పలేమంటారు మంత్రి..! గతేడాది నవంబర్‌లో ఈ ఒప్పందంపై మీడియా ప్రశ్నలకు స్పందిస్తూ.. "వివరాలన్నీ తెలియజేస్తాం.. ఇది ప్రజల డబ్బు" అని మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఇప్పుడు ఆవిడతో పాటు మంత్రులందరూ ఆ మాట మార్చి సమాధానం దాటవేస్తున్నారు. పార్లమెంటు ప్రశ్నించినా రక్షణ రహస్యాలు వెల్లడించడం దేశ భద్రతకు ముప్పు అని చెప్పి తప్పుకుంటున్నారు.

నిజానికి రక్షణ రంగంలో ప్రతిదీ రహస్యంగా ఉంచాల్సిన అవసరం లేదు. ఏ యుద్ధ విమానం ఎందుకు కొంటున్నారనేది రహస్యమైతే కావొచ్చు కానీ, ఎంతకు కొంటున్నారనేది రహస్యమెందుకు..? అటువంటప్పుడు పార్లమెంటుకు చెప్పడానికి ఈ ప్రభుత్వానికున్న అభ్యంతరాలేమిటీ..? అవినీతిని దాచిపెట్టడానికే సమాధానం దాటవేస్తున్నారా..? అంటే అవుననే సమాధానం. లేకపోతే నోరు తెరిస్తే ప్రజలు, పారదర్శకత అని పలికే ప్రధాని, ఆయన యంత్రాంగం ఈ ఒప్పందం విషయంలో దేశభద్రత, సైనిక సంసిద్ధత, అధికారిక రహస్యం అంటూ కుంటిసాకులు చెప్పడంలోని ఆంతర్యమేమిటీ..? నిజం చెప్పాలంటే ఎక్కడైతే రక్షణ కొనుగోళ్లలో రహస్యాలంటూ ఉంటూ వచ్చాయో అక్కడల్లా కుంభకోణాలు జరుగుతూనే ఉన్నాయి. ఇందుకు మనకు బోఫోర్స్ లాంటి అనేక అనుభవాలు ఉన్నాయి. సహజంగానే ఎక్కడయితే రహస్యం ఉంటుందో, ఎక్కడైతే పారదర్శకత లోపిస్తుందో అక్కడ అవినీతికే ఆస్కారముంటుంది. అందుకు ఈ రాఫెల్ ఒప్పందమూ మినహాయింపు కాదని ఏలికల తీరే చెపుతోంది. అయినా కుంభకోణాలు లేని నవభారత నిర్మాణం అని ప్రధాని విదేశాల్లో ఊదరగొడుతున్నారు. వీరు చెప్పేదొకటి.. చేసేదొకటనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి..?

రైతు అనుకూలమన్నది బూటకం...



ప్రభాత్ పట్నాయక్

రెండువేల పద్దెనిమిది - పంతొమ్మిది సంవత్సర కేంద్ర బడ్జెట్ అత్యంత పనికిమాలిన బడ్జెట్లలో ఒక నూతన రికార్డ్ స్థాపించింది. ప్రతి బడ్జెట్‌లో ఎంతోకొంత అతిశయోక్తి ఉంటుందని మనకు తెలుసు. అయితే పెద్దపెద్ద స్కీమ్‌లను ప్రకటించి సంవత్సరమంతా ఒక్క పైసాకూడా కేటాయించకుండా ఉండే బడ్జెట్ల తయారీలో ఈ సంవత్సర బడ్జెట్ కనీవినీ ఎరుగని రీతిలో ఉన్నది.

ఉదాహరణకు 'ప్రపంచంలోనే అత్యంత విస్తృతమైన ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం' అని బడ్జెట్‌లో ఊదరకొట్టిన విషయాన్ని తీసుకుందాం. ఈ కార్యక్రమం కింద దేశంలోని 40కోట్ల జనాభాతో సమానమైన 10కోట్ల కుటుంబాలలో ఒక్కో కుటుంబానికి 5లక్షల రూపాయలు ఆరోగ్య సంరక్షణ బీమా అందుతుంది. ఈ కార్యక్రమానికి కేటాయించిన మొత్తం 2000కోట్ల రూపాయలు. గత ఏడాది బడ్జెట్‌లో కుటుంబానికి 1లక్ష ఆరోగ్య సంరక్షణ బీమా అందించేందుకుగాను ఇంతకంటే కేవలం 672 కోట్లు తక్కువగా కేటాయించారు.

> దీర్ఘకాలిక పెట్టుబడిపై వచ్చే ఆదాయంపై పన్నువేయటంలో ఈ ప్రభుత్వం వేరే మార్గాన్ని అనుసరించిందని చెప్పవచ్చు. దీనిపట్ల స్టాక్ మార్కెట్ తన నిరసన ప్రదర్శించింది. కార్పొరేట్ టాక్స్ కట్టకుండా తప్పించుకోకుండా ప్రణబ్ ముఖర్జీ 'మారిషస్ మార్గాన్ని' మూసివేసినప్పుడు కూడా ఇలానే జరిగింది. గత ప్రభుత్వం చేసినట్టుగానే ఈ ప్రభుత్వం కూడా వెనకడుగు వేస్తుందనటంలో ఏమాత్రం సందేహం లేదు. నయావుదారవాద విధానాలను అనుసరించే ప్రభుత్వం మైనారిటీలను సమిధలుగా చేయగలిగినంత తేలిగ్గా కార్పొరేట్ లాభాలపై పన్ను వేయజాలదు.

ఆరోగ్య సంరక్షణకు బీమా పద్ధతిని ఎంచుకుంటే ప్రతికూల ఫలితాలు ఉంటాయని వ్యాఖ్యాతలు సరియైన రీతిలోనే స్పందించారు. దీనితో ప్రయివేటు ఆసుపత్రులు, బీమా కంపెనీలు లాభపడతాయి. ఆరోగ్య సంరక్షణకోసం ఐరోపా దేశాలలోవలె జాతీయ ఆరోగ్య సేవవంటి ప్రభుత్వ ఆసుపత్రులను ఉపయోగించటం తెలివైన పని. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ఆరోగ్య సంరక్షణమీద ఐరోపా కంటే ఎక్కువగా బడ్జెట్‌లో వ్యయం చేసే అమెరికా బీమా పద్ధతి అనుసరిస్తున్నందున ఐరోపాతో పోల్చినప్పుడు అమెరికాలో దారుణమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ఉన్నది. ఎందుకంటే ఐరోపాలో ఆరోగ్య సంరక్షణను ప్రభుత్వం నేరుగా అందిస్తుంటే అమెరికా బీమా ద్వారా ఆరోగ్య సంరక్షణను అందిస్తున్నది.

అయితే ఈ విషయాన్ని కాసేపు పక్కనబెడదాం. ఈ ఆరోగ్య బీమా పథకానికి కేటాయించిన మొత్తం ఏ మూలకూ సరిపోదు. ఈ పథకానికి మూలమైన రాష్ట్రీయ స్వస్తిక్ బీమా యోజన(ఆర్ఎస్‌బీవై) కార్యక్రమాన్ని ఆరంభించినప్పుడు ఒక్కొక్క కుటుంబానికి గరిష్టంగా రూ.30వేలు లాభం వార్షికంగా జరిగేది. అయితే అత్యధిక రాష్ట్రాలలో ఇందుకోసం చెల్లించిన బీమా ప్రీమియం రూ.500దాకా ఉండేది. అంటే ఇది గరిష్ట లాభంలో 60వ వంతు ఉండేది. ఈ తర్కాన్ని అనుసరించి 5లక్షల బీమా అందాలంటే ప్రతి కుటుంబమూ రూ.8300 బీమా ప్రీమియం కట్టవలసి ఉంటుంది. దీనినిబట్టి బడ్జెట్‌లో పేర్కొన్న 10కోట్ల కుటుంబాలకు 83వేలకోట్లు బీమా ప్రీమియం కట్టవలసి ఉంటుంది. ఈ బీమా ప్రీమియంను కేంద్రం-రాష్ట్రాలు 60:40దామాషాలో కట్టవలసివస్తే రాష్ట్రాలు తాము స్వంత కార్యక్రమాలను చేపట్టకుండా అంగీకరిస్తాయి. అటువంటి స్థితిలో కేంద్రం ఈ పథకానికి 50వేలకోట్ల రూపాయలు కేటాయించవలసి ఉంటుంది.

ప్రస్తుత బడ్జెట్‌లో ఈ పథకానికి 50వేలకోట్ల రూపాయలకు బదులుగా రెండువేల కోట్లు మాత్రమే కేటాయించారంటే అర్థం ప్రజలు ఈ పథకాన్ని నామమాత్రంగానే ఉపయోగించుకుంటారని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టుగా అనిపిస్తున్నది. వేరేమాటల్లో చెప్పాలంటే అరకొరగా మొదలయ్యే పథకానికి పెద్దఎత్తున నిధుల్ని కేటాయించవలసిన అవసరం ఏముంటుంది? అయినప్పటికీ పేదలను ఉద్ధరించే పేరుతో ప్రభుత్వం ఈ పథకం నుంచి ప్రయోజనం పొందాలని అనుకుంటున్నది.

కేటాయించిన 2000కోట్ల రూపాయలు మొదటి సంవత్సరానికేనని వాదిస్తున్నారు. పథకం మొదలవటానికి సమయం పడుతుందనే విషయాన్ని దీనికి కారణంగా చూపుతున్నారు. ప్రభుత్వం ఈ పథకానికి సంబంధించిన వాస్తవ విషయాలను పట్టించుకోవటంలేదని అర్థమౌతోంది. ఆరోగ్య మంత్రిత్వశాఖ, నిటి అయోగ్‌లకు చెందిన అధికారులు అందిస్తున్న వివరాలనుబట్టి ఇది తెలుస్తున్నది. ఈ అధికారుల అంచనాలను అనుసరించి ప్రతి కుటుంబానికి 11-1200రూపాయల బీమా ప్రీమియం చెల్లించాలి. ఇది 30వేల బీమాకు చెల్లించిన మొత్తానికి రెండింతలు ఉంటుంది. ఈ మొత్తం దేనికీ సరిపోదు. అయినప్పటికీ ఈ పథకాన్ని ప్రపంచంలోనే అత్యంత విస్తృతమైనదనే ప్రచారం చేస్తున్నారంటే ఇది అసలు ఆచరణకు నోచుకోదని విదితమౌతున్నది.

ఈ బడ్జెట్ వ్యవసాయానుకూలం అనేమాట వినిపిస్తున్నది. ఇందుకు ఉద్దేశింపబడిన వాగ్దానాలు ఇలా ఉన్నాయి. వ్యవసాయ రంగానికి ఇచ్చే అప్పులు వర్తమాన సంవత్సరంలోని 10లక్షల కోట్ల నుంచి రాబోయే సంవత్సరంలో 11లక్షల కోట్లకు పెంచుతారు. అలాగే కనీస మద్దతుధరను ఉత్పత్తి వ్యయం కంటే 50శాతం ఎక్కువగా నిర్ణయిస్తున్నారు. ఈ అంశాలకు బడ్జెట్ కేటాయింపులతో సంబంధం లేదు. వ్యవసాయానికి ఇచ్చే పరపతి స్థాయిని బ్యాంకులు నిర్ధారిస్తాయి. బ్యాంకులు పాటిస్తాయని భావించే 'ప్రాథమ్య రంగ నియమాల'ను రూపొందించటం మినహా ప్రభుత్వం చేయగలిగిందేమీ లేదు. అయితే వ్యవసాయ పరపతిని చాలా విస్తృతంగా నిర్వచించటం కారణంగా 'ప్రాథమ్య రంగ పరపతి'తో 11లక్షల కోట్లు అప్పు ఇచ్చినా వాస్తవంలో రైతులకు చేరేది అంతంత మాత్రంగానే ఉంటుంది.

ధాన్య సేకరణ ద్వారా రైతులకు నేరుగా చెల్లిస్తే తప్ప కనీస మద్దతుధరను ఉత్పత్తి వ్యయానికి 1.5రెట్లుగా నిర్ధారించటంవలన ఒరిగేదేమీ ఉండదు. పంటల ధరలు దేశ వ్యాప్తంగా పడిపోవటంపట్ల నిరసనలు వెల్లువెత్తుతున్నా దేశంలో ఖరీఫ్ సీజన్‌లో కనీస మద్దతు ధరను ఉత్పత్తి వ్యయానికి 1.5రెట్లు చెల్లిస్తున్నామని జైట్లీ చెప్పటం విడ్డూరంగా ఉన్నది.

ఇటువంటి శూన్యత మోడీ ప్రభుత్వ 'ఉత్పత్తి వ్యయ' భావనతో మరింత సంక్లిష్టమవుతున్నది. ఇక్కడ రెండు స్పష్టమైన వేరువేరు భావనలు ఉన్నాయి. మొదటిది. కుటుంబ శ్రమతో కలుపుకుని వాస్తవంలో వస్తు లేక నగదు రూపంలో చెల్లించేది. రెండవది. మొదటిదానితోపాటుగా స్వంత భూమికి కౌలు, స్థిర పెట్టుబడికి వడ్డీని కలపటం. మోడీ ప్రభుత్వం హామీ ఇచ్చిన కనీస మద్దతు ధర మొదటి భావన ఆధారంగా ఉంటుంది. రెండవ భావన ఆధారంగా ఉత్పత్తి వ్యయంకంటే కనీస మద్దతు ధర 50శాతం



ఎక్కువగా ఉండాలని ఎమ్ఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసు చేసింది. ఈ రెండు పద్ధతులలో మొదటి దానికంటే రెండవది 50శాతం ఎక్కువగా ఉంటుంది. అంటే మోడీ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న కనీస మద్దతు ధర రెండవ పద్ధతి అంచనాకంటే చాలా తక్కువగా ఉంటుంది.

అంతేకాకుండా ఒకవేళ రైతులకు ఎక్కువగా చెల్లించటం జరిగితే దాని ప్రభావం పేద వినియోగదారుల మీద ఉండకుండా ఉండాలంటే ప్రభుత్వం సబ్సిడీలను, ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తృతపరచవలసి ఉంటుంది. ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తామని చెబుతున్నప్పుడుగానీ లేక ఉత్పత్తి వ్యయం కంటే 50శాతం అధికంగా కనీస మద్దతు ధరను చెల్లిస్తామని చెబుతున్నప్పుడుగానీ ప్రభుత్వం ఈ విషయాన్ని పట్టించుకున్నట్టు కనపడటం లేదు.

అయితే ఏమైనప్పటికీ ఈ కనీస మద్దతు ధర హామీకి బడ్జెట్‌తో ఏమాత్రం సంబంధం లేదు. గత సంవత్సరానికి చెందిన సవరించిన అంచనానుబట్టి వ్యవసాయ రంగానికి, సహకారానికి, రైతు సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో అదనంగా కేటాయించింది కేవలం 7శాతమే. అంటే స్థూల జాతీయోత్పత్తితో పోల్చినప్పుడు సాపేక్షంగా వ్యవసాయ రంగానికి చేసిన కేటాయింపులు క్షీణించాయి. క్లుప్తంగా చెప్పాలంటే ఈ బడ్జెట్ 'రైతు అనుకూలం'అనేది బూటకమే.

దీనికి తోడుగా మనం గ్రామీణ ఉపాధిహామీ పథకానికి గతంలో కేటాయించిన 50వేల కోట్లను వర్తమానంలో కొనసాగించటాన్ని పరిశీలించినప్పుడు ఈ కింది విషయం తెలుస్తుంది. ఈ కేటాయింపులో గత సంవత్సర బకాయిలనుగానీ, ధరల పెరుగుదలనుగానీ పరగణనలోకి తీసుకోలేదు. అలాగే ఐసీడీఎస్ పథకానికి కేటాయించిన దానిలో గత బడ్జెట్‌తో పోల్చినప్పుడు 7శాతం మాత్రమే పెరుగుదల ఉన్నది. స్థూల జాతీయోత్పత్తి పెరుగుదలతో పోల్చినప్పుడు ఈ కేటాయింపు సాపేక్షంగా తక్కువగా ఉన్నది. గత ఎన్‌డీఏ ప్రభుత్వ బడ్జెట్లవలెనే ఈ బడ్జెట్‌లో కూడా సామాజిక రంగానికి చేసిన కేటాయింపు కుదేలయింది.

నిజానికి ప్రస్తుత బడ్జెట్ వ్యూహం చాలా సామాన్యమైనది. 'పేదలకు సహాయం చేస్తున్నాం', 'రైతులకు సహాయం చేస్తున్నాం', మహిళలకు సహాయం చేస్తున్నాం' అని వెలుగెత్తి చాటటం, ఈ లక్ష్యాలను నెరవేర్చటానికి ఒక్క పైసాకూడా అదనంగా ఇవ్వకుండా ఉండటం, బడ్జెట్‌కు సంబంధంలేని వనరుల నుంచి చందమామను భువికి దించుతామని వాగ్దానం చేయటం, జీఎస్‌టీని ప్రవేశపెట్టిన కారణంగా తగ్గిన ఆదాయం మూలంగా వ్యయాన్ని కుదించి ద్రవ్య లోటును తగ్గించటం ఈ వ్యూహంలో భాగం.

గత బడ్జెట్‌లోకంటే ప్రభుత్వ వ్యయం 10శాతం మాత్రమే పెరగిందనే విషయం వ్యయం కుదింపునకు గురయిందనే వాస్తవాన్ని తెలియజేస్తున్నది. ఎందుకంటే ఇది స్థూల జాతీయోత్పత్తి పెరుగుతుందని ఊహిస్తున్నదానికంటే తక్కువ. వేరేమాటల్లో చెప్పాలంటే స్థూల జాతీయోత్పత్తిలో కేంద్ర ప్రభుత్వ వాటా బడ్జెట్ ద్వారా పతనమైంది. స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు మందగించిన తరువాత కూడా ఇటువంటి వైరుధ్యపూరిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టటం చాలా ఆశ్చర్యం. అయితే నయావుదారవాదాన్ని అనుసరిస్తున్న ప్రభుత్వం సరిగ్గా ఇలానే విధేయత ప్రదర్శిస్తుంది.

దీర్ఘకాలిక పెట్టుబడిపై వచ్చే ఆదాయంపై పన్నువేయటంలో ఈ ప్రభుత్వం వేరే మార్గాన్ని అనుసరించిందని చెప్పవచ్చు. దీనిపట్ల స్టాక్ మార్కెట్ తన నిరసన ప్రదర్శించింది. కార్పొరేట్ టాక్స్ కట్టకుండా తప్పించుకోకుండా ప్రణబ్ ముఖర్జీ 'మారిషస్ మార్గాన్ని' మూసివేసినప్పుడు కూడా ఇలానే జరిగింది. గత ప్రభుత్వం చేసినట్టుగానే ఈ ప్రభుత్వం కూడా వెనకడుగు వేస్తుందనటంలో ఏమాత్రం సందేహం లేదు. నయావుదారవాద విధానాలను అనుసరించే ప్రభుత్వం మైనారిటీలను సమిధలుగా చేయగలిగినంత తేలిగ్గా కార్పొరేట్ లాభాలపై పన్ను వేయజాలదు.

అనువాదం: నెల్లూరు నరసింహారావు
సెల్: 8886396999

ఎదుటివారికి చెప్పేటందుకే...

అవినీతికి వ్యతిరేకంగా సుద్దులు చెబుతూ దాని మరుగున దుర్నీతికి ఎలా పాల్పడాలో తాజాగా గోవాలో బీజేపీ ప్రభుత్వ నిర్వాకం కొట్టొచ్చినట్టు చూపిస్తోంది. మోడీ ప్రభుత్వ మద్దతుతో అన్ని రకాల చట్టాలు, నైతికతకు స్వస్తి చెప్పి కేవలం ప్రయివేటు గనుల యజమానులు వారి ఇష్టానుసారం జాతి సంపదను లూటీ చేయటానికి కావల్సినంత వెసులుబాటు కల్పించింది గోవా బీజేపీ ప్రభుత్వం. గోవాప్రజల, జాతి ప్రయోజనాలకు విఘాతం కల్గించే ఇలాంటి ఘోరమైన నేరాన్ని సుప్రీం కోర్టు దుయ్యబట్టటమే కాక 88 ఇనుము గనుల ఆమోదాన్ని కూడా రద్దు చేసింది. యూపీఏ హయాంలో 2జీ కుంభకోణం, బొగ్గు గనుల కుంభకోణం సహా వివిధ అవినీతి కుంభకోణాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నోరు పెట్టి తాను అధికారంలోకి వస్తే దేశం నుండి అవినీతిని పారద్రోలుతామని వారి ప్రభుత్వం స్వచ్ఛమైన ప్రభుత్వంగా ఉంటుందని ఊదరకొట్టారు. కానీ సుప్రీం కోర్టు తీర్పుబట్టి అదంతా పైన ముసుగు మత్రమే అని తేలింది. నిజానికి ఇంతకు ముందున్న ప్రభుత్వం లాగే బీజేపీ ప్రభుత్వం కూడా జాతిసంపద లూటీకి ఏర్పాటు చేయటంలో ఆరితేరి ఉంది. బడా పారిశ్రామికవేత్తలకు కావల్సినంత లాభాలు కట్టబెట్టటానికి అన్ని చట్టాలు, నిబంధనలు తుంగలో తొక్కి జాతి సంపదను ప్రయివేటుపరం చేస్తున్నది.

గోవా ఖనిజ సంపదలో ప్రధానమైనవి ముడి ఇనుము, మ్యాంగనీసు. ఉదారవాద విధానాల చేయి పుచ్చుకుని దేశ ఖనిజ సంపద యాజమాన్యం ప్రయివేటు పారిశ్రామికవేత్తల చేతుల్లోకి వెళ్లటం ఎప్పుడైతే మొదలయిందో అప్పటి నుండే గోవా ఖనిజ సంపద లూటీ నడుస్తున్నది. ఖనిజ, జాతీయ సంపదకు సరియైన విలువ పొందటానికి కావల్సిన విధానం, చట్టం రూపొందించకుండా ఇష్టమొచ్చినట్టు ఎవరికి పడితే వారికి గనుల లీజు ఇవ్వటంతో ఒకవైపు ప్రభుత్వానికి కోట్లకొలదీ నష్టం కలుగుతుండగా మరోవైపు పర్యావరణ ధ్వంసం కావటంతో పాటు స్థానిక ప్రజలు నిర్వాసితులు అయి కష్టాల్లో పడిపోవటం అనివార్యమయింది. ఫలితంగా ప్రయివేటు యజమానుల లాభాలు పోగుపడుతున్నాయి. బీజేపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు దీనికి వ్యతిరేకంగా గోల పెట్టింది. ఎన్నికలప్పుడు అవినీతిని అంతమొందిస్తామని చెప్పి ఇప్పుడు బీజేపీ రాజీ ధోరణి అవలంబిస్తున్నది.

ఉదారవాద విధానాల ఫలితంగా గనుల ప్రయివేటీకరణలో అవినీతి అభియోగాలు రావటంతో షా కమిషన్ ఏర్పాటు జరిగింది. కమిషన్ రిపోర్టు 2012లో వచ్చింది. తరువాత కేంద్ర, గోవా ప్రభుత్వాల కొన్ని నియమ నిబంధనల కారణంగా ఖనిజ ఉత్పత్తి తగ్గుతూ వచ్చింది. సుప్రీం కోర్టు ముడి ఇనుము తీయటం నిషేధించింది. ఈ మధ్యే గతంలో ఇచ్చిన లీజు గడువు పూర్తయింది. మరలా కేంద్ర ప్రభుత్వం కొత్త గనుల విధానం ప్రకటించటానికి పూనుకుంది. కొత్త గనుల విధానం ప్రకటించినప్పటికీ కొత్త చట్టం వచ్చాక వేలం ద్వారా గనులు పంచాలి. దానివల్ల పాత లీజుదారుల గనుల యాజమాన్యం చేజారిపోవచ్చు. ఈ పరిస్థితిలో గోవా ప్రభుత్వం హుటాహుటిన 88 పాత గనుల లీజు పునర్నవీకరణ చేసింది. అంటే ప్రయివేటు పారిశ్రామికవేత్తలకు లూటీ చేసుకునే అవకాశం కల్పించింది. సుప్రీం కోర్టు స్పష్టంగానే హుటాహుటిన పునర్నవీకరణ చేయటం వెనక ప్రయివేటు సంస్థల వ్యాపార ప్రయోజనాలు కాపాడే, అదనపు లాభాలు కట్టబెట్టే ఉద్దేశమే ఉందని పేర్కొంది. దీనిలో గోవా ప్రజల, సమాజానికి ఏ ప్రయోజనం లేదు. అంటే కొత్త గనుల చట్టాన్ని పక్కనబెట్టి ఇష్టమొచ్చినట్టు దగ్గర సంబంధాలున్న పాత పారిశ్రామికవేత్తల చేతులకు ఖనిజ సంపద అందించటానికి అసహజమైన తొందరపాటుతో లీజు పునర్నవీకరణ చేసింది. ఈ పనిలో తోడ్పాటందిస్తూ కేంద్ర పర్యావరణ-అటవీ శాఖ ఆగమేఘాల మీద ఆమోదం పంపించింది. ఇక రాష్ట్ర కాలుష్య నివారణ పరిషత్తు ముందుగానే ఆమోదించటానికి సిద్ధంగానే ఉన్నది. 88 గనులు వేలం పాట ద్వారా పంపిణీ చేసి ఉంటే ప్రభుత్వానికి కొన్ని వేల కోట్ల రూపాయలు ఆదాయం వచ్చేది. ఆ సొమ్ము రాష్ట్ర అభివృద్ధి, రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు ఖర్చు పెట్టగలిగే వారు. అలా చేయకుండా మోడీ నమ్మిన బంటు మనోహర్ పరికర్ ప్రభుత్వం ఆ సొమ్ము ప్రయివేటు పారిశ్రామికవేత్తలకు ధారాదత్తం చేసింది.

-వేదుల రామకృష్ణ

పునర్వ్యవస్థీకరణ చట్టం.. రాజకీయాలు



ఎస్ వినయకుమార్


> చట్టంలోని హామీల అమలు తీరును వాటికి సంబంధించిన విషయాలను ప్రజల ముందు పెట్టడానికి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సన్నద్ధత చూపలేదు. హామీల అమలుపై ఏపీలో వామపక్షాలు బంద్‌కు పిలుపునివ్వగా మిగతా పార్టీలు మద్దతునిచ్చాయి. బంద్ పిలుపునకు ప్రజలు బ్రహ్మరధం పట్టారు. పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీల పట్ల కేంద్రంలో రాష్ట్రంలో ఉన్న పార్టీలు స్వీయ రాజకీయ ప్రయోజనంతోనే వ్యవహరిస్తున్నాయని తేలిపోయింది.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీల అమలుపై బీజేపీ, టీడీపీ, టీఆర్ఎస్‌లు స్వీయ రాజకీయ దృష్టితో మాత్రమే వ్యవహరిస్తున్నాయి. కేంద్రంలో ఉన్నది ఎన్డీఏ ప్రభుత్వమైనా అక్కడ బీజేపీదే చెల్లుబాటు. మిత్రులనయినా సంప్రదించే పాటి మర్యాద మోడీకి లేదు. మోడీని ప్రశ్నించే సత్తా చంద్రబాబుకూ లేకుండా పోయింది. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల అమలుపై ప్రజా ఉద్యమం ఈ రీతిన ఉధృత స్వరూపం తీసుకొనకపోయి ఉంటే టీడీపీ నాయకత్వం కేంద్రంమీద ఇంతలా స్పందించి ఉండేది కాదు. బీజేపీ, టీడీపీల మధ్య ఈ ఘర్షణ కూడా ఫక్తు స్వీయరాజకీయ ప్రయోజనాలకే తప్ప ప్రజల ప్రయోజనాల దృష్టితో జరుగుతున్నది కాదు. టీఆర్ఎస్ ధోరణి అంతకంటే అన్యాయం. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావుకు ఆయన కింద పని చేసిన చంద్రబాబు, కేసీఆర్‌లకు తేడా కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. పార్లమెంట్ సమావేశాలకు ముందే ఎన్టీఆర్ రాష్ట్ర ఎంపీలందరినీ సమావేశపరిచి కేంద్రం నుండి రావల్సిందేమిటో, రాష్ట్ర ప్రభుత్వం వాటికోసం చేసిన కృషి ఏమిటో రాతపూర్వక వివరాలను అందచేసి ఎంపీలకు స్పష్టమైన అవగాహన కల్పించేవారు. చంద్రబాబు, కేసీఆర్‌లు ఆ పని చేయడం లేదు. వెన్నులేని సామంతుల్లా ఉంది చంద్రులిద్దరి వ్యవహారం.

తెలుగుదేశంతో స్నేహం ఆంధ్రప్రదేశ్‌లో తన అభివృద్ధికి పెద్ద ఆటంకమని బీజేపీ భావిస్తోంది. కటీఫ్ చేసుకొంటే తన బలం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతుందని బీజేపీ అంచనా. గత ఎన్నికల్లో తమకు కేటాయించిన సీట్లలో స్నేహపూర్వక పోటీలకు టీడీపీనే కారణమని, తమ ఓట్లు టీడీపీకి పడ్డాయిగానీ టీడీపీ ఓట్లు తమకు పడలేదని, పడబోవని కూడా అది భావిస్తోంది. అందువల్లే ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ మంత్రుల, కార్యకర్తల స్పందన ఒకే తీరుగా ఉంది. వైసీపీతో పొత్తు గురించి వస్తున్న ఊహాగానాలపై కూడా బీజేపీ బహిరంగంగా స్పందించడం లేదు. సందులో సడేమియా రాజకీయాలంటే ఇవేమరి.

తెలంగాణలోనూ పునర్వ్యవస్థీకరణ చట్టం హామీల అమలుపై బీజేపీ వైఖరిలో తేడాలేదు. కేంద్రవైఖరిపై గట్టిగా మాట్లాడడానికి తెరాస సిద్ధంగా లేదు. బీజేపీ రాష్ట్ర నాయకులు వీలైనప్పుడల్లా విమర్శలు గుప్పిస్తుంటే. కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల బీజేపీ మంత్రులు తెలంగాణకు వచ్చినప్పుడు అతిథులుగా నాలుగు మంచిమాటలు చెప్తున్నారు. వాటినే భుజకీర్తులుగా తగిలించుకొని టీఆర్ఎస్ నాయకత్వం పొంగి పోతోంది. చట్టంలో ఇచ్చిన హామీలతో పాటు ఇతర సందర్భాల్లో కేంద్రం చేసిన వాగ్దానాల అమలుపై నిలదీయడానికి జంకుతోంది. బడ్జెట్ ప్రసంగంపై చర్చ సందర్భంగా లోకసభలో కవిత చేసిన ప్రసంగంలోనూ అదే కన్పించింది. పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీల అమలు నామ్‌కేవాస్తే అన్నట్టుగా ఆమె ప్రస్తావించారు. దానికి తగినట్టు ఆర్థిక మంత్రి జెట్లీ ఇచ్చిన సమాధానంలో తెలంగాణను పెద్దగా పట్టించుకోలేదు.

హైదరాబాదు హైకోర్టు విభజన విషయమే చూద్దాం. ఈ పాటికి అది జరిగి ఉండాల్సింది. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం, హైకోర్టు ఈ బాధ్యతను నెరవేర్చాలి. ఇందులో ప్రధాన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అయినా అది తన బాధ్యత కానట్టు వ్యవహరిస్తోంది. తెలంగాణ లాయర్లు ఎంత మొత్తుకొన్నా తెలంగాణ ప్రభుత్వమూ హైకోర్టు విభజనను సీరియస్‌గా పట్టించుకోవడం లేదు.



కృష్ణా, గోదావరి నదీజలాలపై చట్ట ప్రకారం రెండు రివర్ మేనేజ్‌మెంట్ బోర్డులను ఏర్పరచాలి. ఈ ఏర్పాటులోనూ కేంద్ర ప్రభుత్వం విపరీతమైన జాప్యం చేసింది. బోర్డుల కార్యకలాపాల పర్యవేక్షణకు కేంద్ర జలవనరుల శాఖమంత్రి చైర్మన్‌గా ఇద్దరు సీఎంలూ సభ్యులుగా ఒక ఉన్నతస్థాయి సలహామండలి ఏర్పడాలి. దీనిపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదు. ఫలితంగా కొన్ని సందర్భాల్లో ఉభయ రాష్ట్ర ప్రజల మధ్య అవాంఛనీయ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికీ అనేక వివాదాలు అపరిష్కృతంగానే ఉన్నాయి. వివాదాలను రెండు రాష్ట్రాలే పరిష్కరించుకోవాలన్న వైఖరితో కేంద్రం వ్యవహరిస్తోంది. ఇది బాధ్యతా రాహిత్య ధోరణి. నదీ జలాల పంపకంలో కేంద్రం ప్రత్యేక చొరవ తీసుకొంటే తప్ప ఫలితముండదు.

కొత్తగా ఏర్పడిన రెండు రాష్ట్రాలలోనూ పారిశ్రామీకరణను ఆర్థికాభివృద్ధిని పెంపొందించడానికి అవసరమైన ఆర్థిక చర్యలను, పన్ను ప్రోత్సాహాలతో సహా కేంద్రం చేపడుతుందని చట్టంలో హామీ ఇచ్చారు. అలాగే రెండు రాష్ట్రాలలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం, వస్తుపరమైన, సామాజిక వనరులను పెంపొందించే చర్యలతో సహా అనేక కార్యక్రమాలకు మద్దతునివ్వాలని చట్టంలో పేర్కొన్నారు. కాని మోడీ సర్కారు ఆ వైపు ఆలోచించడం కూడా లేదు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి పార్లమెంట్‌లో జైట్లీ ఇచ్చిన సమాధానంలో సాచివేత తప్ప మరొకటి లేదు. పారిశ్రామీకరణ, ఆర్థికాభివృద్ధిలో తన బాధ్యత ఏదీలేనట్టు కేంద్రం వ్యవహరిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా హామీ ఇచ్చారు. ఇప్పుడు కేంద్రం అది సాధ్యం కాదంటోంది. పునర్వ్యవస్థీకరణ బిల్లుపై చర్చ జరుగుతున్నప్పుడు ఈ అంశంపై అత్యుత్సాహం చూపిన వెంకయ్య నాయుడుది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే చీప్ ఎత్తుగడే తప్ప మరొకటి కాదని ఇప్పుడు రుజువైంది.

విద్యారంగంలో గిరిజనులను ప్రోత్సహించ డానికి తెలంగాణలో ఒక గిరిజన విశ్వవిద్యాలయాన్ని కేంద్రం స్థాపిస్తుందని చట్టంలో పేర్కొన్నారు. కాని ఇప్పటివరకు ఆ హామీ నెరవేర్చలేదు. చట్టం ప్రకారం తెలంగాణలో ఉద్యానవన విశ్వవిద్యాలయాన్ని పేరుకు మాత్రమే ప్రారంభించారు. విశ్వవిద్యాలయానికి అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను ఏర్పాటు చేయలేదు. ఖమ్మం జిల్లాలో బయ్యారం సమగ్ర ఉక్కు ఫ్యాక్టరీ స్థాపనపై ఇచ్చిన హామీ కేంద్రం పరిగణనలో ఉందా అన్నది అనుమానమే. తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాలను కలిపేందుకు రహదారుల నిర్మాణంపై చట్టంలో కేంద్రం హామీ ఇచ్చింది. ఈ విషయంలో అప్పుడప్పుడు కేంద్రమంత్రి ఆర్భాట ప్రకటనలు మాత్రం చేసి సరిపెడ్తున్నారు.

తెలంగాణలో రైల్‌కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణంపై అధ్యయనం చేస్తామని, రైలు మార్గాల మెరుగుదలకు ఉన్న అవకాశాలను కూడా అధ్యయనం చేసి సత్వరం నిర్ణయం తీసుకొంటామని చట్టంలో హామీ ఇచ్చారు. రైలు మార్గాల నిర్మాణంలో తెలంగాణ వెనుకటి నుండి నిర్లక్ష్యానికి గురయింది. ప్రధానమైన లైన్ల విద్యుదీకరణ కూడా జరగలేదు. ఈ విషయంలో ఎన్‌డీఏ ప్రభుత్వ వైఖరి గత ప్రభుత్వాలకంటే భిన్నంగా ఏమీలేదు. రైల్వేలవల్ల తక్కువ ఖర్చుతో ప్రజలకు రవాణా సౌకర్యాన్ని అందుబాటులోకి తేవచ్చు. ప్రయాణికులకు టోల్‌టాక్సు బెడదా ఉండదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మాత్రం దీనిపై ఆసక్తి లేదు. రైల్వే శాఖ ఒకటి రెండు పనులు చేస్తే తమ చొరవవల్లే ఆ పనులు జరిగాయని చెప్పుకొనే తాపత్రయమే తప్ప ఒక సమగ్ర దృక్పథంతో తెలంగాణలో రైలు మార్గాలను అభివృద్ధి చేయాలన్న శ్రద్ధ టీఆర్ఎస్ సర్కారుకూ లేదు.

ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేజోన్ ఏర్పాటు, దుగరాజపట్నం రేవు నిర్మాణం, జాతీయ ప్రాజెక్టుగా పోలవరం నిర్మాణం, కొత్త రాజధాని నిర్మాణం కోసం నిధుల, కేంద్ర యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ, డబుల్ ఐటి, నిట్, ఐఐఎం, ఐఐఎస్ఇఆర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, క్రూడాయిల్ రిఫైనరీ, పెట్రోలియం కాంప్లెక్స్, విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, విజయవాడ, గుంటూరు తెనాలి మెట్రో రైలు వంటి హామీలు చట్టంలో ఉన్నాయి. ఈ హామీలు ఏదశలో ఉన్నాయో ఏపీ ప్రభుత్వం ఒక శ్వేతపత్రం ప్రకటించాలి. కామధేనువులాంటి హైదరాబాదు తెలంగాణకు వెళ్లింది కనుక ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ లోటును భరిస్తామన్నారు. ఈ హామీల అమలు పట్ల రాజకీయ దృష్టితోనే కేంద్రం వ్యవహరించింది.

చట్టంలోని హామీల అమలు తీరును వాటికి సంబంధించిన విషయాలను ప్రజల ముందు పెట్టడానికి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సన్నద్ధత చూపలేదు. హామీల అమలుపై ఏపీలో వామపక్షాలు బంద్‌కు పిలుపునివ్వగా మిగతా పార్టీలు మద్దతునిచ్చాయి. బంద్ పిలుపునకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీల పట్ల కేంద్రంలో రాష్ట్రంలో ఉన్న పార్టీలు స్వీయ రాజకీయ ప్రయోజనంతోనే వ్యవహరిస్తున్నాయని తేలిపోయింది.

చీర సింగారం కొంగు బంగారం





చాలా సింపుల్‌గా... హుందాగా కనిపించాలంటే కాటన్ చీరలు కట్టుకోవాల్సిందే! కాటన్ చీరల మీద ఉండే ప్రింటెడ్ డిజైన్లు ఎంతో అద్భుతంగా, ఆకర్షణీయంగా కనిపిస్తాయి. నలుపు రంగు కాటన్ చీర పైన బంగారు వర్ణపు ప్రింటెడ్ వర్కు... నీలం రంగు కాటన్ చీరమీద తెలుపు రంగు పూల అల్లికలు... ఆకుపచ్చ సన్న అంచుతో ఉండే చీరలు... ఎరుపు రంగు చీరపై విరబూసిన పువ్వులు మహిళల మనసును దోచుకుంటాయి. కాబట్టి చిన్న చిన్న పార్టీలకు, అకేషన్లకు ఓ సారి ప్రయత్నించి చూడండి...



తొక్కలో ఏముంది?



ఇంట్లో రకరకాల కూరగాయలూ, పండ్లని తొక్కలు తీసి ఉపయోగించుకుంటాం. అయితే వాటిని పడేయకుండా ఇలా ఉపయోగించుకుంటే బాగుంటుంది.

బంగాళాదుంపలు: వీటి తొక్కల్లో విటమిన్ సి అధికం. వీటిని కాసేపు ఫ్రిజ్‌లో ఉంచి తీసి కండ్ల మీద ఉంచుకొని, పావుగంటయ్యాక తీసేసి కండ్లను శుభ్రం చేసుకుంటే మంచిది.

అరటి: ఈ పండు తొక్కలతో దంతాలను శుభ్రం చేసుకుంటే తెల్లగా మారతాయి. వీటి ద్వారా దంతాలకు మెగ్నీషియం, మాంగనీసు, పొటాషియం అంది దృఢంగా ఉంటాయి.

కమలాఫలం: ఈ తొక్కల్ని గుమ్మాల వద్దా, వంటింట్లో, గదుల్లో ఉంచితే దుర్వాసన దూరమవుతుంది. ఈ తొక్కల్ని నీళ్లలో వేసి మరిగించి గది మధ్యలో ఉంచితే పరిమళం వెదజల్లినట్టు మంచి వాసన వస్తుంది.

ఉల్లిపాయ: ఈ పొట్టును పారేయకుండా చెట్ల మొదళ్లలో వేస్తే మొక్కలకు సల్ఫర్ అందుతుంది. ఏపుగా ఎదుగుతాయి. పూలు కూడా బాగా పూస్తాయి.

❄

మహిళా హక్కుల గొంతుక...

అది 1990ల కాలం. ఓ జపనీస్ మహిళ.. ఆమె భర్త అన్యాయంగా తీసుకొని వచ్చిన తన కొడుకు కస్టడీ కోసం న్యాయవాది అస్మా జహంగీర్ కార్యాలయంలో అడుగుపెట్టింది. జహంగీర్ ఆ కేసును టేకప్ చేశారు. ఆ జపాన్ మహిళను విజయం వరించింది. కానీ అక్కడే ఓ చిక్కు వచ్చి పడింది. కొడుకును దక్కించుకోవడానికి డిపాజిట్ చేయాల్సినంత డబ్బు ఆ మహిళ దగ్గర లేదు. జహంగీర్ ఏమాత్రం ఆలోచించలేదు. 14 లక్షల రూపాయలను ఆ మహిళకు సాయం చేశారు. క్లయింట్స్ పట్ల ఆమె చూపే సహృదయతకు ఈ ఘటన ఓ ఉదాహరణ మాత్రమే. తనకు వచ్చిన కేసుల్లో సగం కేసులను ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా వాదించారామె. అయినా అదెప్పుడు బయటి ప్రపంచానికి తెలియాలని కోరుకోలేదు. పీడితులు, అభాగ్యులకు న్యాయం చేయడం కోసం తన జీవితాన్నంతా వెచ్చించారు.



ప్రముఖ న్యాయవాది, మానవహక్కుల ఉద్యమకారిణి అస్మా జహంగీర్... జనవరి 1952లో లాహోర్‌లో క్రియాశీల రాజకీయాల్లో ఉన్న కుటుంబంలో పుట్టారామె. తండ్రి మాలిక్ గులామ్ జిలానీ సివిల్ సర్వెంట్. ఆయన పదవీ విరమణానంతరం రాజకీయాల్లోకి ప్రవేశించారు. మిలిటరీ నియంతృత్వానికి వ్యతిరేకంగా పనిచేసినందుకు, మిలిటరీ యాక్షన్‌తో మారణహోమానికి పాల్పడుతున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు ఆయనను ఎన్నో ఏండ్లు జైల్లో పెట్టింది మిలటీ ప్రభుత్వం. ఇక ముస్లిం మహిళలకు విద్య కలగా మిగిలిన రోజుల్లోనే అస్మా తల్లి కో-ఎడ్యుకేషన్ కాలేజీలో చదివారు. ముస్లిం సంప్రదాయాలకు వ్యతిరేకంగా పోరాడారు. ముస్లిం మహిళలు బయటికి అడుగు పెట్టలేని కాలంలోనే బట్టల వ్యాపారంలోకి ప్రవేశించి... మార్గదర్శిగా నిలిచారు. ఇలాంటి కుటుంబంలో పెరిగిన అస్మాకి చిన్నతనంలో ప్రజాస్వామిక భావాలబ్బాయి. 1972లో జుల్ఫికర్ అలీ భుట్టో ప్రభుత్వం... అస్మా తండ్రిని జైల్లో పెట్టింది. దానికి వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొన్నారు.

కిన్నార్డ్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆమె.. తరువాత పంజాబ్ యూనివర్సిటీలో ఎల్‌ఎల్‌బీ చదివారు. 1980లో ఆమె లాహోర్ హైకోర్టులో, ఓ రెండేండ్ల తరువాత పాకిస్తాన్ సుప్రీం కోర్టులో పనిచేశారు. సీనియర్ అడ్వకేట్‌గా గుర్తింపు పొందిన పాకిస్తానీ మొట్టమొదటి మహిళ. పాకిస్తాన్ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌కు ఆమె మొట్టమొదటి మహిళా అధ్యక్షురాలు. జియా ఉల్‌హక్ మిలిటరీ పాలనకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యం కోసం ఉద్యమించినందుకుగాను ఆమెను మూడేండ్లపాటు జైలులో ఉంచారు. బయటికి వచ్చిన నాలుగేండ్ల తరువాత పాకిస్తాన్ మానవహక్కుల కమిషన్ స్థాపనలో భాగస్వాములయ్యారు. 1986లో ఉచిత న్యాయ సలహాల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 'దస్తక్' పేరుతో మహిళలకు షెల్టర్‌హోమ్‌ను నడిపించారు. మతోన్మాదం, కుల దురహంకార హత్యలకు వ్యతిరేకంగా, మహిళలు, మైనారిటీలు, పిల్లల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. తీవ్రమైన నిర్బంధం, వ్యతిరేకతల మధ్య నమ్మిన న్యాయం కోసం నిలబడ్డారు. పాకిస్తాన్‌లో మానవహక్కుల గొంతుకగా మారారు. మహిళలపై పోలీసులు చేస్తున్న ఆకృత్యాలను ఎండగట్టారు. ముస్లిం మహిళ తన గార్డియన్ (పురుషుడు) అనుమతి లేకుండా పెండ్లి చేసుకోవడానికి వీల్లేదన్న పాక్ సుప్రీం తీర్పును వ్యతిరేకించారు. 'ఇప్పటికే వేలమంది వేధింపులకు గురవుతున్నారు... ఇలాంటి ఆదేశాలు జారీ చేయడమంటే... వేధింపులకు చట్టబద్ధత కలిపించడమేన'ని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1993వరకు కమిషన్‌కు సెక్రటరీ జనరల్‌గా పనిచేశారు. తరువాత కమిషన్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2007లో జరిగిన లాయర్స్ మూవ్‌మెంట్‌లో అగ్రభాగాన నిలిచినందుకు ఆమెను హౌజ్ అరెస్టు చేసింది మిలటరీ ప్రభుత్వం అయినా ప్రజల పక్షాన, న్యాయం కోసమే పోరాడారు. ప్రజాస్వామిక, లౌకిక పౌర సమాజం కోసం ఆమె చేసిన పోరాటానికి గాను ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు ఆమెను వరించాయి.

❄

కండ్లు పెద్దగా...



కండ్లకు మేకప్ వేసుకునే విషయంలో కొన్ని చిట్కాలు పాటిస్తే పెద్దగా కనిపించేలా చేయొచ్చు. అదెలాగంటే..

- కనుబొమల కింద ఉండే ప్రదేశంలో లేత రంగును రాసుకోవడానికే ప్రాధాన్యం ఇవ్వండి. దానివల్ల కండ్లు పెద్దగా కనిపిస్తాయి.
- కండ్ల కింద నల్లటి వలయాలుంటే కూడా కండ్లు చిన్నగా అనిపించే అవకాశం ఉంటుంది. అందుకే కాస్త కన్సీలర్‌ను రాసుకుంటే, అవి కాస్త పెద్దవిగా అనిపిస్తాయి.
- కనుబొమలను ఎప్పుడూ సరైన ఆకృతిలో ఉంచుకోవాలి. అలాచేస్తే కండ్లకూ, కనుబొమలకు మధ్య ఉన్న ప్రాంతం విశాలంగా అనిపించి చిన్నగా అనిపించవు.
- కొంతమంది కండ్లు పెద్దగా కనిపించాలని చుట్టూ ఐ లైనర్ రాస్తుంటారు. దీనివల్ల ఇంకా చిన్నగా కనబడతాయి. దానికి బదులు పైవైపు మాత్రమే రాసుకుంటే మేలు.
- పై రెప్పకు ఐలైనర్ రాస్తున్నప్పుడు మొదలు నుంచీ కాకుండా కాస్త మధ్యలో నుంచి కంటి చివరి వరకు పొడిగించండి. అలాగే కింది రెప్పకు రాయకపోవడమే మంచిది.
- కంటి మొదళ్ల దగ్గర తెలుపు లేదంటే ఏదైనా లేత రంగు ఐషాడో రాసుకోవాలి. దానివల్ల కూడా కండ్లు పెద్దగా అనిపిస్తాయి. అలాగే కాస్త లేత రంగుల మేళవింపులో షిమ్మర్ రాసుకున్నా బాగుంటుంది.
- కండ్లు కాస్త ఉబ్బినట్లుగా ఉన్నా అవి చిన్నగా కనిపించొచ్చు. అందుకే కండ్ల మీద కీరదోసా, బంగాళదుంపను చక్రాలుగా తరిగి కాసేపు ఉంచుకోండి. ఫలితం ఉంటుంది.
- మస్కారా విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిందే. ముందుగా దట్టంగా కాకుండా కొద్దిగా రాసుకున్న తర్వాత రెండోసారి కాస్త ఎక్కువగా రాయండి. దీనివల్ల కంటిరెప్పలు కూడా సరైన ఆకృతిలో ఉంటాయి.

❄

ఇట్లచేద్దాం

రోజంత ఉపవాసం ఉండే వాళ్లు గంటకోసారి పండ్ల రసాలు, పాలు, పండ్లు వంటివి తీసుకుంటూ ఉండాలి. ఇలా చేయడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

నైటింగేల్ ఆఫ్ ఇండియా

బెంగాలీల ఆడపడుచు, తెలుగు వారి కోడలిగా ఆమె పేరుగాంచారు. 1908లో మూసీనదికి వరదలు సంభవించినప్పుడు ఆమె చేపట్టిన సేవాకార్యక్రమానికి బ్రిటీష్ ప్రభుత్వం "కైజార్ ఎ హిందూ" స్వర్ణపతకాన్ని బహుకరించింది. 19వ శతాబ్దపు చివర్లో హైదరాబాద్ నగర సౌందర్యాన్ని, ఇక్కడి ప్రజల జీవనవిధానాన్ని తెలుసుకోవాలంటే ఆమె కవితలు చదవాల్సిందే. రాజకీయ, సాహిత్య, సామాజిక రంగాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్న మహిళామణి సరోజినీనాయుడు. భారత కోకిలగా ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆమె స్వాతంత్ర్య సమరయోధురాలిగా, కవయిత్రిగానే కాదు.. తొలి మహిళా గవర్నరుగా మహిళల ఔన్నత్యాన్ని పెంచారు. మానవ సేవ చేయదలుచుకున్న వారికి మార్గాలనేకం అని నిరూపించిన మహిమాన్వితురాలు.



సరోజినీ నాయుడు
(13ఫిబ్రవరి, 1879 - 2 మార్చి, 1949)

Women of the day

హైదరాబాద్‌లో స్థిరపడిన బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో సరోజిని జన్మించారు. నాంపల్లి రైల్వే స్టేషనుకు సమీపంలోని గోల్డెన్ త్రెషోల్డ్ బంగళాలో వారి నివాసం. తండ్రి డాక్టర్ అఘోరనాథ్ చటోపద్యాయ, తల్లి వరద సుందరి. అఘోరనాథ్ చటోపాధ్యాయ ఎనిమిది భాషల్లో పండితులు. హైదరాబాదు కాలేజికి (నిజాం కాలేజీ)తొలి హెడ్‌మాస్టర్. వరదాదేవి చక్కని రచయిత్రి. బెంగాలీ భాషలో కావ్యాలు, కథలు రచించారు.

సరోజినికి చిన్నతనం నుంచీ ఇంగ్లీషు అంటే ఎంతో ఇష్టం. 11ఏండ్లకే అనర్గళంగా ఇంగ్లీషు మాట్లాడటంతో పాటు 12ఏండ్లకే మద్రాసు విశ్వవిద్యాలయంలో మెట్రిక్ లేషన్ పూర్తి చేశారు. 13ఏటా ఆమే 13వందల పంక్తుల్లో రచించిన సరోవరరాణి (Lady of Lake) హృదయాలకు హత్తుకునే శైలిలో ఉంటుంది. ఆమెలోని ప్రతిభను గుర్తింటచన నిజాం నవాబు వివిధ శాస్త్రాలలో పరిశోధన చేసేందుకు ప్రోత్సాహమిస్తూ విదేశాలకు పంపించడంతో పాటు ప్రతి ఏటా స్కాలర్‌షిప్ ఇచ్చారు.

సరోజినీ లండన్ కింగ్స్ కాలేజీలో, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ అధ్వర్యంలోని గిర్టన్ కాలేజిలోనూ ఉన్నత విద్యను అభ్యసించారు. ఆమె రాసిన కవితలను చదివి ఇంగ్లాండ్ లోని ఆంగ్ల భాషా విమర్శకులు 'ఆర్థర్ సైమన్స్', ఎడ్వర్ గూస్ లు అభినందించారు.

ఆమె రచించిన కావ్యాలలో "కాలవిహంగం" (Bird of time), "స్వర్గ ద్వారం" (The Golden Threshold), విరిగిన రెక్కలు (the broken wings) చాలా ప్రసిద్ధమైనవి. 1898లో విదేశాలలో విద్య పూర్తి చేసుకుని భారత్‌కు వచ్చిన ఆమెకు ముత్యాల గోవిందరాజులు నాయుడుతో పెండ్లి జరిగింది.

ఈ వర్ణాంతర పెండ్లిని ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జరిపించారు. వీరికి నలుగురు పిల్లలు. స్వాతంత్ర్యపోరాటంలో కొనసాగుతూనే మహిళా విద్యకోసం ప్రత్యేకంగా కృషి చేశారు. 1906లో దేశమంతా తిరిగి సమావేశాలు ఏర్పరచి మహిళల్లో చైతన్యం తీసుకువచ్చారు. 1915లో బొంబాయిలో 1916లో లక్నో లో జరిగిన కాంగ్రెస్ సభలలో ఆమె పాల్గొన్నారు. ఊరూరా, వాడవాడలా తిరుగుతూ స్వాతంత్ర్య ప్రభోదం ముమ్మరంగా సాగించారు. 1925 లో కాన్పూర్‌లో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహించారు. ఆఫ్రికా, కెనడా, అమెరికా తదితర దేశాల్లో పర్యటిస్తూ పీడిత భారత ప్రజల విముక్తికి ఆమె ప్రయత్నాలు చేశారు.

ఒక భారతీయ మహిళ చేస్తున్న ఉద్యమ ప్రచారానికి బ్రిటిష్ ప్రభుత్వం బెంబేలెత్తిపోయి 23 మే, 1930న ఆమెను అరెస్టు చేసింది. ఎనిమిది నెలల జైలుశిక్ష విధించారు. 1931లో లండన్ రౌండ్ టేబిల్ కాన్ఫరెన్స్‌కు భారతీయ ప్రతినిధిగా సరోజినీ నాయుడు హజరయ్యారు. క్విట్ ఇండియా ఉద్యమంలో అరెస్టు అయ్యారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఉత్తరప్రదేశ్ గవర్నరుగా సరోజిని నియమించబడ్డారు. హైదరాబాదు లోని గోల్డెన్ త్రెషోల్డ్ పేరుతో గల ఆమె ఇంటిలో హైదరాబాద్ యూనివర్సిటీని నెలకొల్పారు. జీవితమంతా మానవ సేవకు, దేశసేవకూ అంకితం చేసిన ఆమె తన 70ఏటా (1949 మార్చి 2 న)లక్నోలో మరణించారు. ఆమె జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం 1964 ఫిబ్రవరి 13న ఒక తపాలబిళ్ళను విడుదల చేసింది.

❄

ఆరోగ్యవంతులా? కాదా ?

- క్షణాల్లో చెప్పేస్తుంది
- దేశంలో..ఆల్గారిథంతో పనిచేసే తొలి పరికరం 'విన్ సెన్స్'
- తయారుచేసిన ఐఐటీ-మద్రాస్ శాస్త్రవేత్తలు

చెన్నై : ఎన్నో శాస్త్రీయ ఆవిష్కరణలకు, ఆలోచనలకు వేదిక ఐఐటీ-మద్రాస్. మనిషి ఆరోగ్యాన్ని అంచనావేసే కంప్యూటర్ ఆల్గారిథంను రూపొందించటం ద్వారా ఐఐటీ శాస్త్రవేత్తలు మరోమారు చరిత్ర సృష్టించారు. ఆరోగ్య పర్యవేక్షణ(హెల్త్ మానిటరింగ్) జరిపే మొట్ట మొదటి దేశీయ పరికరం 'విన్ సెన్స్' తయారుచేశారు. చేతి గడియారం పరిమాణంలో ఉండే 'విన్ సెన్స్' పరికరాన్ని మణికట్టు వద్ద ఉంచితే చాలు ఆరోగ్య, అనారోగ్య సంగతు లను గణాంకాల రూపంలో మన స్మార్ట్‌ఫోన్‌లో ప్రత్యక్షమవు తాయి. మన ఆరోగ్యంపై గ్రేడింగ్ కూడా ఇస్తుంది. దేశంలో 'హెల్త్ మానిటరింగ్'పై వచ్చిన మొట్ట మొదటి పరికరం 'విన్ సెన్స్' అని ఐఐటీ మద్రాస్‌వారు చెబుతున్నారు. శరీర ఉష్ణోగ్రత దగ్గర్నుంచీ అవయవాల పనితీరు వరకూ అన్నీ అంకెల రూపంలో సమాచారాన్ని తయారుచేస్తుంది. మనిషి ఆరోగ్యవంతుడా? కాదా? అన్నది క్షణాల్లో తేల్చేస్తుంది. వైద్యపరంగా 'గ్రేడింగ్' ఇచ్చేస్తుంది. ప్రధానంగా ఆరోగ్య సంరక్షణ (హెల్త్‌కేర్) రంగంలో 'విన్ సెన్స్' ఇచ్చే నివేదిక ప్రధాన భూమిక వహిస్తుందని ఐఐటీ మద్రాస్ శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. మొబైల్ హెల్త్ టెక్నాలజీ రంగంలో సేవలు అందిస్తున్న 'మెడ్లోటెక్' సంస్థతో కలిసి ఐఐటీ- మద్రాస్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ 'విన్‌సెన్స్' పరికరా న్ని తయారుచేశారు. శాస్త్రవేత్తల బృందానికి నేతృత్వం వహించిన ఎం.మణివణ్ణన్ దీని గురించి చెబుతూ, 'విన్ సెన్స్' పరికరాన్ని స్మార్ట్‌ఫోన్‌కు అనుసంధానించటం ద్వారా శరీర ఉష్ణోగ్రత, బీపీ, శ్వాస ప్రక్రియ, ఆక్సిజన్ ముఖ్యమైన అవయవాల పనితీరు తదితర విషయాల్ని మన ముందు ఉంచుతుంది. హెల్త్‌కేర్, మెడికల్ ఇన్సూరెన్స్ రంగంలో 'విన్ సెన్స్'ను ఉపయోగించే అవకాశ ముందని, దీనిద్వారా అవలీలగా, తక్కువ సమయంలో ఆరోగ్య విషయాల్ని తెలుసుకోవచ్చునని ఆయన తెలియజేశారు. అలాగే ప్రజా వైద్యరంగంలో, పరిశ్రమల్లో హెల్త్ స్క్రీనింగ్‌కు 'విన్ సెన్స్' ఉపయోగపడుతుందన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులుగా పరశురాం

- 33 మందితో నూతన కార్యవర్గం ఎన్నిక


పరశురాం


విజయ్ కన్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్
పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులుగా మామిడి కాయల పరశురాం ఎన్నికయ్యారు. నిజామాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ రామకృష్ణ రాష్ట్ర కమిటీని ప్రకటించారు. 33 మందితో రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులుగా మామిడి కాయల పరశురాం, ప్రధాన కార్యదర్శిగా విజయ్ కన్నా, ఉపాధ్యక్షులుగా సిద్ధలక్ష్మి, పవన్‌కుమార్, రాజేష్, సహాయ కార్యదర్శులుగా శ్రీశైలం, సాంబశివరావు, సురేష్, కోశాధికారిగా వెంకటరెడ్డి ఎన్నికైనట్టు వెల్లడించారు.

తీర్మానాలు

- రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం, జీడీపీలో 10శాతం నిధులు కేటాయించాలి.
- ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం క్యాలెండర్ ప్రకటించాలి.
- ఫీజ్ రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలి.
- మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలి.
- ప్రయివేటు, విదేశీ యూనివర్సిటీల ఏర్పాటుపై ప్రతిఘటించాలి.
- విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి.
- బోధన్ షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం తక్షణమే తెరిపించాలి.
- ఫార్మా-డీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలి.

23న బస్‌భవన్ ఎదుట ధర్నా

- ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీఎస్.రావు



నవతెలంగాణ-సిటీబ్యూరో
కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 23న బస్ భవన్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్.రావు అన్నారు. సోమవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఎస్‌వీకేలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీని దేశంలోనే అగ్రభాగాన నిలబెడతామని హామీనిచ్చిన టీఆర్‌ఎస్ ప్రభుత్వం నేటి వరకూ ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. 2017-18లో ఆర్టీసీకి బకాయి ఉన్న రూ.685 కోట్లతో పాటు 2018-19లో మరో రూ.1500 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంత సర్వీసుల నిర్వహణలో వస్తున్న నష్టాలను ప్రభుత్వమే భరించాలని కోరారు. కార్మికుల వేతన ఒప్పంద కాలం ముగిసి పది నెలలవుతున్నా సర్కారులో చలనం లేదన్నారు. దీంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 75 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన ఒప్పందం చేయాలని, మాస్టర్ స్కేల్ ఇవ్వాలని కోరారు. సకలజనుల సమ్మె కాలాన్ని డ్యూటీగా ప్రకటించాలని అన్నారు. కార్మికులకు గృహ నిర్మాణానికి వడ్డీ లేకుండా రూ.10లక్షల రుణం ఇప్పించాలన్నారు. కార్మికులపై పెరిగిన పని భారం తగ్గించాలని, 1/2017 సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంస్థలో ఖాళీగా ఉన్న వివిధ రకాల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అర్హులైన కార్మికులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. రిక్రూట్‌మెంట్ చేసుకున్న డ్రైవర్లను వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని, మహిళా ఉద్యోగుల డ్యూటీలు రాత్రి 9 గంటల్లోపు ముగిసే విధంగా చూడాలని అన్నారు. మెడికల్ వ్యవస్థ ప్రయివేటీకరణ చర్యలను వెంటనే ఆపాలని, తార్నాక ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కేంద్ర పథకాల అమలు భేష్ : కేంద్ర మంత్రి రాంకృపాల్ యాదవ్

- మంత్రి జూపల్లి, అధికారులతో సమీక్ష



కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యక్రమాల అమలు తెలంగాణలో బాగుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి రాంకృపాల్ యాదవ్ ప్రశంసించారు. రాష్ట్రంలో అమలవుతున్న ఆయా కేంద్ర పథకాలపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి రాజేంద్రనగర్‌లోని టీ సిపార్డ్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ఉపాధి హామీ, పీయంజీఎస్‌వై, రూర్బన్, డీడీయూజీకేవై, టీఆర్‌ఐజీపీ, పింఛన్ల పంపిణీ తదితర అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి రాంకృపాల్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణాలో గ్రామీణాభివృద్ధి శాఖ కార్యక్రమాల అమలు బాగుందని, మరింత ఉత్సాహంగా పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకొని ముందుకు పోవాలన్నారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కల మనుగడ రేటు 70 శాతం వరకు ఉండటంపై కేంద్ర మంత్రి సంతప్తి వ్యక్తం చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ దేశానికే ఆదర్శంగా గ్రామీణాభివృద్ధి శాఖను మార్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, కేంద్రం నుంచి మరింత సహకారం అందజేయాలని కోరారు.

చిక్కుల్లో విజయ్ మాల్యా

- బ్రిటన్ కోర్టులో కేసు ఓటమి



లండన్: భారత్‌లో బ్యాంకుల నుండి రుణాలు తీసుకుని ప్రస్తుతం బ్రిటన్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న పారిశ్రామికవేత్త విజయ్ మాల్యాకు బ్రిటన్‌లో చిక్కులెదురయ్యాయి. గతంలో మాల్యా నిర్వహించిన కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు, సింగపూర్‌కు చెందిన బీఓసీ వివాదంలో 9 కోట్ల డాలర్ల క్లయిమ్‌లను చెల్లించాల్సిందేనని బ్రిటన్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బీఓసీ సంస్థ నుండి కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌సంస్థ ఒక విమానాన్ని లీజుకు తీసుకుని బకాయి పడింది. ఈ కేసును విచారించిన వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పికెన్ ఈ నెల 5న ఈ మేరకు తీర్పును వెలువరించారు.

రాబోయే ఎన్నికల్లో నల్లగొండ ఎంపీగా పోటీ

- మంత్రి జగదీశ్‌రెడ్డికి డిపాజిట్ దక్కదు : కోమటిరెడ్డి



నవతెలంగాణ-వేములపల్లి
రాబోయే ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేస్తానని నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యాలయాన్ని ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో సాగుతోన్న ప్రజా వ్యతిరేక పాలనను అంతమొందించాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ తమ పార్టీ విజయఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి జగదీశ్‌రెడ్డికి డిపాజిట్ కూడా దక్కదని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీనిచ్చారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే నల్లగొండ మున్సిపల్ చైర్ పర్సన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్‌ను హత్యచేశారన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, శంకర్‌నాయక్, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ప్రజలే ఎన్‌కౌంటర్ చేస్తారు : మంత్రి జగదీశ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
కాంగ్రెస్‌ను 2019 ఎన్నికల్లో ప్రజలే ఎన్‌కౌంటర్ చేస్తారని మంత్రి జి జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నల్లగొండలో హత్యారాజకీయాలకు కాంగ్రెస్ కేంద్ర బిందువని మండిపడ్డారు. బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యకేసులో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు సంబంధముందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించడాన్ని ఖండించారు. నల్లగొండ నియోజకవర్గ రాజకీయాలతో వీరేశంకు సంబంధం లేదన్నారు. బొడ్డుపల్లి శ్రీనివాస్ మృతదేహం ఉండగానే, విచారణ ప్రారంభం కాకముందే పోలీసులను ఎలా తప్పుపడతారని ప్రశ్నించారు. శ్రీనివాస్‌కు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఎప్పుడైనా ప్రభుత్వానికి, పోలీసు అధికారులకు పిటిషన్ ఇచ్చారా?అని అడిగారు. కాంగ్రెస్ నాయకులు నోరుతెరిస్తే అబద్ధాలే మాట్లాడతారని చెప్పారు. చిల్లర వేషాలతో రాజకీయాల్లో నిలబడతామనుకోవడం అవివేకం అవుతుందన్నారు. వీరేశం, తాను కాంగ్రెస్ నాయకులపై కేసులు నమోదు చేయించాలనుకోవాలనుకుంటే నకిరేకల్, సూర్యాపేట నియోజకవర్గాల్లో పెట్టించేవాళ్లం కదా?అని ప్రశ్నించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కడైనా రాజకీయ కేసులు నమోదయ్యాయా?అని అడిగారు. రాజకీయాల్లో కొత్తవాళ్లమైనా తాము రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు నిరాశానిస్పృహలకు లోనై ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గురుకులాల్లో ఉన్నతమైన ప్రమాణాలతో కూడిన విద్య అందించాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. అందుకే నిబంధనలు కఠినంగానే ఉంటాయని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఇంజినీరింగ్‌పై ఎంత కఠినంగా వ్యవహరించామో గురుకులాల్లో ప్రమాణాలు పెంచే అంశంపైనా అలాగే వ్యవహరిస్తామన్నారు. నాణ్యత పెంచేందుకు ఈ నిబంధనలు రూపొందించామని చెప్పారు.

మూసిన జైళ్లను సామాజిక సేవలకు వినియోగిస్తాం : డీజీ

నవతెలంగాణ - మలక్‌పేట (హైదరాబాద్) : రాష్ట్రంలో మూసివేసిన 13 జైళ్లను రూ.3 కోట్ల నిధులతో ఆధునీకరించి సామాజిక సేవలకు వినియోగిస్తామని జైళ్ల శాఖ డీజీ వికె.సింగ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ చంచల్‌గూడ జైలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ జైళ్ల శాఖ మిషన్-2025తో ముందుకు వెళుతుందన్నారు. ఉపాధి కల్పన, నేర రహిత సమాజం, సామాజిక సేవలతో ముందుకు వెళ్తామని చెప్పారు. యాచక రహిత నగరం కోసం ప్రారంభించిన ఆనంద ఆశ్రమానికి ఇప్పటివరకు 3,749 మంది వచ్చారని తెలిపారు. వీరికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చి ఉపాధి కల్పించామని చెప్పారు. 3,749 మందిలో 3,526 మందిని ఇండ్లకు పంపించామని, ఇప్పుడు ఆనంద ఆశ్రమంలో 235 మంది ఉన్నారని తెలిపారు. ఖైదీలు లేకపోవడంతో రాష్ట్రంలో ఇప్పటికీ 13 జైళ్లను మూసేసి అక్కడ సోషల్ ఎడ్యుకేషన్, పరిశ్రమ ప్రాంతాలుగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో ఐజీ నర్సింహా, డీఐజీ సైదయ్య తదితరులు ఉన్నారు.

15న ఢిల్లీలో కేంద్ర జలవనరుల సమావేశం

- నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి
కేంద్ర జలవనరుల శాఖ ఈనెల 15న ఢిల్లీలో సమావేశం నిర్వహించనున్నది. ఈసమావేశానికి హాజరు కావలసిందిగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానం అందింది. కేంద్రజలవనరుల మంత్రి నితిన్ గడ్కరీ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో రాష్ట్రాల నీటిపారుదల మంత్రులు, ఆయా రాష్ట్రాల ఇరిగేషన్, ఆర్థిక శాఖల ముఖ్య కార్యదర్శులు, కేంద్ర జలసంఘం ఛైర్మన్, నాబార్డు ఛైర్మన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొంటారు. దేశవ్యాప్తంగా ప్రాధాన్య క్రమంలో ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజనకింద పూర్తి చేయతలపెట్టిన 99 సాగునీటి పథకాలకు అవసరమైన నిధుల అంశంపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరగనున్నది. ఇప్పటివరకు నాబార్డు నుంచి అందించిన నిధుల గురించి, ఇతర ప్రాధాన్యతా అంశాల గురించి ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారని అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో 15వతేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది.



ఇజ్రాయిల్ ప్రయోజనాలేంటి!

వెస్ట్ బ్యాంక్ ఆవాసాల నిర్మాణాలపై ట్రంప్ ఖండన

జెరూసలేం: పాలస్తీనాతో శాంతిని కోరుకోవడంలో ఇజ్రాయిల్ ప్రయోజనాలు ఏమిటని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశ్నించారు. ఇజ్రాయిల్ హేయమ్ డైలీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, ఒప్పందం కుదుర్చుకోవాలని పాలస్తీనా ఆకాంక్ష పట్ల కూడా సందేహం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్‌తో సత్సంబంధాలు నెరుపుతూ మరో పక్క పాలస్తీనాతో బహిరంగంగానే ఘర్షణ పడే అమెరికా అధ్యక్షుడు ఇజ్రాయిల్‌పై ఇటువంటి విమర్శ చేయడం చాలా అరుదు. ఇప్పటికైతే పాలస్తీనియన్లు శాంతి స్థాపన కోసం ఎదురుచూడడం లేదని, ఇజ్రాయిల్ అలా ఎదురుచూస్తుందని తాము అనుకో వడం లేదని అన్నారు. కాబట్టి ఏం జరుగుతుందో చూడడం ప్రస్తుతం మనం చేయాల్సిన పనని ఆయన వ్యాఖ్యానించారు. అయితే అమెరికా శాంతి ప్రణాళిక ఏమిటన్న వివరాలు ట్రంప్ వెల్లడించలేదు. పైగా ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ ఆవాసాలను నిర్మించడాన్ని కూడా ట్రంప్ విమర్శించారు. గత ప్రభుత్వాలతో పోలిస్తే ట్రంప్ హయాంలో ఇజ్రాయిల్ అక్రమ ఆవాసాల నిర్మా ణాన్ని ఖండనలు తక్కువే. 'ఆ ఆవాసాల నిర్మాణం చాలా క్లిష్టంగా మారింది. దాంతో శాంతి ప్రయత్నాలకు కూడా ఇబ్బంది కలుగుతోంది. కాబట్టి ఇజ్రాయిల్ ఈ విషయంలో కాస్తంత జాగ్రత్తగా వుండాలి' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తూ ట్రంప్ ప్రకటించిన నాటి నుండి అమెరికా, పాలస్తీనా మధ్య సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి. పైగా పాలస్తీనా శరణార్థుల వ్యవహారాలు చూసే ఐరాస నిధుల్లో కోత కూడా విధించారు. ఇజ్రాయిల్‌తో చర్చలు పునరుద్ధరిస్తేనే సాయం అందిస్తామని షరతు విధించారు.

దుబాయ్‌లో ప్రపంచంలోనే ఎత్తైన హోటల్

- 75 అంతస్థులు , 356 మీటర్లు ఎత్తు

దుబాయ్: గల్ఫ్ మెట్రోపాలిస్ దుబాయ్ రికార్డులు సృష్టించడంలో ఎప్పుడూ ముందు ఉంటుంది. ప్రపంచంలోనే అతి ఎత్తయిన కొత్త హోటల్‌ను తాము ప్రారంభించనున్నట్టు ప్రకటించింది. ఈ గోవెరా హోటల్ 75 అంతస్థులతో నిర్మితమైంది. దాని ఎత్తు 356 మీటర్లు లేదా దాదాపు పావు మైలు ఉంటుంది. అంతకు ముందు ఈ రికార్డు దుబాయ్ జెడబ్ల్యు మారియోట్ మార్క్విస్‌పై నమోదై ఉంది. గోవేరా హోటల్ ఎత్తుకన్నా ఇది ఒక్క మీటరు ఎత్తు మాత్రమే తక్కువగా ఉంటుంది. గోవెరా హోటల్ సోమవారంనాడు అతిథుల కోసం తెరుచుకుంటుందని ఎమిరేట్స్ దినపత్రిక ది నేషనల్ రాసింది. ప్రపంచంలోనే ఎత్తయిన భవనం బుర్జ్ ఖలీఫా కూడా దుబాయ్‌లోనే ఉంది. ఇది 828 మీటర్ల ఎత్తు ఉంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ట్రేడ్ ఫెయిర్ ఎక్స్‌పో 2020ని నిర్వహిస్తోంది. అప్పటికి ఏడాదికి 20 మిలియన్ల మంది సందర్శకులను ఆకర్షించాలనేది లక్ష్యంగా ఉంది. ఎడారి ప్రాంతమైన దుబాయ్ అద్భుతమైన షాపింగ్ మాల్స్‌కకు, పలు లగ్జరీ రిసార్టులకు, ఇండోర్ స్కై రిసార్ట్‌కు ప్రసిద్ధి చెందింది.

అంతరిక్ష కేంద్రం ప్రయివేటీకరణకు ట్రంప్ సర్కార్ కసరత్తు

వాషింగ్టన్: అమెరికాలోని అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) ప్రయివేటీకరణకు ట్రంప్ సర్కార్ కసరత్తు ప్రారంభించింది. ఐఎస్ఎస్ ప్రయివేట్‌పరం అయ్యే అవకాశాలున్నాయని అమెరికాలోని వాషింగ్టన్ పోస్ట్ ఓ కథనాన్ని ప్రచురించింది. అత్యంత ఖర్చుతో కూడుకున్న ఐఎస్ఎస్‌కు మరికొన్ని సంవత్సరాల్లో నిధులు నిలిపేయాలని ట్రంప్ యోచిస్తున్నారని ఆ పత్రిక ప్రచురించింది. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా, రష్యా అంతరిక్ష పరిశోధన సంస్థ సంయుక్తంగా ఈ అంతరిక్ష కేంద్రాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ కేంద్రంలో వివిధ దేశాలకు చెందని వ్యోమగాములు అంతరిక్షంలో రకరకాల పరిశోధనలు చేస్తుంటారు. ఐఎస్ఎస్‌కు ఫెడరల్ ప్రభుత్వం నుంచి నేరుగా నిధులు సమకూర్చడాన్ని 2025 నాటికి ఆపేయాలని భావిస్తున్నారని, అంటే దానర్థం ఐఎస్ఎస్‌ను కక్ష్య నుంచి తొలగించడం కాదని నాసా ఓ నివేదికలో పేర్కొన్నట్లు వాషింగ్టన్ పోస్ట్ కథనంలో వెల్లడించింది. భవిష్యత్తులో ఐఎస్ఎస్‌ను ప్రయివేట్ కంపెనీలకు అప్పగించి కమర్షియల్ ప్లాట్‌ఫాంగా మార్చనున్నట్టు తెలుస్తోంది. ఐఎస్ఎస్‌కు సంబంధించి రానున్న ఏడేండ్లలో అంతర్జాతీయ, వాణిజ్య భాగస్వామ్యాన్ని విస్తృత పరచనున్నట్లు నాసా పేర్కొందని పత్రిక వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం 2019లో అంతరిక్ష కేంద్రానికి 150 మిలియన్ల డాలర్లను కేటాయించాలని ప్రతిపాదిస్తోందట. తర్వాతి సంవత్సరాల్లో మరిన్ని నిధులు అందజేసి.. రానున్న ఏండ్లలో ప్రైవేటీకరించడానికి సహకరించే అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటు చేయాలని భావిస్తోందని సమాచారం. ఈ మేరకు ప్రయివేట్ సెక్టార్‌కు మార్కెట్ అనాలసిస్, అభివృద్ధి ప్రణాళికలను అందజేయాలని అధ్యక్ష నివాసం కోరే అవకాశం ఉందని వాషింగ్టన్ పోస్ట్ కథనంలో వెల్లడించింది. అయితే దీనిని ఏ విధంగా ప్రైవేటీకరిస్తారు.. దాని వల్ల ప్రైవేటు కంపెనీలకు ఏ విధంగా లాభం చేకూరుతుందనే విషయంపై స్పష్టత లేదు. ఈ కథనంపై స్పందించడానికి నాసా నిరాకరించింది.

రోహింగ్యాల ఆకలికేకలు...



నెపీడా: : మయన్మార్ నుంచి ప్రాణాలు అరచేత పట్టుకుని బంగ్లాదేశ్ వెళ్లిన శరణార్థుల పరిస్థితిలో నెలలు గడిచినా ఎలాంటి మార్పు కనిపించడంలేదు. సహాయక కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న ఆహార పదార్థాలతోనే వారంతా రోజులు గడపాల్సిన దుస్థితి నెలకొన్నది. "ఉపాధి లేదు. కడుపు నిండా తిండి దొరకట్లేదు, సరైన వైద్య సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం' అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రంలో గతేడాది ఆగస్టులో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న తర్వాత లక్షలాది మంది రోహింగ్యన్లు దేశ సరిహద్దు దాటి బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించారు. దాదాపు ఆరు నెలలు గడిచినా నేటికీ తమ భవిష్యత్తు ఎలా ఉండబోతోందో అర్థంకాని పరిస్థితిలో వారంతా ఉన్నారు. ఈ రోహింగ్యాలను వెనక్కి పంపేందుకు బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలు అంగీకరించాయంటూ ఇటీవల వార్తలొచ్చాయి. అందరూ రెండు నెలల్లోపు తిరిగి వెళ్లవచ్చునని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ ఒక ప్రకటన కూడా విడుదల చేసింది. అయితే, తమకు సరైన భద్రత కల్పిస్తామని రెండు దేశాలు లిఖితపూర్వకంగా స్పష్టమైన హామీ ఇస్తేనే తమ సొంతూళ్లకు వెళ్తామని బాధితులు అంటున్నారు.

హవాలా దందా నిందితులు ఆరుగురు అరెస్ట్

- ద్విచక్ర వాహనాలపై డబ్బుల సరఫరా
- రెండు ద్విచక్రవాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు, రూ. 1.40కోట్లు స్వాధీనం

నవతెలంగాణ- హైదరాబాద్ సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో వాట్సాప్ ద్వారా హవాలా దందా సాగిస్తున్న నిందితులను పోలీ సులు పట్టుకున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ట్యాక్స్‌ల నుంచి తప్పించుకునేందుకు గుట్టు చప్పుడు కాకుండా హవాలా దందా నడుపు తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరుగురి నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు ద్విచక్రవాహనాలు, ఆరు సెల్‌ఫోన్లు, రూ. 1.40కోట్ల 80వేలను స్వాధీనం చేసుకు న్నారు. సోమవారం పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వర్‌రావు, ఐటీ శాఖ డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్‌రెడ్డితో కలిసి నగర పోలీస్ కమిషనర్ వివి.శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. గుజరాత్‌కు చెందిన జేయేష్‌కుమార్ పటేల్ 2009లో



హైదరాబాద్‌కు వచ్చాడు. అబిడ్స్‌లో డైమండ్స్, జువెల్లరీ వ్యాపారం మొదలుపెట్టాడు. ఇదే క్రమంలో హవాలా ఏజెంట్ల ద్వారా కోట్లాది రూపాయలను ట్రాన్స్‌ఫర్ చేసేవాడు. అయితే అందులో లాభాలను చూసిన పటేల్ తానే హవాలా దందా నడిపించాలని నిర్ణయించు కున్నాడు. ఈ క్రమంలో అబిడ్స్ చిరాగ్‌అలీ లేన్‌లో 'మహాలక్ష్మి జేమ్స్ అండ్ జువెల్లరీ మాల్' ఏర్పాటు చేసి హవాలా దందా మొదలుపెట్టాడు. కార్యాలయంలో వి.బి.చౌహాన్, పటేల్ ప్రదీప్‌కుమార్‌తోపాటు డబ్బులు సరఫరా చేసేందుకు మరికొందరిని పెట్టుకున్నాడు. 0.6 నుంచి 0.8 శాతం కమీషన్లు తీసుకొని కోట్లాది రూపాయలను హవాలా రూపంలో ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాడు. ద్విచక్ర వాహనంపై వెళ్లి డబ్బులు సరఫరా చేస్తున్నట్టు గుర్తించిన టాస్క్‌ఫోర్సు పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. వారిని విచారించడంతో స్కాన్‌ఎనర్జీ అండ్ పవర్ లిమిటెడ్, రాయలసీమ స్టీల్ రీ- రోలింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలకు చెందిన బ్లాక్ నగదును హవాలా రూపంలో అందిస్తున్నట్టు తేలింది. దాంతో స్కాన్ ఎనర్జీ అండ్ పవర్ లిమిటెడ్ చీఫ్ ఫైనాన్స్ అధికారి డి.అరుణ్‌కుమార్‌తోపాటు, ఆ సంస్థ ఏజెంట్ బి.విఘ్నేశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో రాయలసీమ స్టీల్ రీ- రోలింగ్ మిల్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఏజెంట్ గణేష్ సత్యనారాయణ సాబూను అదుపులోకి తీసుకున్నట్టు సీపీ తెలిపారు. రెండు కంపెనీలకు చెందిన యజవ వానులను త్వరలో అరెస్టు చేస్తామన్నారు. హవాలా దందా గుట్టును రట్టు చేసినందుకు టాస్క్‌ఫోర్సు పోలీస్ సిబ్బందిని సీపీ అభినందించారు. డబ్బులను ఐటీ శాఖకు అప్పగించినట్టు సీపీ తెలిపారు.

విద్యాశాఖలో వివాదాలకు చెక్ పడేనా..?

- ఆరుగురు ఉద్యోగులకు స్థానచలనం
- సమగ్ర విచారణకు ప్రత్యేక కమిటీ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్



పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో ఉద్యోగుల మధ్య జరుగుతున్న వివాదాలకు చెక్ పెట్టేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించారు. దీనిలో భాగంగా వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరుగురు ఉద్యోగులను ఇతర విభాగాలకు బదిలీ చేస్తూ కమిషనర్ జి కిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోపణలపై విచారణకు ప్రత్యేకంగా ఒక కమిటీని నియమించారు. 'పాఠశాల డైరెక్టరేట్‌లో లొల్లి' శీర్షికతో నవతెలంగాణ శుక్రవారం కథనం ప్రచురించింది. దీనిలో డైరెక్టరేట్‌లో పనిచేస్తున్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆరుగురు ఉద్యోగులకు సంబంధించిన వివరాలను పేర్కొనడం జరిగింది. ఈ నేపథ్యంలో కమిషనర్ వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. అదేరోజు ఆ ఉద్యోగులనూ స్థానచలనం చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. రెండు రోజుల ముందే సీనియర్ అసిస్టెంట్‌ను..చెప్పుతో కొట్టిన ఘటనలో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి డిప్యూటేషన్ రద్దు చేస్తూ నిజామాబాద్ డీఈఓకు సరెండర్ చేశారు. సీనియర్ అసిస్టెంట్ నాగరాజును ఓపెన్‌స్కూల్ సొసైటీకి బదిలీ చేశారు. వీరితో పాటు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్న నేపథ్యంలో సర్వీసెస్ విభాగంలో పనిచేస్తున్న సూపరింటెండెంట్ జ్ఞానేశ్వర్‌ను ఓపెన్‌స్కూల్ సొసైటీకి, అడ్మిన్ విభాగంలో పనిచేస్తున్న ప్రశాంతిని ఎస్‌సీఈఆర్టీకి బదిలీ చేశారు. ఆర్ఎంఎస్ఏలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ అసిస్టెంట్ కృష్ణమోహన్‌రెడ్డిని సైట్ విభాగానికి, ఆయనపై ఫిర్యాదు చేసిన జూనియర్ అసిస్టెంట్ కౌసర్‌ను డిప్యూటేషన్ రద్దు చేసి ఖమ్మం డీఈఓకు సరెండర్ చేశారు. అయితే వారం రోజుల్లోనే మూడు పంచాయితీలు పోలీస్‌స్టేషన్ చేరడంలో కమిషనర్ సీరియస్ అయినట్టు తెలిసింది. దీంతోనే వారందరికీ స్థాన చలనం చేసినట్టు సమాచారం. దీనిలో న్యాయం చేయమని కోరిన బాధితులనూ బదిలీ చేయడంపై డైరెక్టరేట్‌లోని ఉద్యోగుల్లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ చర్యతో ఎవ్వరూ ఫిర్యాదు చేసేందుకూ ముందుకు రారని చెబుతున్నారు. అయితే కమిషనర్ అనుమతి లేకుండా మీడియాతో మాట్లాడారనే కారణంతో ఒకరినీ, ఓ ప్రజాప్రతినిధి ఒత్తిడితో మరొకరిని బదిలీ చేసినట్టు తెలుస్తోంది. ఈ పంచాయితీలపై ప్రత్యేకంగా ఏకసభ్య కమిటీని కమిషనర్ నియమించారు. ఉద్యోగుల తప్పులేదని తేలితే వారి బదిలీ రద్దు చేసే అవకాశముందనీ అధికారవర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం జరిగిన బదిలీలను ఆపేందుకు కొందరు ఉద్యోగులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కమిషనర్‌పై ప్రజాప్రతినిధులతో, ప్రభుత్వ పెద్దలతో ఒత్తిడి తీసుకొస్తున్నారు. అయితే ఈ బదిలీలతో ఉద్యోగుల మధ్య వివాదాలకు తెరపడుతుందని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆశాభావంతో ఉన్నారు.

నవచిత్రం

ఛల్ మోహన్‌రంగ..


నితిన్

నితిన్, మేఘా ఆకాష్ జంటగా కృష్ణ చైతన్య దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'ఛల్ మోహన్‌రంగ' అనే టైటిల్‌ను నిర్ణయించారు. శ్రేష్ఠ్ మూవీస్, పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ పతాకాలపై నిఖితా రెడ్డి సమర్పణలో ఎన్.సుధాకర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్రివిక్రమ్ కథ అందించిన ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను ఆదివారం పవన్ కళ్యాణ్ ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర బృందానికి అభినందనలు తెలియజేశారు. దీనిపై హీరో నితిన్ స్పందిస్తూ, 'పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ ఈ చిత్ర ప్రచార చిత్రాలను విడుదల చేయడం ఎంతో సంతోషంగా ఉంది' అని ట్వీట్‌తో పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాత సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, 'ఇప్పటి వరకు హైదరాబాద్, ఊటీ, అమెరికాలో షూటింగ్ చేశాం. మిగిలిన ఒక్క పాటను ఈ నెల 14 నుంచి హైదరాబాద్‌లో చిత్రీకరిస్తాం. అలాగే చిత్ర టీజర్‌ను ప్రేమికుల రోజైన ఈ నెల 14న, సినిమాను ఏప్రిల్ 5న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని చెప్పారు. 'షూటింగ్‌తోపాటు సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను జరుపుకుంటోంది. ప్రేమతో కూడిన కుటుంబ కథా చిత్రం. చాలా సరదాగా సాగుతుంది. అన్ని వర్గాలను ఆకట్టుకునేలా సినిమా ఉంటుంది' అని దర్శకుడు తెలిపారు. డా.కె.వి.నరేష్, లిజి, రోహిణి హట్టంగడి, రావు రమేష్, సంజయ్ స్వరూప్, ప్రభాస్ శ్రీను, నర్రా శ్రీను, మధునందన్, ప్రగతి, సత్య, పమ్మి సాయి, రాజశ్రీనాయర్, ఆశురెడ్డి, వెన్నెల రామారావు, కిరీటి, రణధీర్, నీలిమ భవాని, బేబి హాసిని, బేబి కృత్తిక, మాస్టర్ జోయ్, మాస్టర్ లిఖిత్, మాస్టర్ స్నేహిత్, మాస్టర్ స్కందన ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: థమన్, కెమెరా: ఎం.నటరాజ సుబ్రమణియన్, ఎడిటింగ్: ఎస్.ఆర్.శేఖర్.


రంజిత్, వి.వి.వినాయక్, భరత్‌సోమి, కీరవాణి, పాలక్ లల్వాని, త్రికోటి

జువ్వ ఆడియో ఆవిష్కరణ

రంజిత్, పాలక్ లల్వాని జంటగా త్రికోటి దర్శకత్వంలో సోమి ఫిల్మ్స్ పతాకంపై భరత్ సోమి నిర్మించిన చిత్రం 'జువ్వ'. ఎం.ఎం.కీరవాణి సంగీతం సమకూర్చిన ఈ చిత్ర పాటల విడుదల కార్యక్రమం ఆదివారం హైదరాబాద్‌లో వైభవంగా జరిగింది. అతిథిగా విచ్చేసిన దర్శకుడు వి.వి.వినాయక్ పాటల సీడీలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'తమ్ముడు రంజిత్ మీద అభిమానంతో హీరోగా పరిచయం చేస్తున్న నిర్మాత భరత్ సోమికి అభినందనలు. ఈ సినిమా ద్వారా రంజిత్‌కు నటుడిగా మంచి గుర్తింపు రావాలని కోరుకుంటున్నాను. అలాగే కీరవాణి సినిమాకు సంగీతం అందించడం గొప్ప విషయం. కథ బాగుంటేనే ఆయన మ్యూజిక్ అందిస్తారు. కాబట్టి ఈ చిత్రం కచ్చితంగా పెద్ద విజయం సాధిస్తుంది. చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్' అని అన్నారు.

'దర్శకుడు త్రికోటి నాకు బాగా తెలుసు. అతని మొదటి సినిమా 'దిక్కులు చూడకు రామయ్య' చిత్రానికి నేనే సంగీతం అందించాను. ఇది పక్కా కమర్షియల్ సినిమా. ప్రేక్షకులకు విందు భోజనం లాంటిది. సినిమాలో అన్ని రకాల ఎమోషన్స్ ఉన్నాయి. హీరో రంజిత్ డాన్స్, ఫైట్స్ చాలా బాగా చేశాడు. హీరోగా నిరూపించుకుంటాడు. కమర్షియల్ సినిమాలతోపాటు ఆఫ్‌బీట్ చిత్రాలు కూడా చేసి భవిష్యత్‌లో పెద్ద స్టార్‌గా ఎదగాలని కోరుకుంటున్నా' అని కీరవాణి తెలిపారు.

దర్శకుడు త్రికోటి చెబుతూ,'దర్శకుడిగా నాకిది రెండవ చిత్రం. ఈ ఛాన్స్ కల్పించిన మహేంద్రకు థ్యాంక్స్. నాలాంటి కొత్తవాడి సినిమాకు సంగీతం అందించిన కీరవాణి నిజంగా నాకు దేవుడితో సమానం. ఆయన రుణం తీర్చుకోలేనిది. మాటల రచయిత రత్నం మంచి కథ అందించారు. నిర్మాత భరత్‌కు, ఈ సినిమా హిట్ కావాలని మనస్ఫూర్తిగా సహకరిస్తున్న యూనిట్‌కు కృతజ్ఞతలు. సినిమాను ఆదరించాలని కోరుకుంటున్నా' అని చెప్పారు. 'గెస్ట్‌గా వచ్చిన వినాయక్‌కి, మమ్మల్ని ఆశీర్వదించిన బొత్స దంపతులకు థ్యాంక్స్. ఇది చాలా మంచి సినిమా. రత్నం డైలాగ్స్ బాగున్నాయి. హీరో రంజిత్, హీరోయిన్ పాలక్, విలన్ అర్జునా బాగా నటించారు. ఈ నెల 23న సినిమాను విడుదల చేస్తున్నాం' అని నిర్మాత తెలిపారు.

కథానాయకుడు రంజిత్ మాట్లాడుతూ, 'నా మొదటి సినిమాకు లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి సంగీతం అందించడం నా అదృష్టం. ఈ సినిమాకు కథే హీరో. కచ్చితంగా అందరికీ నచ్చే సినిమా అవుతుంది' అని చెప్పారు.

హైదరాబాద్‌లో క్లైమాక్స్


అల్లు అర్జున్

అల్లు అర్జున్, అను ఇమ్మాన్యుయేల్ జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'నా పేరు సూర్య – నా ఇల్లు ఇండియా'. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మి సినీ క్రియేషన్స్ పతాకంపై శిరీష శ్రీధర్ నిర్మిస్తున్నారు, బన్నీవాసు సహనిర్మాత. నేటి నుంచి హైదరాబాద్‌లో తాజా షెడ్యూల్ చిత్రీకరణ జరుపుకుంటోంది. ఆ విశేషాలను నిర్మాతలు తెలియజేస్తూ, 'తాజా షెడ్యూల్‌లో భాగంగా చిత్ర క్లైమాక్స్‌ను షూట్ చేస్తున్నాం. ఇది అత్యంత భారీ స్థాయిలో ఉంటుంది. ఇటీవల విడుదల చేసిన దేశభక్తి పాటకు మంచి స్పందన లభించింది. సినిమాలోని రెండో పాట 'లవర్ ఆల్సో.. ఫైటర్స్ ఆల్సో'ను ప్రేమికుల రోజు సందర్భంగా ఈ నెల 14న విడుదల చేయనున్నాం. రామజోగయ్య శాస్త్రి తన అనుభవాన్ని రంగరించి ఈ అందమైన పాటను రాశారు. దీనికి విశాల్–శేఖర్ అద్భుతమైన ట్యూన్స్ అందించారు. శేఖర్ గాత్రంతో ఈ పాట మరింత అందంగా తయారైంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాను ఏప్రిల్ 27న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం' అని అన్నారు.

ఊహించని అద్భుత విజయమిది..


వెంకీ అట్లూరి


'ఇటీవల విడుదలైన 'తొలిప్రేమ' చిత్రానికి అద్భుతమైన స్పందన వస్తోంది. నా వరకు ఇది ఒక సినిమా కాదు, ఓ జ్ఞాపకం' అని అంటున్నారు దర్శకుడు వెంకీ అట్లూరి. వరుణ్ తేజ్, రాశీఖన్నా జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన 'తొలిప్రేమ' చిత్రం ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్ తెచ్చుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు వెంకీ మీడియాతో మాట్లాడుతూ, 'ఇది ఫిక్షనల్ స్టోరీ. నేనీ కథను తయారు చేసుకున్నప్పుడు వరుణ్ తేజ్ నటించిన 'ముకుంద' టీజర్ విడుదలైంది. అది చూసి ఇలాంటి హీరో అయితే నా కథకు బాగా సెట్ అవుతారనిపించింది. కానీ మెగా కుటుంబం నుంచే హీరోలు ఇలాంటి ప్రేమ కథలు చేస్తారో లేదో అనుకున్నా. 'కంచె' చూశాక వరుణ్ భిన్న కథలు చేస్తున్నాడనిపించి 'లోఫర్' సమయంలో ఈ కథ చెప్పా. నిర్మాత దిల్‌రాజుకు ఈ కథ బాగా నచ్చింది. ఆయన ఎక్కువ సినిమాలతో బిజీగా ఉండటంతో బాపినీడును కలిసి కథ చెప్పా. ఆయనకి కూడా ఈ కథ బాగా నచ్చడంతో సినిమా సెట్స్‌పైకి వెళ్ళింది. ఇటీవల విడుదలైన ఈ సినిమా ఊహించని స్థాయిలో విజయం సాధించింది. వరుణ్ తేజ్ లేకపోతే ఈ నా కల ఇంత వరకు వచ్చేది కాదు. డైలాగ్స్‌కి రెస్పాన్స్ చాలా బాగుంది. అది మరింత సంతోషాన్నిచ్చింది. జీవితంలోని మూడు పార్శ్వాలను చూపే చిత్రాలు 80లో ఎక్కువగా వచ్చాయి. వాటికి భిన్నంగా కొత్తగా చేయాలనుకున్నప్పుడు డైలాగ్స్ పరంగా కొత్తగా ఉండాలనుకున్నా. మనం చూస్తున్న, మాట్లాడుకునే విషయాల్లోంచి కొత్తగా మాటలు పుట్టించే ప్రయత్నం చేశా. నాలాగే టెక్నీషియన్లు కూడా సినిమాని నమ్మారు. అందుకే ఇంతటి విజయం సాధ్యమైంది. రాశీఖన్నా ఈ సినిమా కోసం బరువు పెరగడంతోపాటు, తగ్గారు కూడా. థమన్ తనదైన సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో ఆకట్టుకున్నారు. సినిమాకు 'తొలిప్రేమ' టైటిల్ పెట్టినప్పుడు ఎవరు ఎలా రీయాక్ట్ అవుతారో అనుకున్నా. కానీ దాని గురించి ఎవరూ పెద్దగా మాట్లాడలేదు, జాగ్రత్తగా తీయ్' అన్నారు. కానీ దాని గౌరవాన్ని కాపాడాలనే ఓ చిన్న భయం ఉండేది. సినిమాపై నమ్మకంతోనే ఆ టైటిల్ ఫైనల్ చేశాం. నటుడిగా పలు సినిమాల్లో నటించాను. రైటర్‌గానా ...నటుడిగానా..? అని అనుకున్నప్పుడు రైటర్, అట్నుంచి దర్శకత్వం అనే ఆలోచన వచ్చింది. 'ఇట్స్ మై లవ్ స్టోరీ', 'కేరింత' చిత్రాలకు రచయితగా పనిచేశా. ఈ చిత్రంతో దర్శకుడిగా మారాను. రచయితగా ప్రేమకథలు, రాజకీయ నేపథ్యం, డ్రామాతో కూడిన చిత్రాల్ని ఇష్టపడతా. తదుపరి బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, దిల్‌రాజు నిర్మాణంలో ఓ సినిమా ఉంటుంది' అని చెప్పారు.


జాక్వెలిన్ ఫెర్నాండేజ్

మాధురీకి అంకితం..

"బాఘి 2'లోని నా వెర్షన్ 'ఏక్ దో.. తీన్' పాటను మాధురీ దీక్షిత్‌కు అంకితం చేయాలనుకుంటున్నాను' అని అంటోంది జాక్వెలిన్ ఫెర్నాండేజ్. 1988లో వచ్చిన 'తేజాబ్' చిత్రంలో మాధురీ దీక్షిత్‌పై చిత్రీకరించిన 'ఏక్ దో తీన్' పాట అప్పట్లో ఓ సంచలనం. కుర్రకారును ఓ ఊపు ఊపేసింది. అహ్మద్ ఖాన్ దర్శకత్వం వహిస్తున్న 'బాఘి 2'లో ప్రత్యేక పాటగా జాక్వెలిన్‌పై ఈ పాటను చిత్రీకరిస్తున్నారు. 'ఈ పాటలో నటించడాన్ని ఒత్తిడిగా ఫీలవుతున్నాను. ఓ ఐకానిక్ సాంగ్‌ను అదే స్థాయిలో మేం రీక్రియేట్ చేయగలమా, సాధ్యమయ్యే పనేనా అనిపించింది. ఇది ఎప్పటికీ పాజిబుల్ కాదు. కానీ మా వంతు నిజాయితీగా బాగా చేయాలనుకుంటున్నాం' అని జాక్వెలిన్ తెలిపింది.

సైరాకు ఇళయరాజా బాణీలు..!


ఇళయరాజా

చిరంజీవి అత్యంత ప్రతిష్టాత్మకంగా నటిస్తున్న చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. ఆయన 151వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథ ఆధారం. సురేందర్‌రెడ్డి దర్శకుడు. ఈ చిత్రానికి ఏఆర్ రెహ్మాన్ స్వరాలు సమకూరుస్తున్నారని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించిన విషయం విదితమే. కొన్ని కారణాల వల్ల రెహ్మాన్ ఈ సినిమా నుంచి తప్పుకున్నారనే వార్తలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఆయన స్థానంలో ఎం.ఎం.కీరవాణి పేరు వినిపించింది. అయితే తాజాగా మరో పేరు తెరపైకి వచ్చింది. మ్యూజిక్ మేస్ట్రో ఇళయరాజా ఈ చిత్రానికి సంగీతం అందించనున్నట్టు సమాచారం. పద్మవిభూషణ్ పురస్కారానికి ఇళయరాజా ఎంపికైన సందర్భాన్ని పురస్కరించుకుని ఇటీవల చిరంజీవి కలిశారు. ఈ సందర్భంగా తాజా చిత్రానికి సంబంధించిన చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. అయితే ఇళయారాజా ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తారా లేదా అనే విషయంలో ఇంకా క్లారిటీ రాలేదు. ఈ విషయంపై చిత్రయూనిట్ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. గతేడాది ప్రారంభమైన ఈ సినిమా ఓ షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. త్వరలో తదుపరి షెడ్యూల్ ప్రారంభించుకోనుంది. బాలీవుడ్ బిగ్‌బీ అమితాబ్ బచ్చన్, విజయ్ సేతుపతి, సుదీప్, జగపతిబాబు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో చిరంజీవి సరసన తొలిసారిగా నయనతార కథానాయికగా నటిస్తుంది. కొణిదెల ప్రొడక్షన్స్ కంపెనీ పతాకంపై రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు.

నయా జర్నీ షురూ..


శ్రద్ధా కపూర్

గతేడాది 'ఓకే జాను', 'హాఫ్ గర్ల్‌ఫ్రెండ్', 'హసీనా పార్కర్' చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించింది శ్రద్ధా కపూర్. ఈ సినిమాలు ఆశించిన ఫలితాన్ని రాబట్టలేకపోయినప్పటికీ అందులో శ్రద్ధా కపూర్ నటనకు మంచి మార్కులే పడ్డాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తూ ఏకంగా ప్రభాస్ సరసన 'సాహో' చిత్రంలో నటిస్తోంది. శరవేగంగా ఈ చిత్రం చిత్రీకరణ జరుపుకుంటోంది. ఇదిలా ఉంటే, శ్రద్ధా నటించే మరో నూతన బాలీవుడ్ చిత్ర షూటింగ్ ప్రారంభమైంది. శ్రీ నారాయణ సింగ్ దర్శకత్వం వహిస్తున్న 'బట్టి గుల్ మీటర్ చాలు' చిత్ర షూటింగ్‌లో శ్రద్ధా పాల్గొంది. ఈ విషయాన్ని శ్రద్ధా ట్విట్టర్ ద్వారా అభిమానులతో షేర్ చేసుకుంది. 'మొదటి రోజు 'బట్టి గుల్ మీటర్ చాలు' చిత్ర షూటింగ్‌లో పాల్గొంటున్నందుకు చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. కొత్త జర్నీ ప్రారంభమైంది. మరోసారి షాహిద్ కపూర్‌తో కలిసి నటిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. నాకు అతను లక్కీ పర్సన్' అంటూ శ్రద్ధా ట్వీట్ చేసింది. సోషల్ కామెడీ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో యామీ గౌతమ్ మరో కథానాయికగా లాయర్ పాత్రలో నటిస్తోంది. ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లో చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 31న విడుదల చేయబోతున్నారు. శ్రద్ధా దీంతోపాటు బాలీవుడ్‌లో 'స్త్రీ' చిత్రంలోనూ నటిస్తోంది. హర్రర్ కామెడీగా రూపొందుతున్న ఈ చిత్రానికి అమర్ కౌశిక్ దర్శకత్వం వహిస్తున్నారు. రాజ్ కుమార్‌రావ్ హీరోగా నటిస్తున్నారు. తెలుగులో నటిస్తున్న 'సాహో' చిత్రానికి సుజిత్ దర్శకత్వం వహిస్తుండగా యువి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో తెరకెక్కుతుందీ చిత్రం.

సందేశాత్మకంగా సత్యగ్యాంగ్

సాత్విక్ ఈశ్వర్, అక్షిత, ప్రత్యూష్, హర్షిత ప్రధాన పాత్రధారులుగా ప్రభాస్ దర్శకత్వంలో సిద్ధయోగి క్రియేషన్స్ పతాకంపై మహేష్‌ఖన్నా నిర్మిస్తున్న చిత్రం 'సత్యగ్యాంగ్'. ఈ చిత్ర టీజర్ విడుదల కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. అనాథ పిల్లలు టీజర్‌ను విడుదల చేయటం విశేషం. ఈ సందర్భంగా వారికి నిర్మాత మహేష్ ఖన్నా 10వేల రూపాయాల ఆర్థికసాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, 'సమాజంలో అనాథలనే వాళ్ళు ఉండకూడదని, అనాథ అనే సమస్యకు పరిష్కారం చూపుతూ సందేశాత్మకంగా ఈ చిత్రాన్ని రూపొందించాం. సినిమాలో మంచి వినోదంతోపాటు ఆలోచింపచేసే అంశాలుంటాయి. హీరోగా పరిచయమవుతున్న సాత్విక్‌కు మంచి భవిష్యత్ ఉంది. దర్శకుడు ప్రభాస్ సినిమాను అందంగా తీర్చిదిద్దారు. చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది. నచ్చలేదన్న వారికి డబ్బులు తిరిగి ఇస్తాం. సినిమా వల్ల నష్టం వస్తే నేను భరిస్తా, లాభాలను అనాథ శరణాలయాలకు అందజేస్తాను' అని అన్నారు. 'మా తల్లిదండ్రులు నాకు జన్మనిస్తే, దర్శకుడిగా నాకు జన్మనిచ్చిన వ్యక్తి మహేష్ ఖన్నా. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటా. ఇది నలుగురు అనాథ యువకుల కథ. ఈ నలుగురు సమాజంలో అనాథలు లేకుండా చేయడం కోసం ఏం చేశారు?, అందుకు వారు చూపించిన పరిష్కారమేంటనేది సినిమా. నేను అనుకున్న దాన్ని తెరపై తీసుకొచ్చేందుకు కెమెరామెన్ అడుసుమిల్లి విజయ్ ఎంతో సపోర్ట్ చేశారు. నేనే సంగీతం అందించాను. త్వరలోనే పాటలను విడుదల చేస్తాం' అని దర్శకుడు ప్రభాస్ తెలిపారు. 'ఇదొక సందేశాత్మక యాక్షన్ థ్రిల్లర్ చిత్రం. ఇందులో హీరోహీరోయిన్లుగా నటించే ఛాన్స్ ఇచ్చిన దర్శక,నిర్మాతలకు ధన్యవాదాలు' అని సాత్విక్ ఈశ్వర్, అక్షిత చెప్పారు.


అక్షిత, సాత్విక్ ఈశ్వర్

ఆ విషయంలో మన ఫిల్మ్‌మేకర్స్ మారాలి..


మంజుల

'నేను దర్శకత్వం వహిస్తున్నానంటే నాన్నగారు(కృష్ణ) థ్రిల్ ఫీలయ్యారు. మహేష్ అయితే అస్సలు నమ్మలేదు. నీకేమైన పిచ్చెక్కిందా అని అన్నాడు. ఆ తర్వాత ట్రైలర్ చూసి బాగా ఇంప్రెస్ అయ్యాడు' అని అంటోంది ఘట్టమనేని మంజుల. 'షో' చిత్రం ద్వారా నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న మంజుల దర్శకురాలిగా మారి 'మనసుకు నచ్చింది' చిత్రాన్ని తెరకెక్కించారు. సందీప్‌కిషన్, అమైరా దస్తూర్ జంటగా నటించారు. ఈ నెల 16న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా మంజుల సోమవారం మీడియాతో మాట్లాడుతూ, 'దర్శకురాలిగా ఏదో ఒక సినిమా తీయాలని కాకుండా, నా హార్ట్‌లో ఉన్న భావాన్ని కథగా చెప్పాలని, సినిమా ద్వారా ప్రేక్షకుడి మనసుకు నచ్చేలా, మనసు పెట్టి సినిమా తీయాలనుకుని ఈ చిత్ర కథ రాసుకున్నా. ఇంగ్లీష్‌లో రాసుకున్న డైలాగ్స్‌ను సాయి మాధవ్ బుర్రా తెలుగులో అద్భుతంగా రాశారు. ఫ్రెష్ కంటెంట్ ఉన్న న్యూ ఏజ్ ఫిల్మ్ ఇది. వినోదంతో కూడిన మంచి ప్రేమ కథ ఇది. జీవితంలో మనం చిన్న చిన్న అనుభూతుల్ని ఎలా కోల్పోతున్నాం, వాటిని ఎలా ఆస్వాదించాలి. ప్రకృతితో ఎలా మమేకం కావాలనేది చెప్పబోతున్నాం. సినిమాలో ప్రకృతి కీలక పాత్ర పోషిస్తుంది. నేచరే హీరో. నా లైఫ్‌లోని చిన్న చిన్న మూమెంట్స్, మహేష్ మాతో వ్యవహరించే తీరు వంటి క్యూట్ ఎలిమెంట్స్ ఇందులో హీరో పాత్రలో ప్రతిబింబిస్తాయి. మహేష్ మేనరిజం కనిపించేలా ఆ పాత్రను తయారు చేశా. సెన్సిబుల్ కమర్షియల్ చిత్రమిది. మహేష్ ట్రైలర్ చూసి బాగా ఇంప్రెస్ అయ్యారు. వాయిస్ ఓవర్ కూడా ఇచ్చాడు. ఈ సినిమా చూశాక ప్రతి ఒక్కరూ నేచర్‌ను ఆస్వాదిస్తారు. నేను నటిగా వెండితెరపై కనిపించినప్పటికీ నా ఫస్ట్ లవ్ డైరెక్షన్. నాన్నగారు నటించిన 'తెలుగు వీర లేవరా' సినిమాకు పనిచేశాను. దీంతో డైరెక్షన్‌లో అవగాహన ఉంది. పైగా సీనియర్ టెక్నీషియన్లు నాకెంతో సపోర్ట్ చేశారు. ఇటీవల కొత్త కథలు వస్తున్నాయి. ఒరిజినల్‌గా మంచి కంటెంట్ ఉన్న సినిమాలను ఆడియెన్స్ ఆదరిస్తున్నారు. ఏదో ఒకటి తీద్దామని, ఇలా.. అలా తీయకూడదనుకుంటే కష్టం. ఈ విషయంలో మన ఫిల్మ్ మేకర్స్ మారాలి. పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి వెళ్లేందుకు ఉపయోగపడే ఐడియా ఒకటి నా దగ్గరుంది. ఆ సినిమా చేసి రాజకీయాల్లోకి వెళితే చాలా ఉపయోగం ఉంటుంది. ఇక మహేష్‌తో సినిమా చేయాలనేది నా డ్రీమ్. అంతర్జాతీయ నటనా నైపుణ్యం ఉన్న మహేష్‌తో సినిమా అంటే ఇమేజ్‌కు తగ్గట్టుగా ఉండాలి. ఈ సినిమా చూశాక 'మంజు మనం సినిమా చేద్దామంటాడేమో చూడాలి (నవ్వుతూ)' అని అన్నారు.

తెలుగులో గోదా రీమేక్..


సంతోష్ కొంకా, రాజీవ్ కె.రామ

గతేడాది విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన చిత్రం మలయాళ చిత్రం 'గోదా'. టవినో థామస్, వామికా గబ్బి, రచయిత రెంజీ పనికర్ ప్రధాన పాత్రధారులుగా స్పోర్ట్స్ కామెడీ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రాన్ని బసిల్ జోసఫ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్ర తెలుగు అనువాద, రీమేక్ రైట్స్‌ను కొంకా ప్రొడక్షన్స్ సంస్థ దక్కించుకుంది. 'ఈ చిత్రం మాలీవుడ్‌లో ఘనవిజయం సాధించింది. అలాగే బాలీవుడ్‌లో ఓ పెద్ద నిర్మాణ సంస్థ రీమేక్ చేసేందుకు సన్నాహాలు చేయటం విశేషం. తెలుగు రైట్స్ కోసం ఎంతో మంది పోటీ పడినప్పటికీ నిర్మాత సంతోష్ కొంకా ఫ్యాన్సీ ఆఫర్‌తో ఈ చిత్ర రైట్స్‌ను సొంతం చేసుకున్నారు. తెలుగు రీమేక్‌కు సంబంధించి ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. తెలుగులో నటించే ఆర్టిస్టులు, టెక్నీషియన్ల వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం' అని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజీవ్ కె.రామ తెలిపారు.

భిక్షాటన బియ్యం.. అధికారుల స్వాధీనం

అక్రమంగా బియ్యం తరలిస్తున్నారంటూ అన్యంపుణ్యం ఎరుగని అభాగ్యులపై అధికారులు అకారణంగా కేసు నమోదు చేశారు. గంగిరెద్దుల ద్వారా చేసిన భిక్షాటనతో వచ్చిన బియ్యమని కూడా గమనించకుండా అత్యుత్సాహానికి పాల్పడ్డారు. బియ్యం ఎక్కడి నుంచి సేకరించారో కనీస విచారణ జరిపించకుండా కటకటాల్లోకి నెట్టారు. బాధితులు కాళ్లావేళ్లా పడ్డ కనికరించని పౌరసరఫరాలు, పోలీసులు సంయుక్తంగా చేసిన ఘటనపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. కేసు మేము చేయలేదు..వాళ్లు చేశారని ఒకరంటే కాదు.. కాదు వాళ్లే చేశారంటూ ఇరు శాఖల అధికారులు ఒకరిపై ఒకరు చెప్పకోవడం గమనార్హం. ఏది ఏమైనా రెండు నెలలుగా భిక్షాటన చేసిన బియ్యం దూరమై... చేయని తప్పునకు కేసుతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. వివరాలు ఇలా...

● అక్రమంగా విక్రయిస్తున్నారంటూ గంగిరెద్దులోళ్లపై కేసు ● లబోదిబోమంటున్న బాధితులు ● సివిల్ సప్లైస్, పోలీసుల తీరుపై విమర్శలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత నెల కరీంనగర్ జిల్లాకు చెందిన 30 కుటుంబాలు జీవనోపాధి కోసం హైదరాబాద్ వచ్చాయి. జామియా ఉస్మానియా పరిధిలో నివసిస్తూ జీవనం సాగిస్తున్నారు. కులవృత్తిలో భాగంగా గంగిరెద్దుల ద్వారా భిక్షాటన చేసి వచ్చిన ధాన్యంతో పొట్ట నింపుకుంటున్నారు. సంక్రాంతి నేపథ్యంలో భారీగా ధాన్యం సేకరించారు. నిత్యావసర ధరలు చుక్కలనంటుతున్న తరుణంలో భిక్షాటనలో ఎక్కువ మొత్తంలో వారికి రేషన్ బియ్యమే లభించాయి. ఇదే శాపమవుతుందని వారు ఊహించలేదు. రెండు నెలలపాటు దాదాపు 15 క్వింటాళ్ళ వరకు సేకరించిన బియ్యంతో ఈ నెల 11న రెండు వాహనాల్లో స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. వెళ్తూవెళ్తూ దారి మధ్యలో వేముల జాతరకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఖర్చులకు సరిపడేంత డబ్బు లేకపోవడంతో కొంత మొత్తంలో బియ్యాన్ని విక్రయించాలని నిశ్చయించారు. ఇందులో భాగంగా మేడ్చల్ జిల్లా కీసర మండలం బండ్లగూడ వద్ద గల రైస్‌మిల్లు సమీపంలో తెల్లవారురఝామున వాహనాలను నిలిపారు. రైల్‌మిల్లు గేటు తట్టడంతో కొంతమంది బయటకు వచ్చి ఏం కావాలని అడిగారు. గంగిరెద్దులోళ్లమని.. బియ్యం అమ్మడానికి వచ్చామని బాధితులు చెప్పడంతో.. 'తాము అధికారులమని.. మీరు బియ్యాన్ని అక్రమంగా విక్రయించడానికి వచ్చారంటూ 30 కుటుంబాలకు చెందిన బాధితులను అదుపులోకి తీసుకున్నారు. కీసర పోలీసుస్టేషన్‌లో రెండు రోజులపాటు ఉంచి చిత్రహింసలకు గురిచేశారు. అనంతరం మరో వాహనంలో ఉన్న వారందరినీ వదిలేసి బియ్యం ఉన్న వాహనం డ్రైవర్, క్లీనర్, ఆ కుటుంబాల పెద్ద అయిన గంటకోటయ్యపై కేసు నమోదు చేశారు. అయితే, తమవారిపై అక్రమంగా కేసు నమోదు చేశారని బాధితులు బత్తుల సమ్మయ్య, బత్తుల బుజ్జమ్మ, గంట రాజయ్య, గంట సర్వవ్వ, గంట లక్ష్మీ, గంట భూమిక, గంట మమత 'నవతెలంగాణ'కు తెలిపారు. జరిగిన విషయాన్ని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ దృష్టికి తీసుకెళితే సంబంధిత అధికారులతో చర్చించారని అన్నారు. ఇంకోసారి భిక్షాటన చేసిన ధాన్యాన్ని అమ్మవద్దని.. ప్రస్తుతానికి అరగంటలో వదిలేస్తామని చెప్పారన్నారు. అయితే, తమవారిని ఎంతకు వదలకపోవడంతో కమిషనర్‌ను మళ్లీ సంప్రదిస్తే అంతకుముందే కేసు నమోదైందని చెప్పడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు.

వేరే వారి కోసం మాటువేసి...

ఇలా ఉండగా, కీసరలో అక్రమంగా బియ్యం తరలిస్తున్నారంటూ సివిల్ సప్లైస్ ఎస్ఓటీ అధికారులు, పోలీసులకు అర్ధరాత్రి సమాచారం అందింది. రైస్‌మిల్లులో మాటు వేశారు. అదేసమయంలో బియ్యంలోడుతో వస్తున్న వాహనం డ్రైవర్ అధికారులను గుర్తించాడు. దీంతో వాహనాన్ని వదిలి పారిపోయాడు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు.. ఇంకా ఏమైనా అక్రమ రవాణా వాహనాలు దొరుకుతాయా అంటూ అక్కడే తెల్లవారుఝాము వరకు కాపుకాశారు. దురదృష్టవశాత్తు ఆ సమయంలో గంగిరెద్దుల బాధితులు రావడంతో అదుపులోకి వాహనాలు చేసుకున్నారు. వస్తున్న ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకోగా.. బాధితులు దొరకలేదు. మరికొన్ని వాహనాల కోసం ఎదురు చూస్తుండగా అదే సమయంలో గంగిరెద్దుల బాధితులు రావడంతో అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

అరెస్టు చేయడం దుర్మార్గం

సాంప్రదాయమైన కులవృత్తి చేస్తే పోలీసుల దాడి చేస్తున్నారు. భిక్షాటన చేసిన బియ్యాన్ని ఇంటికి తీసుకెళుంటే అరెస్టు చేయడం దుర్మార్గం. సంచార కులాలపై కక్షగట్టి అమాయకులను నేరస్తులుగా చిత్రీకరిస్తున్నారు. నేడు గంగిరెద్దులు, మొన్న బుడబుక్కలు, పెద్దమ్మల, మందుల కులస్తులు, పాములవాళ్లపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారు. ఇంత జరుగుతున్న బీసీ సంక్షేమశాఖ, బీసీ కమిషన్ స్పందించకపోవడం దారుణం. అత్యంత వెనుకబడ్డ కులాలపై దాడులు జరుగుతున్న బాధాకరమం. ప్రభుత్వం పట్టించుకోకపోతే ఉద్యమం చేసి హక్కులను కాపాడుకుంటాం.

- ఆశయ్య. ఎంబీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

గురుకులాల్లో లెక్చరర్ల ప్రధాన పరీక్ష వాయిదా

హైదరాబాద్: గురుకుల కళాశాలల ఉద్యోగాల నియామక ప్రక్రియలో గందరగోళం నెలకొంది. ప్రధాన రాత పరీక్షకు ఎంపికైన అభ్యర్థుల జాబితాలో పొరపాట్లు జరిగినట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గుర్తించింది. టీజీపీ ఇచ్చిన అభ్యర్థుల బయోడేటాలో తప్పులు దొర్లాయని తెలిపిన టీఎస్‌పీఎస్సీ.. ఈ నెల 19 నుంచి జరగాల్సిన ప్రధాన రాతపరీక్షలను వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. గురుకుల విద్యా సొసైటీల్లోని జూనియర్, డిగ్రీ లెక్చరర్లు, ప్రిన్సిపాళ్లు, లైబ్రేరియన్ల నియామకం కోసం సెప్టెంబరు 10న ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించింది. ప్రధాన రాత పరీక్ష కోసం ఒక్కో పోస్టుకు 15 మంది చొప్పున అభ్యర్థులను ఎంపిక చేసింది. ఈ నెల 19 నుంచి 24 వరకు ప్రధాన రాత పరీక్షలు నిర్వహించనున్నట్టు ప్రకటించింది. అయితే జాబితాలో తప్పులు దొర్లినట్టు టీఎస్‌పీఎస్సీ ఆలస్యంగా గుర్తించింది. కేంద్ర సుపరిపాలన కేంద్రం సీజీజీ సమర్పించిన అభ్యర్థుల వ్యక్తిగత వివరాల్లో పొరపాట్లు దొర్లినట్టు పేర్కొంది. జాబితాను పునపరిశీలిస్తామని టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. ఈ నెల 19 నుంచి జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసినట్టు ప్రకటించిన కమిషన్... పరీక్షల తేదీని తర్వాత ఖరారు చేస్తామని పేర్కొంది.

'భూ కబ్జా'పై కదిలిన ప్రభుత్వం

● వారం రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని పెద్దపల్లి కలెక్టర్‌కు ఆదేశం

నవతెలంగాణ-పెద్దపల్లి ప్రతినిధి

పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం కునారం గ్రామంలో నిజాం సర్కారు భూముల కబ్జా భాగోతంపై ప్రభుత్వం స్పందించింది. 'భూ కబ్జా' శీర్షికతో సోమవారం నవతెలంగాణ ప్రధాన సంచికలో కథనం ప్రచూరితమైన విషయం తెలిసిందే. భూముల ఆక్రమణపై వెంటనే విచారణ జరిపి వారం రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదిక పంపించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీదేవసేనకు ఆదేశాలు జారీ చేసినట్టు రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ శాఖ కార్యదర్శి కేవీ జాన్‌వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా అధికార యంత్రాంగం ఆ దిశగా చర్యలు మొదలుపెట్టింది.

తెలుగు సాహిత్యానికి అత్యున్నత ప్రమాణాలు

● సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న అనంతరం దేవిప్రియ

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో



తెలుగు సాహిత్యానికి అత్యున్నత ప్రమాణాలు ఉన్నాయని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహిత దేవిప్రియ చెప్పారు. సోమవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ నూతన అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్ మీదుగా 'గాలిరంగు' ఉత్తమ కవితా సంపుటికి దక్కిన అవార్డును దేవిప్రియం సోమవారం అందుకున్నారు. తెలుగు సాహిత్యానికి, కవిత్వానికి నాణ్యత, ఉన్నత ప్రమాణాలున్నాయని చెప్పారు. అయితే తెలుగు సాహిత్యం ఇతర భాషల్లోకి అనువాదం కాకపోవడం పెద్దలోపమని అభిప్రాయపడ్డారు. కాగా 'గాలిరంగు'కు సాహిత్య అకాడమీ అవార్డు వరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు తన గౌరవాన్ని పెంచిందన్నారు. ఉర్దులో చిన్న కథల విభాగంలో మొహమ్మద్ బేగ్ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన రచించిన దు:ఖమకు చిన్నకథల విభాగంలో పురస్కారం దక్కింది. అవార్డు గ్రహీతలకు జ్ఞాపికతో పాటు లక్ష నగదు ప్రదానం చేశారు.

ఎన్నికల తర్వాత కరెంట్ 'చార్జీల' బాదుడు!

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సాధారణ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజలపై ఒక్కసారిగా విద్యుత్ చార్జీల పెనుభారం పడే ప్రమాదముందని విద్యుత్ రంగ నిపుణులు, పారిశ్రామిక, రైతు, వినియోగదారుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. వ్యవసాయానికి 24గంటల విద్యుత్ కావాలని ఎవరు అడిగారని నిలదీశారు. అసలు ఈ నిర్ణయం వెనుక ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. దీనివల్ల రైతాంగానికి లాభం కంటే నష్టమే ఎక్కువని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంలు) ఆదాయలోటును ఎలా భర్తీ చేస్తారని అడిగారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన 'ఉదయ్' స్కీంలో చేరితే అప్పులు మాఫీ అయ్యాయని చెప్పి, ఇప్పుడు రూ.9970.98 కోట్ల ఆదాయ లోటు ఉందని డిస్కంలు ఎలా ప్రకటిస్తాయని నిలదీశారు. ఈ లోటును పూడ్చుకోవడానికి డిస్కంలు ఎన్నికల తర్వాత 'ట్రూ అప్' పేరుతో చార్జీలు పెంచుకోవడానికి ప్రయత్నిస్తే ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(టీఎస్ఈఆర్సీ)కి విజ్ఞప్తి చేశారు. గత రెండేండ్లుగా డిస్కంలు కావాలనే రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపును ప్రతిపాదించలేదని, దీని వెనుక రాజకీయ కారణాలు లేకపోలేదని విమర్శనాస్త్రాలు సంధించారు ప్రభుత్వ నిర్వాకం వల్లే రూ.9,970.98 కోట్ల భారీ ఆదాయలోటు ఏర్పడిందనే వాస్తవాన్ని డిస్కంలు ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. డిస్కంలు ప్రతిపాదించిన 2018-19 ఆర్థిక సంవత్సర ఆదాయ అవసరాల(ఏఆర్ఆర్) ప్రతిపాదనలపై సోమవారంనాడిక్కడి ఫ్యాప్సీ ఆడిటోరియంలో తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీఎస్ఈఆర్సీ) బహిరంగ విచారణ నిర్వహించింది. టీఎస్ఈఆర్సీ చైర్మెన్ ఇస్మాయిల్ అలీఖాన్, సభ్యులు (ఫైనాన్స్) హెచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ విచారణ జరిగింది. డిస్కంల ప్రతిపాదనలపై వివిధ రంగాల ప్రతినిధులు తమ అభ్యంతరాలు, సలహాలు, సూచలను తెలియజేశారు. ప్రభుత్వం మాత్రం డిస్కంల ఆదాయలోటును ఏ మేరకు భరిస్తామనే విషయాన్ని మాత్రం ప్రస్తావించలేదు. అవసరమైన ఆర్థిక చేయూత అందిస్తామని మాత్రమే బహిరంగ విచారణలో ఇంధనశాఖ అధికారులు ప్రకటన చేశారు.

అదనపు కొనుగోళ్లు ఎందుకు : ఎమ్ వేణుగోపాలరావు

రాష్ట్రంలో పెద్ద మొత్తంలో మిగులు విద్యుత్ ఉందంటూనే, అదనంగా ప్రయివేటు విద్యుత్ కొనుగోళ్లు చేయాల్సిన అవసరమెందుకు వస్తోందని సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్, సీనియర్ జర్నలిస్టు ఎం.వేణుగోపాల్ రావు ప్రశ్నించారు. వేల కోట్ల రూపాయలకు సంబంధించిన ఈ వ్యవహారంపై డిస్కంలు వివరణ ఇవ్వాలని కోరారు. జెన్‌కోలో విద్యుదుత్పత్తి సామర్థ్యం(పీఎల్ఎఫ్) 70 శాతానికి తగ్గిందని, ప్రయివేటు విద్యుత్ కొనుగోళ్ల కోసమే జెన్‌కోలో ఉత్పత్తి తగ్గిస్తున్నారని ఆరోపించారు. దేశంలోనే అత్యధికంగా 2,300 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి చేస్తున్నామని ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేసుకోవడం వెనక చీకటి కోణాలున్నాయని..అధికారంలో ఉన్న వారికి, ప్రయివేటు డెవలపర్లకు దోచి పెట్టడానికే 25 ఏండ్ల పాటు మనుగడలో ఉండేలా దీర్ఘకాల ఒప్పందాలు చేసుకున్నారని విమర్శించారు. రూ.2.50-రూ.3లకే యూనిట్ సౌర విద్యుత్‌ను విక్రయించేందుకు డెవలపర్లు ముందుకు వస్తున్నారని చెప్పారు. దీనికి భిన్నంగా రాష్ట్రంలో తొందరపడి యూనిట్ విద్యుత్ ధర రూ.6 నుంచి రూ.6.50కు కొనుగోలు చేసేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారని మండిపడ్డారు. ఈ సొమ్మంతా ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో అందరికీ తెలిసిందేనని విమర్శించారు. ఈ ఒప్పందాల వల్ల తెలంగాణ ప్రజలు 25 ఏండ్లపాటు దోపిడీకి గురౌతారని చెప్పారు. ఎన్నికల తర్వాత ట్రూ అప్ పేరుతో విద్యుత్ చార్జీలు పెంచుకుని ఆదాయ లోటును పూడ్చుకోవడానికి డిస్కంలు చేసే ప్రయత్నాలకు అనుమతించొద్దని ఆయన టీఎస్ఈఆర్సీకి విజ్ఞప్తి చేశారు. ఉదయ్ స్కీంలో చేరాక రూ.8,850 కోట్ల అప్పులు మాఫీ అయ్యాయని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిందని, ఇంత స్వల్ప వ్యవధిలో డిస్కంలకు రూ.9,970.98 కోట్ల ఆదాయలోటు ఎలా ఏర్పడిందన్నారు. విద్యుత్ సంస్థల్ని ప్రభుత్వం ఏం చేయదలచుకుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కేవలం రాజకీయ కారణాలు, ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే అమలుకు సాధ్యం కాని నిర్ణయాలను బలవంతంగా ప్రజలపై రుద్దుతున్నారని, వ్యవసాయానికి 24గంటల విద్యుత్ సరఫరా కూడా అలాంటిదేనని స్పష్టం చేశారు.

24గంటల సరఫరా ఎవరు అడిగారు?

వ్యవసాయానికి 24గంటల విద్యుత్ కావాలని ప్రభుత్వాన్ని లేదా విద్యుత్ సంస్థల్ని ఎవరు అడిగారని విద్యుత్‌రంగ నిపుణులు దొంతు నర్సింహారెడ్డి ప్రశ్నించారు. ఈ నిర్ణయం వల్ల భూగర్భజలాలు అడుగంటి రైతాంగానికి అపార నష్టం వాటిల్లుతుందన్నారు. అసలు ఈ నిర్ణయం శాఖాపరంగా తీసుకున్నారా... లేక రాజకీయ నిర్ణయమా...ప్రభుత్వ నిర్ణయమైతే ఆ ఖర్చు మొత్తాన్ని వారు భరిస్తామని చెప్పారా...అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఏఆర్ఆర్ల రూపకల్పనే లోపభూయిష్టంగా ఉందని, డిస్కంల నివేదికల్లోని అంకెల మధ్య పొంతనే లేదని, సామాన్యుడికి సైతం అర్థమయ్యేలా తెలుగులో వాటిని ముద్రించాలని సూచించారు.

సర్‌చార్జీల మోత భరించలేం: ఫ్యాప్సీ

క్రాస్ సబ్సిడీ, అదనపు సర్‌చార్జీల పేరుతో డిస్కంలు వేస్తున్న కోట్లాది రూపాయల భారాన్ని పరిశ్రమలు భరించలేకపోతున్నాయని, ఇలా అయితే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం కష్టంగా మారుతుందని తెలంగాణ అండ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్(ఫ్యాప్సీ) ప్రతినిధి టి సుజాత స్పష్టం చేశారు. ఓపెన్ యాక్సెస్ పద్ధతి కింద బహిరంగ మార్కెట్ నుంచి విద్యుత్ కొనుగోళ్లు జరిపే పరిశ్రమలపై యూనిట్‌కు రూ.2.06పైసలు చొప్పున అదనపు సర్‌చార్జీలు విధించాలని డిస్కంలు చేసిన ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. కొత్త విద్యుత్ చట్టం అమల్లోకి రాక ముందు నుంచే ఓపెన్ యాక్సెస్ కొనుగోళ్లు ఉండేవని, ఇప్పుడు కొత్తగా అదనపు సర్‌చార్జీలను విధించడం సరికాదని తేల్చిచెప్పారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల కోసం తక్కువ ఛార్జీలతో ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని సూచించారు.

బయటకొంటే మీకెందుకు ఛార్జీలు చెల్లించాలి-దక్షిణ మధ్య రైల్వే

ఓపెన్ యాక్సెస్ విద్యుత్ కొనుగోళ్లపై అదనపు సర్‌చార్జీలను దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఇంజనీర్ జీవీ మల్లికార్జున రావు తీవ్రంగా వ్యతిరేకించారు. పొరుగు రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణలో విద్యుత్‌చార్జీలు అధికంగా ఉన్నాయని, మెట్రోరైల్‌కు ప్రత్యేక కేటగిరి కింద రాయితీలు ఇస్తూ...అదే సేవల్ని అందిస్తున్న తమ వద్ద నుంచి అత్యధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని చెప్పారు. విద్యుత్ ఛార్జీలు పెంచి...మా అంతట మేం బలవంతంగా ఓపెన్ యాక్సెస్‌కు వెళ్ళేలా పరిస్థితుల్ని కల్పిస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇక్కడి కంటే ఛార్జీలు తక్కువగా ఉన్నాయని, అక్కడ ఓపెన్ యాక్సెస్‌పై ఎలాంటి నియంత్రణ లేదని చెప్పారు.

రైతుల పొలాల్లో బలవంతంగా టవర్లు : ఎం.కోదండ రెడ్డి

పరిహారం చెల్లించకుండానే రైతుల పంట పొలాల్లో బలవంతంగా విద్యుత్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారని కిసాన్ ఖేత్ మజ్దూర్ కాంగ్రెస్ చైర్మెన్ ఎం.కోదండ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పొలాల్లో స్తంభాల ఏర్పాటుకు స్థల పరిహారం చెల్లించాల్సిన అవసరలేదని బ్రిటీష్ పాలకులు తెచ్చిన టెలిగ్రాఫ్ చట్టాన్ని సాకుగా చూపి రైతుల పొలాల్లో భారీ విద్యుత్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. విద్యుత్ చట్టం ప్రకారం బాధితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అయితే దీనిపై తాము రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వం కొత్త విధివిధానాలు ఖరారు చేయాల్సి ఉందని ఈఆర్సీ చైర్మెన్ ఇస్మాయిల్ అలీఖాన్ బదులిచ్చారు. రైతులకు జిల్లా కలెక్టర్లు పరిహారం ఇప్పించకపోతే ఈఆర్సీలో అప్పీల్ చేసుకోవచ్చని సూచించారు.

పెరుగుతున్న మరణాలుః తిమ్మారెడ్డి

రాష్ట్రంలో ఏటేటా విద్యుదాఘాతం మరణాలు పెరిగిపోతున్నాయని పీపుల్స్ మానిటరింగ్ గ్రూప్ ఆన్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ సంస్థ కన్వీనర్ తిమ్మారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది రాష్ట్రంలో 678 మంది, ఈ ఏడాది అర్థభాగంలో 303 మంది మరణించారని పేర్కొన్నారు. డిస్కంల నిర్లక్ష్యంతోనే 50 శాతం విద్యుదాఘాతం మరణాలు సంభవిస్తున్నాయన్నారు. మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ జిల్లాలల్లో అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

అణువణువూ అవినీతేః భారతీయ కిసాన్ సంఘ్

గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మొదలు ఏబీ స్విచ్‌లు, లైన్ల ఏర్పాటు, లూజ్‌లైన్లు సహా అన్నింటా విద్యుత్ సంస్థల్లో అవినీతి వేళ్లూనుకొని పోయిందని భారతీయ కిసాన్ సంఘ్ కార్యకర్తలు పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. పై స్థాయిలో అధికారులు చెప్పేది ఒకటి...క్షేత్రస్థాయిలో మరొకటి జరుగుతోందంటూ పలు ఉదాహరణల్ని ఆధారాలతో సహా కమిషన్‌కు సమర్పించారు.

సర్కారు ఎస్కేప్

విద్యుత్ సంస్థల ఆదాయలోటు భర్తీపై ప్రభుత్వం తప్పించుకొనే ధోరణిలో వ్యవహరించింది. బహిరంగ విచారణలో ప్రభుత్వం తరపున ఇంధనశాఖ డిప్యూటీ కార్యదర్శి శారదాబాయి ప్రకటన చదివి వినిపించారు. ఎక్కడా ప్రభుత్వం ఎంత సబ్సిడీని ఇస్తుందనే అంశాన్ని పేర్కొనలేదు. ప్రభుత్వ అమలు చేస్తున్న కార్యక్రమాల్ని ఏకరువు పెట్టి, డిస్కంలకు అవసరమైన ఆర్థిక చేయూతను ఇస్తామని ముగించారు. దీనిపై కమిషన్ కూడా ఎలాంటి అభ్యంతరం చెప్పకపోవడం గమనార్హం. అయితే తర్వాత జరిగే ఉత్తర, ప్రత్యుత్తరాల్లో సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం వెల్లడిస్తుందని చైర్మెన్ ఇస్మాయిల్ అలీఖాన్ తెలిపారు. అనంతరం టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జి రఘుమారెడ్డి పై అభ్యంతరాలపై వివరణ ఇచ్చారు.

జీఎస్టీ ఫ్రెండ్లీ పన్నుకాదు

(మొదటిపేజీ తరువాయి)

విధించడాన్ని సవాలు చేస్తూ ఆ సంస్థ బాంబే హైకోర్టులో పిటిషన్ వేసింది. ట్యాక్స్ రిటర్నులు స్వీయఅంచనా ఆధారంగా ఉండాలని, కానీ జీఎస్టీ నిబంధనలు పన్ను చెల్లింపులను కఠినతరంగా మార్చాయని వాదించింది. ఈ కేసుతో పాటు ధర్మాసనం దృష్టికి వచ్చిన జీఎస్టీ కేసులన్నింటిపై హైకోర్టు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. జీఎస్టీ అమలును వేడుకగా మార్చడం, దానికోసం ప్రత్యేకంగా పార్లమెంట్‌ను సమావేశపర్చడంలో ఎలాంటి ప్రత్యేకత లేదని తేల్చిచెప్పింది.

కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కోని జీఎస్టీ పన్ను విధానాన్ని సరళీకరించాలని సూచించింది. వెబ్‌సైట్లు, పోర్టర్లను ఏర్పాటు చేసినా...అవి చేరాల్సిన వారికి చేరేలా లేవని వ్యాఖ్యానించింది. పన్ను చెల్లింపు విధానం క్లిష్టతరంగా ఉంటే దాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోలేరని పేర్కొంది. ఈ మేరకు జీఎస్టీలో మార్పులు చేయాలని సూచిస్తూ, ఈనెల 16వ తేదీ లోపు పై కేసులన్నింటిలో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించింది. జీఎస్టీలో సంబరాలు చేసుకొనేంత గొప్ప విషయాలు ఏమీ లేవని వ్యాఖ్యానించింది.

డాక్టర్ల కొరత

(మొదటిపేజీ తరువాయి)

80 శాతమని, అంటే 8 లక్షల 33 వేలమంది అని ఆయన తెలిపారు. ఈ లెక్కన దేశ జనాభాలోని 1597మందికి ఒక్క డాక్టర్ చొప్పున అందుబాటులో ఉన్నట్టు అంచనా. కాగా,ప్రతి వెయ్యిమందికి కనీసం ఒక డాక్టర్ ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) సూచించింది. డబ్ల్యూహెచ్‌వో ప్రామాణికాన్ని పాటించాలంటే దేశానికి 4,97,189మంది డాక్టర్లు అవసరం. ప్రతిఏటా సుమారు 67,532మంది విద్యార్థులు కొత్తగా వైద్య విద్యా కోర్సు ఎంబీబీఎస్‌లో చేరుతున్నారు. ఈ ఏడాది ఈ సంఖ్య పెరిగే అవకాశమున్నట్టు తెలుస్తోంది. పట్టణాల్లోని పేదలు, గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా ఆధారపడేది ప్రభుత్వ వైద్య సేవలపైనే. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల్లో డాక్టర్ పోస్టుల ఖాళీలపై ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు మంత్రి చౌబే సమాధానమిచ్చారు. మొత్తం 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 33కు సంబంధించి వివరాలు అందుబాటులో ఉన్నట్టు ఆయన తెలిపారు. ఈ 33 రాష్ట్రాల్లో(ప్రాంతాల్లో) 33,968 అలోపతి డాక్టర్ల పోస్టులు మంజూరు కాగా, 8,286 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు మంత్రి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ప్రాథమిక వైద్య కేంద్రాల్లో(పీహెచ్‌సీ) కేవలం ఒక్క డాక్టర్‌ను మాత్రమే నియమిస్తున్నారు. కొన్ని గ్రామీణ సముదాయాలకు కలిపి ఓ సామాజిక వైద్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ)ని ఏర్పాటు చేస్తున్నారు. సీహెచ్‌సీల్లో సర్జన్లు, కంటి వైద్యులు, గైనకాలజిస్టులు,చిన్న పిల్లల వైద్యులువంటి ప్రత్యేక నైపుణ్యత ఉండే డాక్టర్లను నియమించాల్సి ఉంటుంది. 2017, మార్చి 31నాటికి 22,496 మంది ప్రత్యేక వైద్యులు అవసరం కాగా, 4,156మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. పీహెచ్‌సీ,సీహెచ్‌సీలకు 77,956 నర్సింగ్ సిబ్బంది పోస్టులు మంజూరు కాగా, 11,288 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం ఒక్కో పీహెచ్‌సీకి ఒక నర్సు, ఒక్కో సీహెచ్‌సీకి ఏడుగురు నర్సుల చొప్పున సిబ్బందిని నియమిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో పని చేయడానికి డాక్టర్లు ఇష్టపడకపోవమే పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో ఖాళీలు పేరుకుపోవడానికి ఓ ప్రధాన కారణమని చెబుతున్నారు.

విదేశాలకు వలస వెళ్తున్న వైద్య నిపుణులు

ప్రతిభావంతులైన వైద్య విద్యార్థులు,నిపుణులైన వైద్యుల్లో కొందరు విదేశాల్లో ఉన్నత విద్య, ప్రాక్టీస్ కోసం వలస వెళ్లడం కూడా దేశంలో వైద్యుల కొరతకు కారణమని భావిస్తున్నారు. విదేశాలకు వెళ్లిన డాక్టర్ల సంఖ్యపై వివరాలు అందుబాటులో లేవని మంత్రి చౌబే తెలిపారు. అయితే, భారత వైద్యమండలి(ఎంసీఐ) ప్రతిఏటా విదేశాలకు వెళ్లే వైద్యులకు గుడ్ స్టాండింగ్ సర్టిఫికెట్ పేరుతో అర్హతా పత్రాలను ఇస్తున్నట్టు మంత్రి తెలిపారు. 2015లో 2984మందికి, 2016లో 2802మందికి,2017లో 1497మందికి ఈ సర్టిఫికెట్లు మంజూరు చేసినట్టు ఆరోగ్య,కుటుంబశాఖ తెలిపింది. గత మూడేండ్లలో 5,129మంది డాక్టర్లు విదేశాల్లో ప్రాక్టీస్ కోసం వెళ్లినట్టు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యుల కొరత వల్ల ఆ ప్రాంతాల్లోని పేదలు నాటు వైద్యం, అర్హతలేని ప్రయివేట్ వైద్యులపై ఆధారపడాల్సి వస్తోంది. గ్రామీణ,మారుమూల ప్రాంతాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందించడంలోనూ ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రజా ఆరోగ్యం పట్ల గత ప్రభుత్వాలతోపాటు ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కూడా ఆసక్తి చూపకపోవడమే గ్రామీణ ప్రాంతాల్లో ఈ దుస్థితికి కారణమని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శిగా మధు

(మొదటిపేజీ తరువాయి)

దడాల సుబ్బారావు, ఎం.కష్ణమూర్తి, సిహెచ్.బాబూరావు వి ఉమామహేశ్వరరావు, డి రమాదేవి, మంతెన సీతారాం, కె.ప్రభాకరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రాష్ట్ర కమిటీ సభ్యులు

బితులసీదాస్, వై సిద్దయ్య, వి వెంకటేశ్వర్లు, పి జమలయ్య, మిరియం వెంకటేశ్వర్లు, జె జయరాం, ఎవి నాగేశ్వరరావు, కె స్వరూపరాణి, కె ధనలక్ష్మి, వి సుబ్రమణ్యం, అంద్ర మాల్యాద్రి, పి మురళీ కృష్ణ, జి ఓబులు, కె సుబ్బరావమ్మ, యం సూర్యారావు, యం రామకృష్ణ, బాబు, కె గడ్డెన్న, యం బాలకాశి, పి పెద్దిరెడ్డి, బి ప్రభావతి, వై అచ్యుతరావు బి కృష్ణమూర్తి(శ్రీకాకుళం) రెడ్డి శ్రీరామ్మూర్తి(పార్వతీపురం), బి.గంగారావు(విశాఖ అర్బన్) కె లోకనాధం(విశాఖ రూరల్), కిల్లో సురేంద్ర(విశాఖ రూరల్) టి అరుణ్(రాజమండ్రి) బి బలరాం(పశ్చిమగోదావరి డెల్టా) జెఎన్‌వి గోపాలన్(పశ్చిమగోదావరి డెల్టా) చింతకాయల బాబూరావు(పశ్చిమగోదావరి అప్‌ల్యాండ్), డివి కృష్ణ(కృష్ణా పశ్చిమ), కె శ్రీదేవి(కృష్ణా పశ్చిమ), ఆర్ రఘు(కృష్ణా తూర్పు), పి.రామారావు(గుంటూరు తూర్పు), గద్దె చలమయ్య(గుంటూరు పశ్చిమ), పూనాటి ఆంజేయులు(ప్రకాశం తూర్పు) సయ్యద్ హనీఫ్(ప్రకాశం పశ్చిమ) సిహెచ్ రాజగోపాల్(నెల్లూరు) ఎన్ యాదగిరి(నెల్లూరు) వి రాంభూపాల్(అనంతపురం ఉత్తరం) కె ఆంజనేయులు(కడప) పి.నిర్మల (కర్నూలు), టి రమేష్ కుమార్(నంధ్యాల), కోఆప్షన్ (తిరుపతి).

ఆహ్వానితులు

జె ప్రభాకర్, కెఎస్ లక్ష్మణరావు, జాల అంజయ్య, కె ఉమామహేశ్వరరావు, బి నారాయణ, కుంజా సీతారామయ్య, టి సూర్యనారాయణ, గౌస్ దేశాయ్, డి కాశీనాథ్, యం ఇంతియాజ్

ప్రత్యేక ఆహ్వానితులు

ఆర్.సత్యనారాయణరాజు, చౌదరి తేజేశ్వరరావు, జక్కా వెంకయ్య, టి.నరసింహయ్య, పాటూరు రామయ్య

కంట్రోల్ కమిషన్

ఛైర్మన్‌గా బి.ఆర్.తులసీరావు ఎన్నికయ్యారు. సభ్యులుగా టి.షడ్రక్, చల్లా వెంకటయ్య, సావిత్రి, జి.రాజేశ్వరరావు.

అఖిల భారత మహాసభలకు ప్రతినిధులు

23 మందితో అఖిల భారత మహాసభల ప్రతినధులను ఎన్నుకున్నారు. వీరిలో వై వెంకటేశ్వరరావు, వి కృష్ణయ్య, సిహెచ్ నర్సింగరావు, మిడియం బాబూరావు, ఎంవిఎస్ శర్మ, దడాల సుబ్బారావు, యం కృష్ణమూర్తి, సిహెచ్ బాబూరావు, వి ఉమామహేశ్వరరావు, డి రమాదేవి, కె ప్రభాకర్ రెడ్డి, డివి కృష్ణ, సిహెచ్ రాజగోపాల్, బి బలరాం, కె లోకనాథం, చింతకాయల బాబూరావు, పూనాటి ఆంజనేయులు, వి రాంభూపాల్, టి అరుణ్, పాశం రామారావు, కె స్వరూపరాణి, వి వెంకటేశ్వర్లు, మంతెన సీతారాం ఎన్నికయ్యారు. పరిశీలకులుగా బి ప్రభావతి, రెడ్డి

45 రోజుల్లో ఖర్చుచేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

జరిగింది. అనంతరం జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ చట్టం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం 16.32 శాతం నిధులను బడ్జెట్‌లో దళితుల అభివృద్ధికి కేటాయిస్తున్నామని వివరించారు. నిధులు మురిగిపోకుండా పూర్తిస్థాయిలో ఖర్చు పెట్టేందుకు ప్రణాళికలు రూపొందించామని చెప్పారు. మొత్తం 197 సంక్షేమ పథకాలతోపాటు 219 ఉప సంక్షేమ పథకాలతో దళితుల అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలు సత్ఫలితాలు ఇస్తున్నాయని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ స్టడీసర్కిల్ కేవలం హైదరాబాద్‌లోనే ఉండేదని, ఇప్పుడు ప్రతి జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు. విద్యను పూర్తి చేసుకున్న దళిత విద్యార్థులు ఉద్యోగ పోటీ పరీక్షల కోసం ఇచ్చే శిక్షణనిచ్చే స్టడీసర్కిల్ విస్తరించిన తర్వాతే 100 మందికిపైగా ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని చెప్పారు. దళితుల అభివృద్ధి కోసం ఖర్చు చేసే ప్రతిపైసా పారదర్శకంగా ఉండేలా చూడడంతోపాటు లబ్ధిపొందిన వారి వివరాలను ప్రజాప్రతినిధులందరికీ ఇస్తున్నామని వివరించారు. కేటాయింపులకు మించి ఖర్చు చేసినప్పుడే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశించిన ప్రయోజనం నెరవేరుతుందని చెప్పారు. అదనపు కేటాయింపులతోనైనా దళితుల అభివృద్ధికి తోడ్పడతామని అన్నారు. సంక్షేమ పథకాల నినాదాలను నిజం చేస్తామని చెప్పారు. నిర్ణీత గడువులోపు నిధులు ఖర్చు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. విద్యాశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఆర్థిక ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శి జ్యోతిబుద్ధ ప్రసాద్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి కిషన్, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్‌మోహన్, ఎస్సీ అభివృద్ధి శాఖ సంచాలకులు పి కరుణాకర్, జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్మీకి 6 నెలలు పట్టొచ్చు.. మాకు 3 రోజులు చాలు

(మొదటిపేజీ తరువాయి)

సిద్ధం చేసే సత్తా ఉంది. అదే ఆర్మీకి ఆరు నెలల పడుతుంది. ఇదీ సంఘ్ సత్తా. దేశం అలాంటి పరిస్థితి ఎదురైతే.. ముందుకు సాగేందుకు స్వయం సేవక్ సంఘ్ సిద్ధంగా ఉంది. మా సైన్యాన్ని మూడు రోజుల్లో పంపించగలం' అన్నారు. 'సంఘ్ అనేది సైనిక లేదా పారామిలటరీ సంస్థకాదు. రాజ్యాంగం అందుకు వెసలుబాటు కల్పిస్తే సరికొత్త సైన్యాన్ని తయారు చేసి దేశం కోసం పోరాడేందుకు, అవసరమైతే ప్రాణాలర్పించేందుకు సంఘ్ కుటుంబం (ఆరెస్సెస్ కార్యకర్తలు) ఎప్పుడూ సిద్ధమే' అన్నారు. కాగా, ఆర్మీపై చేసిన ఈ వివాదాస్పద వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జూబ్లీహిల్స్‌లో భారీ పేలుడు

(మొదటిపేజీ తరువాయి)

గాను సైనిక్‌పురికి చెందిన ఆశిష్‌కు గతేడాది మే నెలలో బాధ్యతలు అప్పగించారు. నెలన్నర రోజుల్లో స్థలంలో ఉన్న రాళ్లు పగులగొట్టి అప్పగించాలని అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే ఆశిష్ ఈ పనిని మహేందర్ అనే వ్యక్తికి సబ్‌లీజ్‌కు ఇచ్చాడు. అతను సాయి, మహేష్ అనే వ్యక్తులకు ఈ పని అప్పగించాడు. స్థలంలో రాళ్లు ఎక్కువగా ఉండటంతో జిలెటిన్‌స్టిక్స్‌ను తెప్పించి కాపలాదారుగా ఉన్న ఆశారం గదిలో ఉంచారు. సోమవారం ఉదయం 8.45 ప్రాంతంలో ఆశారం పని మీద బయటకు వెళ్లాడు. ఆయన భార్య భగవతి గదిలో వంట చేస్తోంది. ఈ క్రమంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఆమెకు గాయాలయ్యాయి. వారు ఉంటున్న ఇంటి గోడ పూర్తిగా కూలిపోయింది. పేలుడు ధాటికి రేకులు ఎగిరిపడ్డాయి. శబ్దం ఎక్కువగా రావడంతో చుట్టుపక్కల వారు ఒక్కసారిగా ఉలిక్కి పడి పరుగులు తీశారు. స్థానికులు వెంటనే అక్కడికి వెళ్లి చూడగా భగవతి గాయలతో పడి ఉంది. ఆమెను వెంటనే జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ సంఘటనా పరిశీలించారు. బాంబు డిస్పోజల్ టీంతో పాటు క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను రంగంలోకి దింపి తనిఖీలు నిర్వహించారు. సంఘటనా స్థలం నుంచి సుమారు 98 ఈడీలను స్వాధీనం చేసుకున్నారు. అప్పటికే పేల్చడానికి సిద్ధంగా ఉంచిన మరికొన్ని ఈడీలను నిర్వీర్యం చేసి స్వాధీనం చేసుకున్నారు. 20 నుంచి 25 ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు అభిప్రాయపడుతున్నారు.

సంఘటనపై సీపీ వివిశ్రీనివాసరావు ఆరా తీశారు. వీరితో పాటు వెస్ట్‌జోన్ డీసీపీ వెంకటేశ్వర్‌రావు, బంజారాహిల్స్ డివిజన్ ఏసీపీ కె.ఎస్.రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెన్సెక్స్ ▲295
34,300

నిఫ్టీ ▲85
10,539

డాలరుకు రూపాయి విలువ
64.31



బంగారం(10.గ్రా)
రూ. 30,812



వెండి (కేజీ)
రూ. 40,600



కోడిగుడ్లు

హైదరాబాద్	368	విజయవాడ	374
ఒక్కగుడ్డుకు	4.30	చెన్నై	397
వరంగల్	370	ముంబయి	410



కుంగిన పారిశ్రామికోత్పత్తి ..!



న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన పారిశ్రామికోత్పత్తి సూచీ కుంగింది. గతేడాది డిసెంబర్‌లో ఐఐపీ సూచీ 7.1శాతానికి పడిపోయింది. గత నవంబర్‌లో ఐఐపీ 8.4శాతంగా ఉంది. కాగా 2016 ఇదే నెలలో ఐఐపీ సూచీ 2.4శాతంగా నమోదైందని కేంద్ర గణాంకాల శాఖ (సీఎస్‌వో) సోమవారం వెల్లడించింది. ఇక క్రితం త్రైమాసికంలో తయారీ రంగం 8.4 శాతం వృద్ధిని కనబర్చింది. పారిశ్రామికోత్పత్తిలో 77.63శాతం వాటా కలిగిన తయారీ రంగం ఐఐపీకి కీలక మద్దతునిచ్చింది. 2016 డిసెంబర్‌లో ఈ రంగం కేవలం 0.6శాతం పెరిగింది. క్యాపిటల్ గూడ్స్ 6.2శాతం నుంచి ఏకంగా 16.4శాతానికి ఎగిసింది. కన్స్యూమర్ నాన్-డురెబుల్స్ 0.2శాతం నుంచి 16.5శాతానికి పెరిగింది. ఇక ప్రాథమిక వస్తువులు 3.7శాతం, ఇంటర్మీడియట్ వస్తువులు 6.2శాతం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నిర్మాణ వస్తువులు 6.7శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఇదే సమయంలో కన్స్యూమర్ డురెబుల్స్ 0.9శాతంగా నమోదు అయ్యింది. మొత్తంగా తయారీ రంగంలోని 23 రంగాల్లో 16 సెగ్మెంట్‌లు సానుకూల వృద్ధిని కనబర్చాయి.

తగ్గిన రిటైల్ ద్రవ్యోల్బణ సూచీ..



ఈ ఏడాది జనవరిలో వినియోగదారుల ఆధారిత రిటైల్ ద్రవ్యో ల్బణం (సీపీఐ) కాస్తా తగ్గింది. దీంతో ఈనెలలో రిటైల్ సూచీ 5.07శాతానికి క్షీణించింది. కూర గాయలు, పండ్లు, ఇంధన పరికరాల ధరలు తగ్గడమే ఇందుకు కారణ మని తెలిసింది. గతేడాది డిసెంబర్‌లో ఈ సూచీ 17 నెలల గరిష్టానికి చేరి 5.21శాతంగా నమోదైంది. క్రితం ఏడాది జనవరిలో రిటైల్ సూచీ 3.17శాతంగా ఉంది. సోమవారం ఈ మేరకు సీఎస్‌వో గణాంకాలను విడుదల చేసింది. ఆహర పదార్థాల ధరలు డిసెంబర్‌లో 4.96శాతం నమోదు కాగా, జనవరిలో 4.7శాతానికి దిగివచ్చాయి. పండ్ల ధరలు 6.63శాతం నుంచి 6.24శాతానికి స్వల్పంగా పెరిగాయి. ఇంధన, విద్యుత్ సెగ్మెంట్ 7.90శాతం నుంచి 7.73శాతానికి తగ్గాయి. ఇదిలావుంటే డిసెంబర్ నెల ఐఐపీ, జనవరి నెలకు సంబంధించిన సీపీఐ గణాంకాలు 2017-18 రెండో ముందస్తు జీడీపీ అంచనాలకు ఇవి చాలా కీలకం. ఈ నెల చివరిన జీడీపీ గణాంకాలు వెలువడనున్నాయి.

హైదరాబాద్‌లో ఏయిరో ఇంజిన్ సీవోఈ

సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న జీఈ, టాటా

- ఏయిరో స్పేస్‌లో విస్తరించేందుకు తోడ్పాటు
- డిసెంబరు నాటికి అందుబాటులోకి ప్లాంటు
- తెలంగాణలో అన్ని సౌకర్యాలు కల్పించాం: కేటీఆర్



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: టాటా గ్రూప్, జీఈ ఏవియేషన్ సంస్థలు సంయుక్తగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేయన్ను పపంచశ్రేణి ఏరో ఇంజిన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. విమాన ఇంజిన్లకు అవసరమైన విడిభాగాలతో పాటు అత్యాధునిక విమాన యంత్రాల రూపకల్పన చేపట్టేందుకు గాను.. ఈ రెండు సంస్థలు కలిసి హైదరాబాద్‌లోని ఆదిభట్లలో ఉన్న ఏరోస్పేస్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో టాటా సన్స్‌కు చెందిన ఏరో స్పేస్, డిఫెన్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగాల అధ్యక్షుడు బన్‌మల్ అగర్వాల్, జీఈ సౌత్ ఏషియా అధ్యక్షుడు విశాల్ వాన్‌చూలు పాల్గొన్నారు. ఈ సందర్భం పురస్కరించుకొని హెచ్ఐసీసీలో జీఈ ఏవియేషన్, టాటా గ్రూప్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు, రవాణ శాఖ మంత్రి మహేందర్ రెడ్డితో పాటు ఎంపీ భూర నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ఏరో ఇంజిన్ల తయారీలో టాటా అగ్రస్థానంలో ఉందని.. టాటాకు జీఈ కూడా తోడవడంతో సామర్థ్యం మరింత పెరగనుందన్నారు. ఏరో ఇంజిన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు తెలంగాణను వేదికగా ఎంచుకోవడ ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. రాష్ట్రంలో ఏవియషన్ సంబంధిత పరిశ్రమల ఏర్పాటునకు గాను సర్కారు ఇప్పటికే రెండు ఏయిరో స్పేస్ సెంటర్లను, అయిదు ఎయిరో ట్రస్టయిప్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టుగా తెలిపారు. దేశంలో విమానయాన పరిశ్రమలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో అందుబాటులోకి వచ్చే అవకాశాలను అందిపుచ్చు కొనేందుకు గాను తెలంగాణ సర్కారు అన్ని ప్రయత్నాలను చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమలకు అవసరమైన నిపుణులైన మానవ వనరులను అందుబాటులో ఉంచేందుకు గాను పలు విద్యాసంస్థలు, కంపెనీల వారితో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకున్నట్టుగా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంస్థల ఉత్సాహం చూస్తుంటే డిసెంబరు నాటికి ఈ కేంద్రం పూర్తిగా అందుబాటులోకి వచ్చి తొలి ఇంజిన్‌ను ఆవిష్కరించే అవకాశాలు కనిపిస్తున్నాయని ఆయన అన్నారు.

లాభాలలో ముగిసిన మార్కెట్లు!



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం చవిచూసిన భారీ నష్టాల నుంచి కొలుకున్నాయి. అంతర్జాతీయ సానుకూల సంకేతాల నేపథ్యంలో తొలి నుంచీ మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ప్రధానంగా విద్యుత్, రియాల్టీ సూచీల మద్దతుతో బీఎస్ఈ సెన్సెక్స్ 294.71 పాయిం ట్లు పెరిగి 34,300.47కు చేరింది. నిఫ్టీ 84.8 పాయింట్లు రాణించి 10,539.75 వద్ద ముగిసింది. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిసెంబర్‌తో ముగిసిన మూడోత్రైమాసికంలో అత్యంత పేలవమైన ఆర్థిక ఫలితాలు నమోదు చేయడంతో పాటు భారీగా మొండి బాకీలు పెరగడంతో ఆ సూచీ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. నిఫ్టీలో ఎస్‌బిఐ సూచీ 3.13 శాతం లేదా రూ.6.30 కోల్పోయి రూ.290.10 వద్ద ముగిసింది. గత త్రైమాసికంలో ఎస్‌బిఐ నికర మొండి బాకీలు 4.24 శాతం నుంచి 5.61 శాతానికి చేరాయి. దీంతో ఈ బ్యాంకు రూ.1886.57 కోట్ల నికర నష్టాలు చవి చూసింది. కాగా గత ఆర్థిక సంవత్సరంలో రూ.20,000 కోట్ల మొండి బాకీలు రద్దు చేసినట్టు రిపోర్టులు రావడం ఈ సూచీని మరింత ఒత్తిడికి గురి చేసింది. బీఎస్ఇలో రంగాల వారిగా విద్యుత్ సూచీ 1.87 శాతం, రియాల్టీ 1.73 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.65 శాతం, మౌలిక వసతులు 1.47 శాతం చొప్పున రాణించి మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి.

'ఎస్సార్' పై యార్సెలార్ కన్ను!

దివాలా సంస్థ కొనుగోలుకు 'బిడ్'

- రేసులో రష్యాకు చెందిన న్యూమెటల్ కూడా..
- అమితాసక్తిలో 'లక్ష్మి మిట్టల్' కంపెనీ



ముంబయి: నిర్వహణపరమైన సమస్యలతో అప్పుల ఊబిలో కూరుకుపోయి దివాలా దశకు చేరుకున్న ఎస్సార్ స్టీల్ సంస్థను చేజిక్కించుకొనేందుకు గాను రెండు బడా కంపెనీలు రంగంలోకి దిగాయి. ప్రపంచ ఉక్కు దిగ్గజం యార్సెలార్ మిట్టల్‌కు చెందిన భారత అనుబంధ సంస్థ 'యార్సెలార్ మిట్టల్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్' (ఏఎంపీఐఎల్)తో పాటుగా రష్యాకు చెందిన వీటీబీ బ్యాంక్, రేవంత్ రూయాలకు చెందిన ఉమ్మడి సంస్థ 'న్యూమెటల్' సంస్థలు ఎస్సార్ స్టీల్ కోసం బిడ్లను దాఖలు చేశాయి. ఎస్సార్ స్టీల్ కొనుగోలుకు గాను ఈ రెండు సంస్థలు దాదాపు రూ.500 కోట్లను అనామతు ఖాతాలో డిపాజిట్ చేస్తూ 'నేషనల్ కంపెనీ లా ట్రైబ్యూనల్' (ఎన్‌సీఎల్‌టీ) నందు ఆసక్తి బిడ్లను దాఖలు చేసినట్టు ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి.

దీంతో ఆర్‌బీఐ ఆధ్వర్యంలోని 12 అతిపెద్ద దివాలా కేసుల్లో మొదటి దానికి పరిష్కారం లభించినట్టయింది. భారతీయ స్టేట్ బ్యాంక్ నేతృత్వంలోని బ్యాంకులకు ఎస్సార్ స్టీల్ సంస్థ దాదాపు రూ.49,000 కోట్ల మేర రుణాలను బాకీ ఉంది. కొత్త అందుబాటు లోకి తెచ్చిన దివాలా చట్టం మేరకు ఈ సంస్థను నిరర్థ ఆస్తుల జాబితాల నుంచి తప్పించి ఉపయోగంలోకి తెచ్చేందుకు గాను ఇతరులకు విక్రయిం చాలని ఎన్‌సీఎల్‌టీ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా దివాలా తీసిన ఉక్కు పరిశ్రమలను కొనుగోలు చేస్తూ యార్సెలార్ మిట్టల్ పేరుమీద అతిపెద్ద ఉక్కు ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకున్న లక్ష్మి మిట్టల్... భారత్‌లో ఉక్కు పరిశ్రమ అభివృద్ధి గురించి తన ఆశావాదాన్ని వ్యక్తం చేశారు.

ఎస్సార్ స్టీల్ కొనుగోలు కోసం తమ సంస్థ దాఖల చేసిన బిడ్‌తో పాటు ఆ సంస్థ నిర్వహణపరంగా ఎదుర్కొన్న సమస్యలు.. ఏయే అంశాలు ఆ సంస్థను దివాలా దిశగా నిడిపించాయన్న విషయాలతో పాటు వాటికి సమగ్ర పరిష్కారాలు, వ్యూహలతో తాము ఎన్‌సీఎల్‌టీకి సమగ్ర నివేదికను అందజేసినట్టుగా లక్ష్మి మిట్టల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సార్ స్టీల్‌ను చేజిక్కించుకొనేందుకు గాను టాటాస్టీల్‌తో పాటు వేదాంత రిసోర్సెస్‌లు ముందుగా ఆసక్తి కనబరిచనప్పటికీ ఆ తరువాత వెనుకడుగు వేశాయి.

సాంకేతిక విద్యకు ప్రాధాన్యతనివ్వండి

- సర్కారుకు రూ.617 కోట్ల ప్రతిపాదన
- సాంకేతిక వర్సిటీలకు రూ.360 కోట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చే బడ్జెట్ (2018-19)లో సాంకేతిక విద్యకు ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అధికారులు కోరుతున్నారు. రాష్ట్రంలో 11 విశ్వవిద్యాలయాలున్నాయి. అందులో మూడు సాంకేతిక విశ్వవిద్యాలయాలుండగా, ఎనిమిది సాధారణ విశ్వవిద్యాలయాలు న్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లో సాధారణ విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసమే ప్రగతి పద్దు కింద రూ.420 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుత బడ్జెట్‌లో సాంకేతిక విశ్వవిద్యాలయాల అభివృద్ధికి ప్రగతి పద్దు కేటాయించలేదు. వచ్చే బడ్జెట్‌లోనైనా సాంకేతిక విశ్వవిద్యాలయాలకు ప్రాధాన్యతనిచ్చి, ప్రగతి పద్దు కింద నిధులు కేటాయించాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగా సాంకేతిక విద్యాశాఖకు రూ.617 కోట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన చేసినట్టు సమాచారం. ఇందులో సాంకేతిక విశ్వవిద్యాలయాలకే రూ.360 కోట్ల వరకు నిధులు కేటాయించాలని సూచించినట్టు తెలిసింది. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ (జేఎన్ఏఎఫ్ఏయూ)కు రూ.23 కోట్లు, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ)కి రూ.89 కోట్లు, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్)కు రూ.32 కోట్లు, జేఎన్టీయూ సుల్తాన్‌పూర్‌కు రూ.87 కోట్లు, జేఎన్టీయూ కరీంనగర్‌కు రూ.52 కోట్లు, జేఎన్టీయూ మంథనికి రూ.77 కోట్ల చొప్పున ప్రతిపాదనలు సమర్పించినట్టు సమాచారం. సాంకేతిక విద్యాశాఖకు ప్రతిపాదించిన మిగిలిన రూ.257 కోట్లు పాలిటెక్నిక్ కాలేజీల అభివృద్ధి, హాస్టళ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించినట్టు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో సాంకేతిక విద్యాశాఖకు ఎన్ని నిధులు కేటాయిస్తుందో వేచిచూడాల్సిందే.

సాంకేతిక విద్యాసంస్థలకు నిధుల ప్రతిపాదన వివరాలు

సాంకేతిక విద్యాసంస్థ	ప్రతిపాదన
జేఎన్ఏఎఫ్ఏయూ	రూ.23 కోట్లు
ఆర్‌జీయూకేటీ	రూ.89 కోట్లు
జేఎన్టీయూహెచ్	రూ.32 కోట్లు
జేఎన్టీయూ సుల్తాన్‌పూర్	రూ.87 కోట్లు
జేఎన్టీయూ జగిత్యాల	రూ.52 కోట్లు
జేఎన్టీయూ మంథని	రూ.77 కోట్లు
మొత్తం	రూ.360 కోట్లు

అదానీ, అంబానీల సేవలోనే ప్రభుత్వాలు

- కాంగ్రెస్ నేతలు కుంతియా, ఉత్తమ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ధనిక రాష్ట్రంగా చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్, ఉపాధి కూలీలకు కూలి ఇవ్వడం లేదని టీపీసీసీ అధ్యక్షుడు ఎన్ ఉత్తమ్ కుమారరెడ్డి తెలిపారు. లక్షన్నర కోట్ల రూపాయల బడ్జెట్‌లో కూలీలకు ఇవ్వడానికి నిధులు లేవా, పేదలంటే ఇంత నిర్లక్ష్యమా? అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని ఐఎన్‌టియుసి కార్యాలయంలో 'ఉపాధి' చట్టంపై శిక్షణ కార్యక్రమాలను ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. దేశ చరిత్రలోనే కూలీలకు ఉపాధి చట్టం ఒక విప్లవాత్మకమైందన్నారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ ఆర్‌సి కుంతియా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం పనిచేయడం లేదనీ, ఆదాని, అంబానీల సేవలోనే నిమగ్నమయ్యాయనీ విమర్శించారు. నరేగాను నిర్వీర్యం చేయాలని చేస్తే చూస్తూ ఊరుకోం అన్నారు. సమావేశంలో సంజీవరెడ్డి, జనక్ ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

విదేశీ మోజులో కేటీఆర్ : బీజేపీ నేత లక్ష్మణ్

హైదరాబాద్: మంత్రి కేటీఆర్ విదేశీ మోజులో పడ్డారని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రం ఇచ్చిన నిధులు మురిగి పోతున్నాయని, నగరాలు, పట్టణాల్లో పరిస్థితి దారుణంగా ఉందని అన్నారు. కేంద్ర నిధులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

పవన్ జేఎఫ్‌సీ లోగో అవిష్కరణ

హైదరాబాద్: ఏపీ విభజన సమస్యలు పరిష్కరించడానికి ఏర్పాటు చేసిన జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఏర్పాటులో మరో ముందడుగు పడింది. దీనికి సంబంధించిన లోగోను జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన ట్విట్టర్ అకౌంట్ ద్వారా విడుదల చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనను సూచిస్తూ, రెండు రాష్ట్రాల మ్యాప్‌లను లోగోలో పొందుపరిచారు. అటు ఇటు తెలంగాణ, ఏపీలు ఉండగా.. మధ్యలో జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని సూచిస్తూ సంక్షిప్త అక్షరాలు(జేఎఫ్‌సీ) ఉన్నాయి.

ప్రభుత్వ నిధులతోనే 'డబుల్'

కేంద్రం వాటా రూ.1500కోట్లు

రాష్ట్ర వాటా రూ. 6,264.84కోట్లు

- బల్దియా వాటా రూ.776.43కోట్లు
- మౌలికవసతుల కల్పన బాధ్యతా రాష్ట్ర ప్రభుత్వానిదే
- త్వరలో ఉత్తర్వులు జారీ
- జీహెచ్ఎంసీకి తగ్గనున్న భారం

నవతెలంగాణ- హైదరాబాద్ సిటీబ్యూరో

హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలో పేదల కోసం నిర్మించతలపెట్టిన లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే నిధులు కేటాయించనున్నాయి. అయితే, ముందుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాల నిధులను జీహెచ్ఎంసీకి కేటాయించాలని నిర్ణయించారు. దాంతో పాటు జీహెచ్ఎంసీ రూ.776.43కోట్లు కేటాయిం చాలి. కానీ ప్రస్తుతం బల్దియా ఆర్థిక పరిస్థితి బాగోలేక పోవడంతో జీహెచ్ఎంసీ వాటా కూడా సర్కారే భరించనుందని కేటీఆర్ పలుమార్లు ప్రకటించారు. దీనిపై ప్రభుత్వం త్వరలో ఉత్తర్వులు జారీచేసే అవకాశముంది. బాండ్లు, లోన్ల ద్వారా జీహెచ్ఎంసీ రూ.3,500కోట్లు సేకరించాలని నిర్ణయించింది. ఈ నిధులతో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టు పనులు చేపట్టాలని నిర్ణయించారు. డబుల్ ఇండ్ల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోనుండటంతో రుణాల ద్వారా వచ్చిన నిధులను ఎస్ఆర్‌డీపీకే ఖర్చు చేయనున్నారు.

లక్ష ఇండ్లు

జీహెచ్ఎంసీ పరిధిలో సుమారు కోటికిపైగా జనాభా ఉంది. సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 5లక్షల మందికి ఇండ్లులేవని గుర్తించారు. వీరిలో లక్ష మందికి రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టిస్తుంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో 109 ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణం చేపట్టారు.

హైదరాబాద్ జిల్లాలో 34ప్రాంతాల్లో ఇన్‌సిటూ(పాత ఇండ్లను కూల్చేసి కొత్తగా నిర్మించడం)లో 8,545ఇండ్లు, రెండు ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో 637 ఇండ్లను నిర్మిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో ఇన్‌సిటూ కింద 1,332, 28ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో 23,722ఇండ్లు, మేడ్చల్ జిల్లాలో ఇన్‌సిటూ కింద మూడు ప్రాంతాల్లో 392, 28ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో 378,152ఇండ్లు, సంగారెడ్డి జిల్లాలో 10 ప్రాంతాల్లో 28,220ఇండ్లను నిర్మిస్తున్నారు.



వీటిలో 50వేల ఇండ్లు పూర్తయ్యే దశలో ఉన్నాయని, 40వేల ఇండ్లు ఆయా దశల్లో ఉన్నాయని, మరో 10వేల ఇండ్లకు సంబంధించిన స్థల వివాదాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. స్టీల్, ఇసుక సమ స్యల కారణంగా నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతు న్నాయని చెబుతున్నారు.

నిధుల కేటాయింపు

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను జీ+3, స్టిల్ట్+జీ+5, సెల్లార్+స్టిల్ట్+జీ+9 అంతస్తుల్లో నిర్మిస్తున్నారు. జీ+3లో 10,700ఇండ్లు, స్టిల్ట్+జీ+5లో 18,178 ఇండ్లు, సెల్లార్+స్టిల్ట్+జీ+9లో 71,122 ఇండ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అయితే, ఈ ఇండ్ల నిర్మాణానికి గాను కేంద్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.1.50లక్షల చొప్పున రూ.1500కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద ఒక్కో ఇంటికి రూ.6.25లక్షల నుంచి రూ.6.40లక్షల చొప్పున మొత్తం రూ.6264.84కోట్లు కేటాయించింది. జీహెచ్ఎంసీ వాటా రూ.776.43కోట్లు కేటాయించింది. దీంతోపాటు మౌలిక వసతులను కూడా జీహెచ్ఎంసీనే కల్పించాలని సర్కార్ ఆదేశించింది. కానీ బల్దియా ఖజానాలో నిధుల్లేకపోవడంతో అది కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని కేటీఆర్ ప్రకటించారు. అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. ఈ విషయాన్ని మేయర్ బొంతు రామ్మోహన్, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి సర్కార్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో ఉత్తర్వులు జారీచేసే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. దీంతో బల్దియాపై డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల భారం తగ్గనుందని అధికారులు చెబుతున్నారు.

పోలీసు జాగిలాల పాత్ర భేష్

- అంతర్గత భద్రతను కాపాడటంలో సేవలు అమోఘం: పోలీసు జాగిలాల పాసింగ్ అవుట్ పరేడ్‌లో సీఎస్ ఎస్పీ జోషీ



నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

అంతర్గత భద్రత, నేరాల అదుపులో సుశిక్షితమైన పోలీసు జాగిలాల పాత్ర అత్యంత కీలకంగా మారిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ జోషీ అన్నారు. సోమవారం మొయినాబాద్‌లోని ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగానికి చెందిన పోలీసు జాగిలాల శిక్షణ అకాడమీలో ట్రెనింగ్ పూర్తి చేసుకున్న 72 జాగిలాలు, 92 కెనాన్ హ్యాండ్లర్స్(జాగిలాల నిర్వాహకులు) శిక్షణానంతర ముగింపు కవాతుకు సీఎస్ ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగానికి చెందిన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రపంచంలో మారుతున్న పరిణామాల కారణంగా దేశ అంతర్గత భద్రతకు అనేక కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని అన్నారు. ముఖ్యంగా అంతర్గత భద్రత, నేరాల నివారణ విషయంలో పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా మెలగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రక్రియ మరింత పటిష్టంగా సాగడానికి పోలీసు జాగిలాలు, వాటిని నియంత్రించే సిబ్బందికి అంతర్జాతీయ స్థాయిలో శిక్షణను ఇవ్వడం అభినందనీయమన్నారు. కొత్తగా శిక్షణ పొందిన ఈ జాగిలాలు, వాటి హ్యాండలర్స్ మంచి ఫలితాలను సాధించాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఏడు నెలలకు పైగా సాగిన పోలీసు జాగిలాలు, వాటి హ్యాండ్‌లర్స్ శిక్షణ క్లిష్టతరమైందన్నారు. నేరస్తులను పసిగట్టడం మొదలు విద్రోహులు పెట్టిన బాంబులను కనుక్కోవడం, ఇతర ఆయుధాలను కనిపెట్టడం, వాసన తో నేరస్తులను గుర్తించడం మొద లైన ట్రెనింగ్‌లో కొత్త టీమ్ ఆరి తేరిందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో విద్రోహచర్యలను గుర్తించడంలో ఇప్పటి వరకు రాష్ట్రంలోని పోలీసు జాగిలాలు చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్‌చంద్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ అకాడమీలో 500 లకు పైగా వివిధ జాతులు పోలీసు జాగిలాలకు శిక్షణ నివ్వడం జరిగిందన్నారు. ఈ మారు రాష్ట్రానికి చెందిన 50 జాగిలాలే గాక ఇతర రాష్ట్రాలు, కేంద్ర పారామిలటరీ బలగాలకు చెందిన 22 జాగిలాలకు కూడా విజయవంతంగా శిక్షణను ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో జర్మన్‌షిప్పర్డ్, డోబర్‌మెన్ తదితర జాతులకు చెందిన జాగిలాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం శిక్షణలో అన్ని విభాగాల్లో నైపుణ్యాన్ని కనబరిచిన జాగిలాలు, వాటి హ్యాండలర్స్ కు చీఫ్ సెక్రటరీ జోషి బహుమతులను ప్రదానం చేశారు. అంతకు ముందు పోలీసు జాగిలాలు నిర్వహించిన కవాతు, చేసిన వివిధ విన్యాసాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనం తరం ఇదే అకాడమీలో పోలీసు జాగిలాల శిక్షణ కోసం నిర్మించిన నూతన బ్యారక్‌లను డీజీపీ మహేందర్‌రెడ్డి ప్రారం భించారు.



ఈ కార్యక్రమంలో సైబరాబాద్ కమిషనర్ సందీప్ శాండిల్య, పోలీసు హౌజింగ్ కార్పోరేషన్ ఎండీ మల్లారెడ్డి, ఐఎస్‌డబ్ల్యు డీఐజీ ఎం.కె.సింగ్ అదనపు డీజీ గోపికృష్ణ తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

శివరాత్రి శుభాకాంక్షలు: సీఎం, గవర్నర్

హైదరాబాద్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, జోగు రామన్న, హరీశ్‌రావు, ఎంపీ కవిత శుభాకాంక్షలు తెలిపారు. శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

రాజధానిలో రక్షణ లేదంటూ..

- ఏపీ సీఎంతో ఓ వ్యక్తి వాగ్వాదం



గుంటూరు: రాజధానిలో ప్రజలకు రక్షణ లేదని, తనను కొందరు అకారణంగా చితకబాదారని కృష్ణా జిల్లా జి.కొండూరుకు చెందిన రామాంజనేయులు ఏపీ సీఎం చంద్రబాబుతో వాగ్వాదానికి దిగాడు. 'జల సంరక్షణ' సభలో ఏపీ సీఎం చంద్రబాబు మాట్లాడుతున్న సమయంలో కలుగజేసుకున్న రామాంజనేయులు 'జలసంరక్షణ కాదు.. రాజధానిలో ప్రజలకు రక్షణ లేదు. 2017 జనవరిలో మందడంలో కొందరు తనను చితకబాదారు' అని పెద్దగా అన్నాడు. పార్కింగ్ కోసం మాదల సుబ్బయ్య కుమారుడు దాడి చేశారని ఆరోపించాడు. దీనికి స్పందించిన ఏపీ సీఎం చంద్రబాబు 'క్రమశిక్షణగా ఉండు.. నోరుందికదా అని ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడితే అవాస్తవం వాస్తవం కాదు. నువ్వు ప్రజాస్వామ్యబద్ధంగా నీ సమస్య చెప్పావు. దీనిపై ఎస్‌పి, కలెక్టర్‌కు చెప్పా.. వాళ్లు విచారిస్తారు' అని అన్నారు. అయినా రామాంజనేయులు మాట్లాడుతుండడంతో 'ఏయ్ తమ్ముడు.. విను.. వినవయ్యా.. నువ్వు తెలివైనవాడివైతే నేను నీకన్నా తెలివైనవాడిని. నువ్వు రోడ్డు మీద ఎక్కడ పడితే అక్కడ కారు పెట్టావనుకో ఎలా..' అంటూ మండిపడ్డారు. అయినా ఆ వ్యక్తి మాట్లాడుతుండంతో 'ఏయ్.. వింటావా.. లేదా? నీ సమస్య గురించి చెప్పు.. కొంచెం ఓపిక పట్టు.. నోరుందని పెద్దపెద్ద ఉపన్యాసాలు వద్దు' అని సీఎం కసురుకున్నారు.

జాతర
నవతెలంగాణ
www.navatelangana.com

ప్రధానమంత్రి మోడీ పార్లమెంటులో పార్లమెంట్ సభ్యురాలు రేణుకా చౌదరి నవ్వును శూర్పణఖ వికటాట్టహాసంతో పోల్చడంతో రావణ సోదరి శూర్పణఖ గాథ ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశ మయింది. హిందుత్వ శక్తులు స్త్రీల సేచ్ఛకు బద్ధ శత్రువులు. స్త్రీలు బహిరంగంగా నవ్వడం, ఒంటరిగా తిరగడం, పురుషులతో సమానంగా అవకాశాలు పొందడం వంటివాటికి పూర్తి వ్యతిరేకులు. బూజుపట్టిన భావజాలంతో పాత ఇతిహాస ప్రతీకలు, పాత్రలను ఉపయోగించి స్త్రీలను అవమానించడం, కట్టడిచేయడానికి వారు చేయని ప్రయత్నమంటూ లేదు. శత్రువు ఆయుధాలతోనే శత్రువును తిప్పికొట్టాలి. హిందుత్వ శక్తులు ఏ ఇతిహాసపాత్రలను హీనంగా చూస్తూ వస్తున్నారో, ఆ పాత్రల ఉన్నతిని తెలియజేసి ప్రత్యామ్నాయ సంస్కృతిని నిర్మించాలి. అప్పడే ఇటువంటి దాడుల నుంచి స్త్రీలు, ఇతర బలహీనవర్గాలవారు సురక్షితంగా బయటపడతారు. ఆ ప్రయత్నంలో భాగమే ఈ ప్రత్యేక వ్యాసం.



శూర్పణఖ అంతరంగం

దూరదర్శన్‌లో రామాయణం రోజువారీ సీరియల్‌గా ప్రసారం చేసి సరిగ్గా మూడు దశాబ్దాలయింది. ఆసియా దేశాల్లో అనేక రామాయణాలు ఉన్నాయి. ప్రస్తుతం బాగా వ్యాప్తిలో ఉన్న రామాయణ కథ వీటిలో ఒకటి మాత్రమే. దూరదర్శన్‌లో రామాయణ సీరియల్ ను ప్రసారం చేయడం ద్వారా ఒక ఆధిపత్య గాథను విస్తృతంగా ప్రచారం చేసి తద్వారా భిన్న సంస్కృతులకు, ప్రత్యామ్నాయ గాథలకు నష్టం చేసిందని ఆనాడే చరిత్రకారులు, మేధావులు విమర్శించారు. ప్రభుత్వ మీడియా ఇట్లా ఆధిపత్య (ఆర్య) సంస్కృతికి పెద్ద పీట వేయడం సరికాదని రొమిల్లా థాపర్ వంటి చరిత్రకారులు పేర్కొన్నారు. భిన్న రామాయణాల సంపన్నతను ఇది కాలరా సిందని విమర్శించారు. జనబాహుళ్యంలో ప్రచారమైన రామాయణం ప్రకారం రాముడు మర్యాద పురుషోత్తముడు. రామరాజ్యమంటే సంక్షేమరాజ్యం. రావణుడు దుష్టుడు. రావణ సోదరి శూర్పణఖ దుష్ట రాక్షసి. కామ పిశాచి!

రామాయణ గాథ మొదట వెలువడిన కాలంలో లిపిలేదు. మౌఖికంగానే ఇది తరతరాల పాటు ప్రచారం పొందింది. లిపి రాకతో గ్రంథం రూపుదిద్దుకుంది. వాల్మీకి రామాయణంలో సైతం బాలకాండ, ఉత్తరకాండలు మొదట లేవనీ, తర్వాత చేర్చారని చరిత్రకారులు నిరూపించారు. అట్లాగే రామాయణం వాల్మీకి, కంబ, తులసీదాస్, జైన, బౌద్ధ తదితర భిన్న రామాయణాలుగా వందల సంఖ్యలో ప్రచారంలో ఉంది.

ఇండొనేషియా, థాయిలాండ్ వంటి ఆసియా దేశాల్లో రామాయణ గాథలున్నాయి. భిన్న సమాజాల సంస్కృతులకు, చరిత్రలకు ఇవి దర్పణం పడతాయి. రామానంద్ సాగర్ రామాయణం ఈ వైవిధ్యాన్ని కాలరాసి ఆధిపత్య వర్గాల రామాయణాన్ని భారతీయ సాంస్కృతిక మూలంగా చేసేసింది. రకరకాల రామాయణాల్లోని అద్భుత వైవిధ్యాన్ని ధ్వంసం చేసింది. ఉదాహరణకు అంబేద్కర్, పెరియార్ పరిశోధనలు, రామాయణ గాథలపై ఉన్న స్త్రీల పాటలు పురుషాధిక్యతను ప్రశ్నిస్తాయి. బౌద్ధ రామాయణం ప్రకారం రాముడికి సీత సోదరి. రాముడు ఏకపత్నీవ్రతుడు కాదని, అతడికి పలువురు భార్యలు, ఇతర స్త్రీలు ఉన్నారని వాల్మీకి రామాయణాన్ని ఉటంకిస్తూ డాక్టర్ అంబేద్కర్ 'రాముడు-కృష్ణుడు రహస్యాలు' పుస్తకాన్ని రాశారు. రామరాజ్యాన్ని ఆధిపత్య సంస్కృతి కీర్తిస్తుంటుంది. వాస్తవానికి రాముడు రాజ్యపాలన బాధ్యతల్ని భరతునికి అప్పగించి కాలక్షేపం చేసేవాడు. "రాముడు మధ్యాహ్నం వరకు పూజలు, ఆ తర్వాత విదూషకులు లేదా అంత:పుర స్త్రీలతో కాలక్షేపం చేసేవాడ"ని అంబేద్కర్ రాముని దినచర్యను ప్రస్తావించాడు. పెరియార్ రామస్వామి, అంబేద్కర్ లు రాముని ఆదర్శనీయతపై అనేక ప్రశ్నలు సంధించారు. వాలిని చెట్టు చాటు నుంచి వధించడం, తపస్సు చేస్తున్నందుకు శంభూకుణ్ణి చంపడం, సీతకు శీల పరీక్ష పెట్టడం, తాటకి వంటి స్త్రీలను హత్యచేయడం, శూర్పణఖను పరాభవించడం వంటి అంశాల్ని వారు ఉదహరించారు. పెరియార్ రావణుడిని రామాయణ హీరోగా ప్రశంసించాడు. ద్రావిడులకు రావణుడు ఆరాధ్యుడు. రాముడు శత్రువు. అలాగే దేశంలోని కొన్ని వర్గాలకు మహిషాసురుడు దేవుడు. దుర్గ శత్రువు.



శూర్పణఖపై భిన్న కథనాలు

రావణుని సోదరి శూర్పణఖ. ఆమె భర్తను రావణుడు ఒక యుద్ధంలో పొరపాటున వధిస్తాడు. దీంతో శూర్పణఖ సోదరుడిపై ఆగ్రహించి, రాజ్యం వదలి అడవులలో ఒంటరిగా జీవిస్తుం టుంది. ఆమె నిర్భయ. భర్తను చంపిన అన్నపై ప్రతీకారం తీర్చుకోవాలనే ఉద్దేశంతోనే రాముణ్ణి వివాహం చేసుకొమ్మని కోరింది. తదనంతర పరిణామాల వ్యూహం రచిస్తుంది. రావణ సంహారానికి కారకురాలవుతుందనేది ఒక విశ్లేషణ.

మరొక పురాణ గాథ ప్రకారం శూర్పణఖ బ్రహ్మను ప్రార్థించి రాముడి తర్వాత అవతారం (కృష్ణావతారం)లో అతడి భార్య అయ్యే వరం పొందుతుంది. ఉత్తర భారత దేవతల గాథలపై పరిశోధన చేసిన ప్రొఫెసర్ కేథలీన్ మరో ఆసక్తికర గాథను చెబుతారు. రావణుడి వధ తర్వాత శూర్పణఖ సీతను కలసితన సోదరుడి బొమ్మను గీయమని అడుగుతుంది. అవనిజ రావణుని అసంపూర్ణ చిత్రాన్ని ఇస్తే శూర్పణఖ దాన్ని పూర్తి చేస్తుంది. ఈ బొమ్మ చూసిన రాముడు సీతను అనుమానించి అడవులపాలు చేశాడు.

రామాయణ గాథలలోనే ఎంతో వైవిధ్య సంస్కృతి ఉన్నదని ప్రొఫెసర్ రిచ్‌మెన్ తన గ్రంథం 'మెనీ రామాయణాస్'లో చెబుతారు. ఇలాంటి వైవిధ్యాన్ని ఆధిపత్య సంస్కృతి అణచి వేస్తుంది. ప్రత్యామ్నాయ రామాయణ గాథల్ని సంస్కృతుల్ని కాలరాస్తున్నది. శూర్పణఖను కామ పిశాచిగా చిత్రీకరించడం, ఆమె నవ్వును తప్పు పట్టడం, ముక్కు చెవులు కోసి అవమానించడం ఇవన్నీ పురుషాధిపత్య సంస్కృతికి ప్రతీకలు. అందువల్ల ఈ ధోరణిని ప్రశ్నించాలి. ప్రత్యా మ్నాయ గాథల్ని పున:ప్రచారంలో పెట్టాలి. మేధావులు, చరిత్రకారులు, ప్రసార మాధ్యమాలతోపాటు మనందరం దీన్ని బాధ్యతగా స్వీకరించాలి.



-బి.భాస్కర్, సీనియర్ జర్నలిస్ట్
సెల్:9989692001



గుహాలయాలు

క్రీస్తు శకం 5వ శతాబ్దంలో హిందు(బ్రాహ్మణిక) మతమూ, జైన మతమూ కూడా రాతిని దొలిచి ఆలయాలు నిర్మించే పద్ధతిని అవలంభించసాగాయి. ఈ పద్ధతిని విస్తరించి 6, 10 శతాబ్దాల మధ్య దక్కన్ నుండి కన్యాకుమారి దాకా అటువంటి ఆలయాలను ప్రసాదించింది. ఉత్తరాదికన్నా దక్షిణాదిన ఈ ఆలయాలు ఎక్కువ. వాటిలో హిందు ఆలయాలు ఎక్కువ. ఈ రాతి ఆలయాలను తొలిచే కార్యక్రమాన్ని దక్కనులో వాతాపి (బాదామి) చాళుక్యులు, కోస్తాంధ్రలో తూర్పు (వేంగి) చాళుక్యులు, తమిళదేశపు తూర్పున పల్లవులు, దక్షిణాగ్రానా పాండ్యులు ప్రారంభించారు. క్రీ.శ 550-850ల మధ్య ఈ ఆలయాలు అత్యధిక సంఖ్యలో వెలశాయి. శక్తివంతులు, పరస్పర వైరులు అయిన ఈ రాజులు పోటీపడి కళా,వాస్తు, సాహిత్య రంగాల్లో వెల లేని మాణిక్యాలను వెలయించారు. వీరే కాక వీరి మధ్య నలుగుతూ వచ్చిన అనేక చిన్న రాజ్యాలు, బాదామి చాళుక్యులను తోసిరాజన్న రాష్ట్రకూటులు కూడా తమ తమ ప్రాంతాల్లో యధోచితంగా ఈ ఆలయ నిర్మాణంలో పాత్ర వహించారు.



ఆదిలో రాతిని చనిపోయినవారి స్మృతి చిహ్నంగా వాడడం మొదలయిన ఆచారాల కారణంగా, రాతిని ఆలయ నిర్మాణాల్లో వాడేవారు కాదు. కాని ఈ ఆంక్షను అటు చాళుక్యరాజు మంగళేశుడు, ఇటు పల్లవ రాజు మొదటి మహేంద్రుడు జవదాటారు. చనిపోయిన తమ అనుంగు సోదరుడు కీర్తివర్మ జ్ఞాపకార్థం మంగళేశుడు బాదామిలో విష్ణుగుహాలయం(3)ను తొలిపిం చాడు. ఇది తెలిసి మహేంద్రుడు దక్షిణ ఆర్కాట్ జిల్లాలోని మండగ పట్టులో శివ, విష్ణు, బ్రహ్మల ఆలయాన్ని గుహలో తొలిపించాడు. మంగళేశుడు ఇందు నిమిత్తం బీజపూర్ జిల్లా (బాదామి)లోని మెత్తటి ఇసుక రాతిని ఎన్నుకోగా, మహేంద్రుడు తన రాజధానికి దూరంగా వున్న మండగపట్టు దగ్గరి కఠినమైన గ్రానైట్ శిలను ఎన్నుకున్నాడు.

మంగళేశుడు తొలిపించినది హిందు దేవుడి కోసం హిందు దేవతల శిల్పాలతోటి మొట్టమొదటి గుహాలయమే అయినా, మెత్తటి ఇసుక రాతిలో తొలచడం అన్నది పాత సంప్రదాయమే. ఈ మెత్తటి రాతిలో ఆలయాలను అంతకు పూర్వం మౌర్యుల కాలం నుంచీ ఉత్తర, మధ్య, పడమటి ప్రాంతాలలో తొలుస్తున్నారు. కనుక దాదాపు వెయ్యేళ్ల నుంచి పరిణితి చెందిన పనితనమూ, ఆ పని తెలిసిన పనివారూ ఉండడం మంగళేశుడికి తోడ్పడింది. అందువల్లనే అతడు చాలా భారీ ఎత్తున కొత్త పద్ధతిలో గుహాలయం నిర్మించగలిగాడు. ఇతనిని చూసి చాళుక్యులు బాదామి, ఐహోల్ వంటి చోట్ల మెత్తటి రాతిలో గుహాలయాల నిర్మాణానికి ఉపక్రమించారు.

కాని మహేంద్ర పల్లవుడు ఎన్నుకున్నది కఠిన శిల, ఆ మేరకు అతడు సరికొత్త పుంత తొక్కాడు. ఎందుకంటే అంతకు ముందు ఎప్పుడో తొమ్మిది వందలేండ్ల ముందు అశోకుడు, దశరథుడు; బారాబర్, నాగార్జుని, సీతామర్హి కొండల గట్టి రాతిలో ఆలయాలు తొలిపించారు. కాని ఆ సంప్రదాయం అంతరించిపోయింది. కనుకనే మండగపట్టు గుహాలయ శాసనంలో "త్రిమూర్తుల నిమిత్తం కట్టించిన ఈ ఇటుకలు లేని, కలపలేని, సున్నం లేని లోహంలేని ఆలయాలు" అని సగర్వంగా చెప్పుకున్నాడు. అందులో అతిశయోక్తి లేదు. ఈ శాసనం వల్ల రాతి ఆలయాల సృష్టిలో కొత్త మలుపు ఎప్పుడు వచ్చిందో స్పష్టమవుతూ ఉంది. గట్టి రాతిని తొలచడం చాలా కష్టసాధ్యమైన పని కనుక తర్వాత వచ్చిన ఎన్నో ఆలయాలు చిన్నవిగాను, సరళంగాను ఉన్నాయి.

ఈ విధంగా దక్షినాన చాళుక్యులు, పల్లవులు ఒకే సమయంలో రెండు సంప్రదా యాలకు నాంది పలికారు. దక్కన్, ఉత్తర మైసూర్, కోస్తాంధ్రల్లో తర్వాతి వంశాలవారు మెత్తటి రాతిలో గుహాలయాలు, తర్వాతి విడి ఆలయాలు నిర్మించారు. పల్లవుల తర్వాతివారు పాండ్యులూ గుహాలయాలకు, విడి ఆలయాలకు తమ ప్రాంతంలోని గట్టి రాతిని ఎన్నుకున్నారు. 14వ శతాబ్దంలో విజయనగర సామ్రాజ్యం ఉదయించి మధ్యందిన మార్తాండుడిలా విరాజిల్లి ఈ రాజ్యాలన్నింటినీ విలీనం చేసుకొని దక్షిణ భారత దేశం అంతటినీ ఏకఛత్రాధిపత్యంగా ఏలడం ఆరంభించేదాకా ఈ రెండు సంప్రదాయాలూ కొనసాగాయి. క్రమంగా మెత్తటి రాతిని వాడే ఉత్తరాది సంప్రదాయం అంతరించగా ఆలయ నిర్మానానికి గట్టి రాతిని వాడడం సంప్రదాయం అయింది. అయితే ఆయా ప్రాంతాల నిర్మాణ వైఖరులు మాత్రం అట్లాగే సాగాయి.

-శ్రీనివాస్

జాతి భావన పక్కదారి పట్టింది



ఇప్పుడున్న మానవ వర్గాలను అన్నింటిని హోమో సేపియన్స్ అనే జీవజాతి కింద జమకట్టినారు. ఈ ఒక్క జీవజాతిలోనే స్పష్టమైన వర్గాలు,కొన్ని, అస్పష్టమైన వర్గాలు ఎన్నో ఉన్నాయి. ఈ వర్గాలన్నింటినీ జాతి (రేస్) అనే సర్వ సామాన్యమైన పదంతోనే వ్యవహరిస్తున్నారు. జాతి అనేది ఒక విధమైన జీవశాస్త్ర భావన. జాతులన్నింటినీ జీవశాస్త్రానికి సంబంధించిన అనేక భాగాలుగా చెప్పుకోవచ్చు. క్లుప్తంగా చెప్పాలంటే ప్రపంచంలో ఉద్భవించిన ఏ జనాభానైనా జాతి అనవచ్చు. అటువంటి జనాభాలోని సభ్యులందరికీ ఒకే చరిత్ర ఉంటుంది. వాళ్లంతా ఒకే ప్రదేశంవారై ఉంటారు. ఒకే జాతివారవుతారు. వారందరికీ ఒకే జీవ పారంపర్యం ఉంటుంది.

జాతి ఒక ఆకర్షణ శక్తి వంటిది. ఆకర్షణ శక్తి ఒక వస్తువూ కాదు, కంటికి కనిపించే దృగ్విషయం (ఫెనామినన్) కాదు. కాని అది దృశ్యవిశేషాలను, వస్తు విధానాలను వివరించి చెబుతుంది. ఆయా చరాచరాల కదలికలను ఆకర్షణ శక్తి సిద్ధాంతం ద్వారా మనం విశదీకరించి చెబుతాం. అట్లాగే జాతి కూడా కొన్ని విశేషాలను వివరించే సిద్ధాంతం వంటిది. జీవజాతిలో అది ఒక ఉపభాగం. మానవ జాతిలో ఆయా వర్గాలను భౌగోళికంగా విభజించడమనేది కేవలం మన సౌలభ్యం కోసమే అనేదికొందరు శాస్త్రవేత్తల అభిప్రాయం. కాబట్టి జాతి అనే పదం నిరాధారమైనదని, కేవలం సౌలభ్యం కోసమే ఈ పదాన్ని రూపొందించుకున్నామని అర్థమవుతుంది.



జంతు-వృక్ష శాస్త్రవేత్తల సిద్ధాంతం ప్రకారం జాతి అనేది ప్రాథమికంగా ఒకే ప్రదేశానికి చెందిన స్త్రీ పురుష సమూహము. వాళ్ల అనువంశికంగా జనాభాను అభివృద్ధి చేసుకొంటూ ఒక వంశాన్ని, తద్వారా ఒక విధమైన చరిత్రను సృష్టిస్తారు. స్పష్టంగా కనిపించే కొన్ని సామాన్య శారీరక లక్షణాలను ఆధారంగా తీసుకొని ఇతర వర్గాల నుంచి వేరుచేసిన ఒక పెద్ద మానవ సమూహాన్ని జాతి అంటారు. ఈ లక్షణాలు అనువంశికంగా ఒకరి నుంచి మరి ఒకరికి సంక్రమిస్తూ తరతరాల వరకు శాశ్వతంగా నిలబడిపోతాయి. ఇంకో విధంగా చెప్పాలంటే పూర్వుల నుంచి సంక్రమించిన ఆయా లక్షణాల సారూప్య ఆకారాన్ని ఒక మానవ సమూహంలోని సభ్యులు వ్యక్తిగతంగా ప్రదర్శించగలిగినప్పుడే వాళ్లను ఒక జాతిగా విభజించడానికి వీలవుతుంది. అయితే మానవుని లక్షణాలన్నింటిని బట్టి ఒక జాతి భావనను నిర్ధారణ చేయాలని ప్రయత్నిస్తే, అది పూర్తిగా విఫలమవుతుందని కొందరంటున్నారు.

ఒక జాతి జన్యువుల ఆవృత్తిని ఆ జాతి జీనోటైప్ అంటారు. ఒక జనాభా బాహ్య ప్రకృతిని బట్టి కొన్నిసార్లు దీనిని నిర్ధారించడం జరుగుతూ ఉంటుంది. కంటికి కనబడే లక్షణాలన్నీ కలిసి ఫీనోటైప్ అవుతాయి. ఒక జాతి జన్యువుల ఆవృత్తిని బట్టి కాని, బాహ్యప్రవృత్తి లక్షణాలను బట్టి కాని నిర్వచించవచ్చు. అయితే ఈ రెండు పద్ధతులలోను పరిమాణానికి ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది. కొన్ని చోట్ల కొన్ని లక్షణాలు లేదా జన్యువులు అసలు లేకపోవచ్చు. అటువంటప్పుడు గుణాల మీద ఆధారపడి వాటిని నిర్ణయించవచ్చు. ఈ లక్షణాలు లేదా జన్యువులు వివిధ వర్గాలలో వివిధ ప్రమాణాలతో ఉంటాయి.

జన్యువులు, లక్షణాలు కూడా జీవుల అవయవ నిర్మాణ స్వరూపంలోని భాగాలు. ఈ భాగాలన్నీ ఒకదానిమీద మరొకటి ఆధారపడినవి కాబట్టి ఒక భాగంలో పనిచేసే భాగాలను కూడా ప్రేరేపించవచ్చు. ఈ నిర్మాణంలో జన్యువుల లోపల ఉంటే, లక్షణాలు అంతిమ ఫలితంగా బయటికి కనిపిస్తాయి. ఉదాహరణకు తల వెంట్రుకల రంగు, కంటి ఛాయ. అయితే ఈ లక్షణాల ఏర్పాటుకు తగినటువంటి జన్యువులు, పరిసరాలు చాలా అవసరం.

ఒక జాతిని నిర్వచించేటప్పుడు జీనోటైప్‌లను మాత్రమే తీసుకోవలెనా లేక పాక్షిక అనువంశిక లక్షణాల మీద ప్రసరించని పరిసరాల ప్రభావం, అనువంశికతకు చెందని లక్షణాలు కలిసే విధంగా ఫీనోటైప్‌లను కూడా తీసుకోవలెనా అనే విషయం నిర్ణయించుకోవాలి. ఒక పరిణామ దశను గురించి తెలుసుకోవడానికి జాతి ఒక సాధనం వంటిది. ఒక తరం నుంచి మరొక తరానికి చేరుకొనేటప్పటికి అది బాగా స్థిరపడుతూ ఉండాలి. అది అనువంశిక లక్షణం. జాతి భావన సిద్ధాంతమనేది అనువంశిక లక్షణాల మీద ఆధారపడినది. కాకపోతే దానికి విలువ ఉండదు.



సామాన్యంగా జాతి అనే పదం చాలా ఉద్వేగపూరితమైనట్టిది. అవాంఛనీ యమైన, అతి ప్రమాదకరమైన అర్థాలెన్నిటికో అది తావిస్తుంది. ఈ జాతి పేరిట కోట్లాది ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఎంతో మంది ఎన్నో అవమానాలకు గురయ్యారు. అందువల్ల సరైన భావన అందరికీ కలిగేవరకైనా ఈ పదాన్ని తొలిగించాలని శాస్త్రవేత్తలు అంటున్నారు.

-ఎ.వి.రెడ్డి



ఆ ఆలోచనే ఆసక్తి రేపుతోంది

● ధోని కెప్టెన్సీలో ఆడటంపై వాట్సన్

చెన్నై : క్రికెట్ కెప్టెన్సీలో ధోనీది ప్రత్యేక శైలి. మైదానంలో అతడి మాదిరి ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోవటం క్రికెట్‌కు పూర్తిగా కొత్త. కూల్ కెప్టెన్సీతో ఐసీసీ ట్రోఫీలను అన్నింటినీ ఎత్తుకున్న అరుదైన రికార్డు మహి సొంతం. అలాంటిది ధోని సారథ్యంలో ఆడటం అంటే ఎవరికైనా ఉత్సకతే. ఆస్ట్రేలియా మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ సైతం అంతే ఉత్సాహంతో ఉన్నాడు. ఐపీఎల్‌లో ఈ సీజన్ నుంచి వాట్సన్ చెన్నై సూపర్ కింగ్స్ తరపున బరిలోకి దిగనున్నాడు. 'ఐపీఎల్‌లో ఘన చరిత్ర ఉన్న చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడనుండటం గొప్ప గౌరవం. ఇక మహేంద్రసింగ్ ధోని సారథ్యంలో ఆడబోతున్నాననే భావన మరింత ఆసక్తి రేపుతోంది' అని వాట్సన్ పేర్కొన్నాడు. 2008-2015 సీజన్లలో రాజస్థాన్ రాయల్స్‌కు ఆడిన వాట్సన్ గత రెండు సీజన్లలో బెంగళూర్ జట్టులో భాగంగా ఉన్నాడు. 'నిజానికి ఈ అనుభూతి కాస్త కొత్తగా ఉంది. ఎందుకంటే ఐపీఎల్ తొలి సీజన్ నుంచే చెన్నై మాకు బలమైన ప్రత్యర్థి. ఇప్పుడా జట్టు నుంచే ఆడబోతున్నాను. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినా.. క్రికెట్ అంటే ప్రేమ పోలేదు. ఆ కారణంతోనే ప్రతి మ్యాచ్‌ను ఆస్వాదించగలను, అదే పోటీతత్వంతో పోరాడగలను' అని వాట్సన్ అన్నాడు.

ఈసారి అభిమాని నుంచి..!

తాహీర్‌పై జాతి వివక్ష వ్యాఖ్యలు

జోహానెస్‌బర్గ్ : క్రికెట్‌లో ప్రత్యర్థి జట్ల ఆటగాళ్ల నుంచి జాతి వివక్ష వ్యాఖ్యలు గతంలో ఎన్నో చూశాం. కానీ ఈ కథ భిన్నం. ఓ అభిమాని నుంచి దక్షిణాఫ్రికా క్రికెటర్ వివక్షపూరిత వ్యాఖ్యలు చవి చూడాల్సి వచ్చిందని ఆరోపణ. భారత్‌తో నాల్గో వన్డేలో ఈ చేదు అనుభవం ఎదురైంది. నాల్గో వన్డేలో ఇమ్రాన్ తాహీర్ తుది జట్టులో లేకపోయినా.. 12వ ఆటగాడిగా డ్రెస్సింగ్‌రూమ్ నుంచి మైదానానికి సేవలందించాడు. ఈ సమయంలో అతడు పలుమార్లు డ్రెస్సింగ్‌రూమ్ నుంచి మైదానంలోకి వచ్చాడు. ఈ క్రమంలో స్టాండ్స్‌లో ఉన్న ఓ అభిమాని తాహీర్‌ను వివక్షపూరిత వ్యాఖ్యలతో దూషించాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 'నాకూ ఓ కుటుంబం' అని తాహీర్ అంటున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఈ సమయంలో వాగ్వాదం జరిగినా, ఎటువంటి భౌతిక దాడి చోటుచేసుకోలేదు. తాహీర్ వెంటనే విషయాన్ని మైదాన భద్రతా సిబ్బందికి తెలుపగా, ఈ వ్యక్తిని బయటకు పంపించారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది. దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు ఇప్పుడీ ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతోంది. గుర్తు తెలియన ఆ అభిమాని భారత్‌కు చెందిన వ్యక్తిగా చెబుతున్నా.. ఇంకా స్పష్టత రాలేదు. ఐసీసీ క్రమశిక్షణ నియమావళి ప్రకారం వివక్ష పూరిత వ్యాఖ్యలు చేసినట్టుగా తేలితే సదరు వ్యక్తిని చట్ట ప్రకారం శిక్షించవచ్చు.



జాతీయ క్రీడాకారులకు సన్మానం

● 17న సీఎం జన్మదినం సందర్భంగా సాట్స్ నిర్ణయం
● 15 నుంచి నేషనల్ తైక్వాండో పోటీలు ప్రారంభం



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా ఈనెల 17న తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ(సాట్స్) పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. దీనిలో భాగంగా వివిధ క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో పతకాలు సాధించిన రాష్ట్రానికి చెందిన క్రీడాకారులకు సన్మానం చేయాలని నిర్ణయించింది. వీటికి సంబంధించిన పలు వివరాలను సాట్స్ చైర్మెన్ వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం విలేకరులకు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం నుండి 2017-18 సంవత్సరానికి గానూ జాతీయస్థాయిలో ప్రాతినిథ్యం వహించి పతకాలు సాధించిన సబ్ జూనియర్, జూనియర్ మరియు సీనియర్ క్రీడాకారులను సాట్స్, ఒలింపిక్స్ అసోసియేషన్ సంయుక్తంగా శనివారం సన్మానించనున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకూ 20 క్రీడాంశాల నుంచి 307 మంది దరఖాస్తు చేసుకున్నారనీ, చేసుకోనివారు ఈనెల 16వరకూ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టుదలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు కష్టపడి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనే ఆకాంక్షతో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో కుస్తీక్రీడను ప్రోత్సహించడానికి కుస్తీ క్రీడాకారులకు క్రీడాసామాగ్రిని అందజేస్తున్నట్టు తెలిపారు. గచ్చిబౌలిలో ఈనెల 15 నుంచి చీఫ్‌మినిస్టర్ ఓపెన్ నేషనల్ తైక్వాండో పోటీలు ప్రారంభిస్తున్నామనీ, 17న వారికి బహుమతులు అందజేస్తామని అన్నారు. రాష్ట్రంలో 200మంది కోచ్‌ల నియామకానికి, 30మంది జాతీయస్థాయి క్రీడాకారులకు నెలకు రూ.10వేల చొప్పున ఉపకారవేతనం ఇచ్చేందుకు సాట్స్ బోర్డు సమావేశంలో నిర్ణయం చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఒలింపిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రంగారావు, ప్రేమ్‌రాజ్, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ముత్తా శ్రీనివాస్, మమతగుప్తా, చాడ కిషన్‌రెడ్డి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఆర్టీఐ పరిధిలోకి రావాల్సిందే

బీసీసీఐపై లా కమిషన్

న్యూఢిల్లీ : ప్రజా సంబంధాలు కల్గి, అందుకు సంబంధించి ప్రభుత్వ నుంచి పన్ను రాయితీ పొందుతున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సమాచార హక్కు చట్టం పరిధిలోకి వచ్చి తీరాల్సిందేనని లా కమిషన్ సిఫారసు చేయనున్నట్టు తెలుస్తోంది. తమిళనాడు సొసైటీస్ రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం బీసీసీఐ ప్రస్తుతం ప్రయివేటు సంస్థగా చలామణి అవుతోంది. బీసీసీఐ ప్రభుత్వం నుంచి భూమి, పన్ను మినహాయింపు రూపంలో ఆర్థిక సహాయం పొందుతోన్న కారణంగా ప్రయివేటు సంస్థగా చూడలేమని లా కమిషన్ చైర్మన్ జస్టిస్ బి.ఎస్ చౌహన్ పేర్కొన్నాడు. ఈ విషయంలో సుప్రీంకోర్టు సైతం జులై 2016 తీర్పులో బీసీసీఐ సమాచార హక్కు చట్టం పరిధిలోకి తీసుకురావాలని తీర్పునిచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బీసీసీఐకి సంబంధించి పలు సిఫారసులతో కూడిన నివేదికను లా కమిషన్ త్వరలోనే సమర్పించనున్నది. దీని ఆధారంగా బీసీసీఐని ఆర్టీఐ పరిధిలోకి తీసుకొచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.



46 వన్డేల్లో పది వేల పరుగులు పూర్తి చేసేందుకు ఎం.ఎస్ ధోని మరో 46 పరుగుల దూరంలో ఉన్నాడు. సచిన్, గంగూలీ, ద్రవిడ్‌ల తర్వాత 10,000 క్లబ్‌లో చేరిన నాల్గో భారత బ్యాట్స్‌మన్‌గా మహి నిలువనున్నాడు.

ఇక్కడైనా ముగిస్తారా?

సిరీస్ విజయంపై కన్నేసిన కోహ్లిసేన

● సఫారీ శిబిరంలో నూతనోత్తేజం
● దక్షిణాఫ్రికాతో నాల్గో వన్డే నేడు
● సా॥ 4.30 నుంచి సోనీటెన్‌లో..

డివిలియర్స్ వచ్చేశాడనే ధీమానో, గులాబీ తెచ్చిన ఉత్సాహమో కానీ కోహ్లిసేనకు వరుసగా నాల్గో విజయం అందకుండా దక్షిణాఫ్రికా నిలువరించింది. వర్షం, విరామం మనకు ప్రతికూలంగా మారటం, మణికట్టు స్పిన్నర్లు తేలిపోవటం టీమ్ ఇండియా సిరీస్ విజయం కోసం వేచిచూసేలా చేసింది. 6-0తో సిరీస్ సాధించేలా కనిపించిన కోహ్లిసేన ఒక్కసారిగా సిరీస్ కోసం పోరాడాల్సిన అవసరం ఏర్పడగా, ఆశలు అడుగంటిన సిరీస్‌లో సఫారీలు ఒక్కసారిగా ఇంకేదో చేయాలతో తపనతో ఉండటం యాధృచ్ఛికమే!. స్పిన్ స్వర్గధామంగా కనిపిస్తోన్న పోర్ట్ ఎలిజబెత్‌లో సిరీస్ విజయం అందుకునేందుకు కోహ్లిసేన రంగం సిద్ధం చేసుకున్నది. ఈ విజయంతో దక్షిణాఫ్రికాలో వన్డే సిరీస్ సాధించిన రికార్డు సృష్టించేందుకు భారత్ రెఢీ అయినా, మిడిల్ ఆర్డర్ వైఫల్యాన్ని సొమ్ముచేసుకొని మరో షాక్ ఇచ్చేందుకు దక్షిణాఫ్రికా ఎదురుచూస్తోంది. భారత్, దక్షిణాఫ్రికా నాల్గో వన్డే నేడు.

నవతెలంగాణ-పోర్ట్ ఎలిజబెత్

ఒక్క మ్యాచ్‌లో ఓటమి ఎంతటి ప్రభావం చూపిస్తుందో తాజా దక్షిణాఫ్రికా, భారత్ వన్డే సిరీస్‌ను చూస్తే తెలుస్తోంది. భారత్ తిరుగులేని ప్రదర్శనతో ఏకపక్షంగా సాగుతున్న వన్డే సమరం ఒక్కసారిగా ఉత్కంఠకు చోటిచ్చింది. వర్షం అంతరాయం కల్గించిన మ్యాచ్‌లో కుదించిన లక్ష్యాన్ని ఛేదించిన సఫారీలు.. ఇప్పుడు కోహ్లిసేన సిరీస్ అవకాశాలను కుదించటంపై దృష్టి సారించారు. ఆరు వన్డేల సిరీస్‌లో టీమ్ ఇండియా 3-1తో ఎదురులేని స్థితిలోనే కొనసాగుతున్నా.. దక్షిణాఫ్రికా విజయంలో అందరూ ఓ చేయి వేశారు. కానీ భారత శిబిరంలోనే ఒకరిద్దరు ఆడుతున్నారు. కోహ్లిసేన సమష్టి ప్రదర్శన చేయకపోయినా, దక్షిణాఫ్రికా జట్టు తత్వం కొనసాగించినా ఉత్కంఠ ఆఖరు వన్డే సెంచూరియన్‌కు చేరటం ఖాయమనిస్తోంది!.

మణికట్టు పనిపట్టు : భారత్ తొలి మూడు వన్డేల్లో మణికట్టు స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్ మాయతో అలవోకగా నెగ్గింది. కానీ నాల్గో వన్డేలో అది జరగలేదు. యువ స్పిన్నర్లపై వినూత్న ఎదురుదాడి చేసిన సఫారీలు వారికి వికెట్లు ఇవ్వకుండా విజయవంతమయ్యారు. కానీ నేడు పోర్ట్ ఎలిజబెత్‌లో మళ్లీ వీరిద్దరు విజృంభించేందుకు పిచ్ పరిస్థితులు స్వాగతం పలుకుతున్నాయి. నెమ్మదైన, కాస్త పచ్చిక ఉన్న పిచ్‌పై చాహల్, కుల్దీప్‌లు మళ్లీ సత్తా చాటితే భారత్‌కు ఎదురుండదు. ఇదే సమయంలో బ్యాటింగ్ లైనప్‌లో ధావన్, కోహ్లిలతో పాటు రోహిత్ శర్మ రాణించాల్సిన అవసరం ఉంది. హార్దిక్ పాండ్య, ధోనిలు సైతం ఆఖర్లో తమదైన ఇన్నింగ్స్ ఆడేందుకు ఎదురుచూస్తున్నారు. పది వేల పరుగులకు చేరువలో ఉన్న మహి బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చే అవకాశం లేకపోలేదు. స్పిన్‌కు అనుకూల పరిస్థితుల నేపథ్యంలో శ్రేయాష్ అయ్యర్ స్థానంలో మళ్లీ కేదార్ జాదవ్ తుది జట్టులోకి రానున్నాడు. సిరీస్ విజయం పూర్తి కాకపోవటంతో పేసర్లు భువి, బుమ్రాలు విశ్రాంతి లేకుండా మరో మ్యాచ్‌లో బరిలోకి దిగబోతున్నారు.

అలా ఆడితేనే : దక్షిణాఫ్రికా ఓపెనర్లు ఆమ్లా, మార్క్‌రంలు మణికట్టు స్పిన్‌పై తామెంటో నిరూపించుకునేందుకు ఇంకో రెండు అవకాశాలే వారి ముందున్నాయి. నాల్గో వన్డేలోనే అత్యధికంగా వీరు 43 పరుగులు జోడించారు. డివిలియర్స్ రాకతో మిడిల్ ఆర్డర్ పటిష్టంగా తయారవగా.. ఓపెనింగ్‌లో వీరు శుభారంభం ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది. మిల్లర్, క్లాసన్, డుమినిలు సైతం తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. మణికట్టు స్పిన్‌పై కొంత సఫలమైన సఫారీలు.. నేడు ఆ వ్యూహానికి మరింత పదును పెట్టాలి. లేదంటే టర్నింగ్ వికెట్‌లో భారత స్పిన్ ద్వయానికి ఆతిథ్య జట్టు దాసోహం అవటం పెద్ద విషయం కాబోదు.



తుది జట్లు (అంచనా) : భారత్ : రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లి, అజింక్య రహానె, శ్రేయాష్ అయ్యర్/కేదార్ జాదవ్, ఎం.ఎస్ ధోని, హార్దిక్ పాండ్య, భువనేశ్వర్ కుమార్, కుల్దీప్ యాదవ్, యుజ్వేంద్ర చాహల్, జస్‌ప్రీత్ బుమ్రా.

దక్షిణాఫ్రికా : హాషీమ్ ఆమ్లా, మార్క్‌రం, డుమిని, డివిలియర్స్, డెవిడ్ మిల్లర్, క్లాసన్, క్రిస్ మోరీస్, పెహల్యూక్‌వయో, రబాడ, మోర్నీ మోర్కెల్, ఇమ్రాన్ తాహీర్.

62 దక్షిణాఫ్రికా గడ్డపై ఆరు వన్డేల సిరీస్‌లో పీటర్సన్ (454) అత్యధిక పరుగుల రికార్డును బద్దలు కొట్టేందుకు కోహ్లి మరో 62 పరుగుల దూరంలో ఉన్నాడు. తొలి నాల్గు మ్యాచుల్లో విరాట్ 393 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

0 పోర్ట్‌ఎలిజబెత్‌లో టీమ్ ఇండియా ఇప్పటివరకూ ఒక్క మ్యాచ్‌లోనూ గెలుపొందలేదు. ఇక్కడ ఆడిన ఐదింటిలోనూ నిరాశే ఎదురైంది. నాల్గుసార్లు సఫారీ చేతిలో, ఓసారి కెన్యా చేతిలో భారత్ భంగపడింది.

కరంట్‌లేని బడులు పదేనా..?

టీఆర్‌టీలో కలపని 4,907 టీచర్ పోస్టులు

● సగం బడుల్లోనే ఇంగ్లీష్ మీడియం తరగతులు

● డిప్యూటీసీఎం హామీలన్నీ అమలు చేసినట్టు కమిటీ నివేదిక!

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో మొత్తం విద్యుత్‌సౌకర్యం లేని ఉన్నత పాఠశాలలు కేవలం పది మాత్రమే ఉన్నాయని అధికారులు లెక్కగట్టారు. వీటిలోనూ 8 పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సౌకర్యం లేవనీ, మరో రెండింటిలో విద్యుత్ కనెక్షన్ ఉన్నా, పనిచేయడం లేదని తేల్చిచెప్పారు. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఇచ్చిన హామీల అమలు కమిటీ వివరాలు విస్తుపోయేలా ఉన్నాయి. వారం రోజుల క్రితం ఈ కమిటీ సమావేశం జరిగింది. దీనిలో సుమారు 30 హామీలకు పైగా అన్ని అమలు చేసినట్టు కమిటీ నివేదిక రెడీ చేసింది. మొదటిదశలో అన్ని హైస్కూల్స్‌లో విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని కడియం శ్రీహరి గతంలో హామీనిచ్చారు. రాష్ట్రంలో 5,242 ఉన్నత పాఠశాలలుండగా, 4,232 బడుల్లో కరెంట్ సౌకర్యం ఉందని హామీల కమిటీ చెప్పింది. వాస్తవానికి చాలా పాఠశాలల్లో విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో కట్ చేశారు. అనేక బడుల్లో మరమత్తులు లేక బడులూ ప్రమాదకరంగా మారాయి. వీటికి కనీసం మరమత్తులు చేయడం లేదు. ఈ విషయాన్ని మాత్రం హామీల కమిటీ ఎక్కడా ప్రస్తావించలేదు. కేవలం మరమ్మత్తులు, కనెక్షన్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చినట్టు పేర్కొనడం గమనార్హం.

టీఆర్‌టీలో చేరని 4907 పోస్టులు..

టీఎస్‌పీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల నియామకాల కోసం మూడు నెలల క్రితం నోటిఫికేషన్ వచ్చింది. దీనిలో ఉమ్మడి పదిజిల్లాల పరిధిలో కేవలం 8,792 పోస్టులను మాత్రమే ఖాళీగా చూపించారు. అధికారిక లెక్కల ప్రకారమే 2,797 ఖాళీలను, మరో 2,100 పోస్టులను పదోన్నతుల ఖాళీలుగా చూపుతూ ఖాళీల జాబితాలో పేర్కొనలేదు. అయితే కేవలం నోటిఫికేషన్ కోసమే నాలుగేండ్లు కాలయాపన చేసిన సర్కారు, ఈ రాతపరీక్ష నిర్వహించి, ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు వచ్చే వరకూ ఎంతకాలం పడుతుందోనని అభ్యర్థులు ఆందోళన వ్యక్తమవుతున్నారు. నోటిఫికేషన్ మాత్రమే ఇచ్చిన ప్రభుత్వం, పోస్టుల భర్తీ హామీ నెరవేరినట్టు ప్రకటించుకోవడం గమనార్హం. గురుకులాలతో కలిపి 16658 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నామని అధికారులు ప్రకటించారు.



ఫైల్

5,472 బడుల్లో ఇంగ్లీష్‌మీడియం..

అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఇంగ్లీష్ మీడియం తరగతులు ప్రారంభిస్తామని గతంలో డిప్యూటీసీఎం ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకూ 5,472 ప్రైమరీ పాఠశాలల్లో ఇంగ్లీష్‌మీడియం తరగతులు ప్రారంభించారు.

వీటిలో రెండేండ్ల నుంచే ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలు ప్రారంభించాలని మెజార్టీ ఎంఎస్‌సీ కమిటీలు ప్రభుతానికి విన్నవించినా స్పందించలేదు. గడిచిన రెండేండ్లలో కేవలం సగం పాఠశాలల్లోనే ఇంగ్లీష్‌మీడియం తరగతులు ప్రారంభించారు. అయితే బడుల్లో ఇంగ్లీష్‌మీడియంలో డిగ్రీ చదివిన టీచర్లు ఉంటేనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. 2016-17 సంవత్సరంలో 10,944మంది టీచర్లకు (ఒక్కో పాఠశాలలో ఇద్దరి చొప్పున) శిక్షణ ఇచ్చారు. మొత్తం ఇంగ్లీష్‌మీడియం బడుల్లో సగం వరకూ ఒక్క కరీంనగర్ జిల్లాలోనే ఉండటం గమనార్హం.

5027 బడుల్లో డిజిటల్ తరగతులు...

రాష్ట్రంలో మొత్తం 5,600 హైస్కూల్స్‌లో జూన్ 2017 నాటికి డిజిటల్ తరగతులు ప్రారంభిస్తామని డిప్యూటీసీఎం హామీనిచ్చారు. అయితే ఇప్పటికీ 5,027 బడుల్లోనే డిజిటల్ తరగతులు ప్రారంభమయ్యాయి. గతేడాది 3,472 బడుల్లో ఈ తరగతులు ప్రారంభం కాగా, ఈ విద్యాసంవత్సరం 1555 బడుల్లో ప్రారంభించారు. 5242 బడులకు గానూ 5027 బడుల్లో మాత్రమే ఎల్‌సీడీ, కేయాన్‌ద్వారా పాఠాలు బోధించేందుకు అవకాశముంది. మిగిలిన 215 బడుల్లో టీఎస్‌టీఎస్ ద్వారా ఈ తరగతులు ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. మరుగుదొడ్ల నిర్మాణం, ఏకకృత సర్వీస్‌రూల్స్, గ్రంథాలయాల ఏర్పాటు, పలు కాలేజీల ఏర్పాటు హామీలపైనా కమిటీ నివేదిక ఇచ్చింది.

చెస్ క్రీడాకారులకు సాట్స్ అభినందన



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన పలువురు క్రీడాకారులకు తెలంగాణ రాష్ట్ర ప్రాధికార సంస్థ (సాట్స్) అభినందనలు తెలిపింది. జనవరి 2018లో స్పెయిన్‌లో జరిగిన అండర్-19 ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ టైటిల్‌ను తెలంగాణ రాష్ట్రానికి చెందిన హర్షభరత్‌కోటి (వరంగల్) అందుకున్నారు. డిసెంబర్-2017లో నెదర్లాండ్‌లో జరిగిన అండర్ -17 ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్ టైటిల్ చాంపియన్‌గా హైదరాబాద్‌కు చెందిన రాహుల్ శ్రీవాత్సవ, డిసెంబర్-2017లో కోయంబత్తూర్‌లో జరిగిన అండర్ 17 నేషనల్ చెస్ చాంపియన్‌షిప్‌లో రాజరిత్విక్ విజేతగా నిలిచారు. సోమవారం ముగ్గురు క్రీడాకారులు సాట్స్ చైర్మెన్ వెంకటేశ్వర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను అభినందించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-00020, Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan, 1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.